అక్షర కలం తెలుగు దిన పత్రికలో
పదవి విరమణ, కోర్టు నోటీసులు,
జన్మదిన, వ్యాపార అభివృద్ధి కొరకు
మరియు అన్ని రకాల ప్రకటనలు
ప్రచురించబడును.
సంప్రదించండి
93962 18955
aksharakalam@gmail.com
అక్షరకలం
తెలుగు దినపత్రిక

epaper. aksharakalam. com

# అక్షరకలం

తెలుగు దినపత్రిక

aksharakalam@gmail.com

అక్షరకలం
తెలుగు దినపత్రిక
విలేఖరులు కావలెను
తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా దూసుకెళ్తున్న 'అక్షర కలం'తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు మండలాల వారిగా, నియోకవర్గాలవారిగా, జిల్లాల వారిగా విలేకరులు, యాడ్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను.
గమనిక : డిగ్రీ ఉత్తీర్ణులు మరియు వివిధ పత్రికలలో పని చేసిన అనుభవం ఉన్నవారికి ప్రాముఖ్యత కలదు
epaper.aksharakalam.com
aksharakalam@gmail.com
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ :
93962 18955


సంపుటి : 17 సంచిక : 260 | 01-11-2025 శనివారం | ఎడిటర్ : పిట్టల రామకృష్ణ | నల్లగొండ | హైదరాబాద్ | వరంగల్ | మహబూబ్‌నగర్ | పేజీలు : 12 వెల : రూ.1.00



## చంద్రబాబును చూసి నేర్చుకో

తుఫాన్ సమయంలో ఇలాగేన వ్యవహరించేది
గతంలో ఇస్తామన్న సాయం ఎందుకు ఇవ్వలేదు
మైనార్టీ ఓట్లకోసమే అజార్‌కు పదవి
అజారుద్దీన్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు నిజం కాదా
బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు

వార్త 2లో



## తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు

వార్త 2లో



## ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

రూ.1,031 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల
నిధుల విడుదల చేస్తూ డిప్యూటీ సిఎం భట్టి ఆదేశం

వార్త 2లో






# చరిత్ర సృష్టిద్దాం రండి

●పటేల్ భారత్ చరిత్ర సృష్టించారు
●జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ

చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారని, అందుకే ఆయన దేశాన్ని ఏకం చేశారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని మోడీ కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం అని అన్నారు.



# అధికారుల్లో సమన్వయ లోపం..స్పష్టం

●అది వరంగల్ వరదల్లో కనిపించింది
●ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు
●మొంథా తుఫాన్‌తో 12జిల్లాల్లో ప్రభావం
●పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు
●మృతి చెందిన వారికి 5లక్షల పరిహారం
●ఎకరా పంట నష్టానికి 50వేలు చెల్లింపు
●ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు
●వరంగల్ వరద ప్రాంతాల్లో సిఎం ఏరియల్ సర్వే
●కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష



'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతి నిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హను మకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు.

వార్త 6లో



## సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

2 లో..

ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు
కేబినేట్ మీటింగ్‌కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు

## మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

●రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్
●సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు

వివరాలు 2లో..



## సమాచారశాఖ డిడి ప్రసాదరావు పదవీవిరమణ

అభినందనలు తెలిపిన తోటి ఉద్యోగులు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

సమాచార పౌర సంబంధాల శాఖలో డిప్యూటీ డైరెక్టర్ గా ఉన్న జి ప్రసాదరావు శుక్రవారం పదవీ విరమణ చేశారు వివిధ హోదాల్లో దాదాపు 41 సంవత్సరాల సర్వీసు అనంతరం నేడు ప్రసాదరావు పదవి విరమణ కార్యక్రమాన్ని సమాచార భవన్ లో ఘనంగా నిర్వహించారు. ఖమ్మం, వరంగల్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాల్లో వివిధ హోదాల్లో పని చేసిన ప్రసాదారావు సేవలను ఈ పదవీ విరమణ కార్యక్ర మానికి హాజరైన సీనియర్ అధికారులు కొనియాడారు. ఈ పదవి విరమణ కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్లు డీ.ఎస్ జగన్, డి శ్రీనివాస్, కే వెంకటరమణ, డిప్యూటీ డైరెక్టర్లు హాష్మి, వై వెంకటేశ్వర్లు, సురేష్, ఆర్.ఐ.ఈ జయరాం మూర్తి, తెలంగాణ మాసపత్రిక ఎడిటర్ శాస్త్రి లతోపాటు సమాచార శాఖ అధికారులు, సిబ్బంది, డిడి ప్రసాద్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.





# రెండేళ్లలోనే రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన కాంగ్రెస్

నోటికొచ్చిన హామీలు ఇచ్చి అధికారంలోకి రాక
బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్ విమర్శలు

హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి

రెండేళ్లలోనే రాష్ట్రాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం భ్రష్టు పట్టించిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ భవన్ లో పలువురు ఎంఐఎం నాయకులకు కండువా కప్పి గులాబీ పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడారు. నోటికొచ్చిన హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని మండిపడ్డారు. ఆడబిడ్డలకు తులం బంగారం ఇస్తాం.. యువతులకు స్కూటీలు ఇస్తాం.. వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ ఇస్తామంటూ అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్, ఒక్క హామీని కూడా అమలు చేయలేదని దుయ్యబట్టారు. ఇలాంటి సమయంలోనే ప్రజలు తెలివిగా ఆలోచించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రాన్ని కాంగ్రెస్ పార్టీ ఎలా దారి తప్పించిందో గుర్తుచేసుకోవాలని అన్నారు. జూబ్లీ హిల్స్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అభ్యర్థిని గెలిపించి కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. డబ్బులు ఇచ్చి ప్రలోభ పెట్టేందుకు కూడా కాంగ్రెస్ ప్రయత్నిస్తోందని.. ఆ డబ్బులు తీసుకొని మిగితా బాకీ డబ్బులు ఎప్పుడిస్తారో నిలదీయాలన్నారు. ఇవి కారుకు, బుల్డోజర్‌కు మధ్య జరుగుతున్న ఎన్నికలని అభివర్ణించారు. హైడ్రా పేరుతో పేదల ఇండ్లు కూలగొట్టిన ఈ బుల్డోజర్ ప్రభుత్వానికి ఓటుతో బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. కొందరు కాంగ్రెస్ నేతలు ప్రజలపై బెదిరింపులకు దిగుతున్నారని.. వారికి ఎవ్వరూ భయపడాల్సిన పనిలేదని ధైర్యం చెప్పారు. ప్రజలకు బీఆర్ఎస్ పార్టీ ఎప్పటికీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మాగంటి సునీతను భారీ మెజార్టీతో గెలిపించాలని కేటీఆర్ కోరారు.

# సలహాదారులుగా సుదర్శన్ రెడ్డి, ప్రేమ్‌సాగర్ రావులు

**ఇద్దరికీ క్యాబినేట్ హోదాతో నియామకాలు**

**కేబినేట్ మీటింగ్‌కు హాజరయ్యేలా సుదర్శన్‌కు వెసలుబాటు**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

:సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం మరో వ్యూహాత్మక నిర్ణయం తీసుకుంది. సీనియర్ నేత, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఆయనకు ఆరు గ్యారంటీల అమలు బాధ్యతలు అప్పగించింది. కేబినెట్ విస్తరణలో చోటు దక్కకపోవడంతో నిరాశ చెందిన సుదర్శన్ రెడ్డికి ఇప్పుడు కీలకమైన బాధ్యత లభించడం, పార్టీ అంతర్గత రాజకీయాల్లో సమతుల్యత సాధించే ప్రయత్నంగా విశ్లేషకులు భావిస్తున్నారు. మంత్రి పదవి ఆశించిన మరో సీనియర్ నేత, మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావును సివిల్ సప్లై కార్పొరేషన్ ఛైర్మన్‌గా నియమిస్తూ అధిష్టానం నిర్ణయం తీసుకుంది. మొత్తానికి, బుజ్జగింపు చర్యలు సఫలీకృతమైనట్లు కాంగ్రెస్ భావిస్తోంది. నిజామాబాద్ జిల్లా బోధన్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి ప్రొద్దుటూరి సుదర్శన్ రెడ్డిని ప్రభుత్వ సలహాదారుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అభి వృద్ధి కార్యక్రమాల అమలు సలహాదారుడిగా నియమిస్తున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. సుదర్శన్ రెడ్డి కేబినెట్ సమావేశాలకు కూడా ప్రత్యేక ఆహ్వానితులుగా ఉంటారు. మంత్రుల నివాస ప్రాంగణంలో ఆయన క్వార్టర్ కేటాయించాలని కూడా ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావుకు పౌరసర ఫరాల కార్పొరేషన్ ఛైర్మన్ పదవిని ప్రభుత్వం అప్పగించింది. ఆయనకు కూడా కేబినెట్ హోదా కల్పిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది.

# చంద్రబాబును చూసి నేర్చుకో

**తుఫాన్ సమయంలో ఇలాగేన వ్యవహరించేది**

**గతంలో ఇస్తామన్న సాయం ఎందుకు ఇవ్వలేదు**

**మైనార్టీ ఓట్లకోసమే అజార్‌కు పదవి**

**అజారుద్దీన్‌పై ఫిక్సింగ్ ఆరోపణలు నిజం కాదా**

**బిజెఎల్‌పి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి విమర్శలు**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణ రాష్ట్రమంతా మొంథా తుఫాన్‌లో అల్లకల్లోలం అవుతోందని.. ఈ క్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి ఏం చర్యలు చేపట్టారని బీజేపీ శాసనసభాపక్షనేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ప్రశ్నించారు. మొంథా తుఫాన్ చర్యలపై ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడిని చూసి రేవంత్‌రెడ్డి నేర్చుకోవాలని ఎద్దేవా చేశారు. తెలంగాణలో ఏప్రిల్, మేలో కూడా అకాల వర్షాలు కురిశాయని.. ఆ సమయంలో పంట నష్టం జరిగితే సీఎం రేవంత్‌రెడ్డి రూ. 10 వేలు పరిహారం ఇస్తామని చెప్పారని.. ఇంకా ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. కేవలం పేపర్ స్టేట్‌మెంట్ మాత్రమే ఇస్తున్నారని.. ఆచరణలోకి ఎందుకు తీసుకురావడం లేదని ప్రశ్నల వర్షం కురిపించారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ కార్యాలయంలో మహేశ్వర్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. తుఫాను, వర్షం తదితర విపత్కర పరిస్థితులపై అధికారులతో లెక్కలు తెప్పించుకోవడం.. తర్వాత గాలికి వదిలేయడం రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి పరిపాటిగా మారిందని విమర్శించారు. రేవంత్‌రెడ్డి సీఎం అయ్యాక.. ఎన్ని ఎకరాలకు పరిహారం ఇచ్చారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ప్రజలని, రైతులని ఆదుకోవాలనే ఆలోచన రేవంత్‌రెడ్డికి లేదన్ని ÷ర్ అయ్యారు. తడిసిన ధాన్యంతో కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో ఎంత దుర్మార్గమైన పాలన జరుగుతుందో ఇంత కంటే నిదర్శనం ఏం కావాలని ప్రశ్నించారు. మొసలి కన్నీళ్లు కార్చి.. గాలి మోటార్లలో సీఎం రేవంత్‌రెడ్డి తిరుగుతున్నారని ఆక్షేపించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో మైనార్టీ ఓట్ల కోసం సీఎం రేవంత్‌రెడ్డి ఆడుతున్న ఆటని తెలంగాణ ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా మ్యాచ్ ఫిక్సింగ్‌కి పాల్పడ్డారనే ఆరోపణలు ఉన్నాయని.. ఆయనతో మంత్రిగా ఎలా ప్రమాణ స్వీకారం చేయించారని ప్రశ్నల వర్షం కురిపించారు. గో సంరక్షకులను తుపాకీతో కాలిస్తే ఇంకా చర్యలు ఎందుకు తీసుకోలేదని ప్రశ్నించారు. సీఎం వెనుక మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఉన్నారని ఆరోపించారు. అసదుద్దీన్ డి ఫాక్టో సీఎంగా వ్యవహారిస్తున్నారని విమర్శించారు ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్, మజ్లిస్ ఆడుతున్న నాటకాలని ప్రజలు గమనిస్తున్నారని చెప్పుకొచ్చారు. మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబు రాజ్యాంగాన్ని ఇద్దరే చదివినట్లున్నారని విమర్శించారు. ఒక వర్గం మెప్పు కోసం కాంగ్రెస్ చేసే ప్రయత్నం చట్ట వ్యతిరేకమని ఆక్షేపించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో నవీన్ యాదవ్‌కి మజ్లిస్ మద్దతు ఇచ్చిందని గుర్తుచేశారు. ఈ ఎన్నికలో ఎంఐఎం అభ్యర్థిని ఎందుకు నిలబెట్టలేదని నిలదీశారు. అజారుద్దీన్‌కి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే కాకముందే మంత్రి పదవిని అసదుద్దీన్ ఇప్పించుకున్నారని విమర్శించారు. హిందువులను విస్మరించిన సీఎం రేవంత్‌రెడ్డి మైనార్టీ నేతలకి పట్టం కడుతున్నారన్ని ÷ర్ అయ్యారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో హిందువులే కాంగ్రెస్‌కి దిమ్మ తిరిగే తీర్పు ఇవ్వబోతున్నారని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి హెచ్చరించారు.

# తెలంగాణ ఇంటర్ పరీక్షల షెడ్యూల్ విడుదల

**ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్**

**ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు పరీక్షలు**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**

తెలంగాణలో 2026 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఇంటర్మీడియట్ పరీక్షల తేదీలను ఇంటర్మీడియట్ బోర్డు విడుదల చేసింది. వచ్చే ఏడాది ఫిబ్రవరి 25 నుంచి మార్చి 18 వరకు ఈ పరీక్షలు జరగనున్నట్లు తెలిపింది. ఫిబ్రవరి 2వ తేదీ నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభమై ఫిబ్రవరి 21వ తేదీ నాటికి పూర్తవుతాయని పేర్కొంది. ఇంటర్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్ విద్యార్థులకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపింది. ఇప్పటివరకు కేవలం సెకండ్ ఇయర్ విద్యార్థులకు మాత్రమే ప్రాక్టికల్ పరీక్షలు జరిగేవి. ఈసారి వీరితో పాటు ఫస్ట్ ఇయర్ విద్యార్థులకూ ల్యాబ్ ప్రాక్టికల్స్ నిర్వహించాలని బోర్డు నిర్ణయించింది. ఈ నిర్ణయంతో జనవరి 21వ తేదీన ఫస్ట్ ఇయర్ విద్యార్థులకు ఇంగ్లీష్ ప్రాక్టికల్ పరీక్ష, జనవరి 23వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, జనవరి 24వ తేదీన ఎన్విరాన్ మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహించనున్నారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త

**రూ.1,031 కోట్ల పెండింగ్ బిల్లుల విడుదల**

**నిధుల విడుదల చేస్తూ డిప్యూటి సిఎం భట్టి ఆదేశం**

**హైదరాబాద్,**

తెలంగాణ ప్రభుత్వం ఉద్యోగులకు తీపి కబురు అందించింది. ఉద్యోగుల బకాయిలతోపాటు పంచాయతీ రాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించిన అక్టోబర్ నెల పెండింగ్ బిల్లులు సుమారు రూ.1,031 కోట్లను విడుదల చేసింది. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాల మేరకు ఆర్థిక శాఖ అధికారులు ఏకకాలంలో నిధులను విడుదల చేశారు. హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో శుక్రవారం ఆర్థిక శాఖ అధికారులతో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సమీక్షా సమావేశం నిర్వహించారు. ఇందుకు సంబంధించి పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. గత ప్రభుత్వ కాలం నుంచి పెండింగ్ లో ఉన్న ఉద్యోగుల బకాయిలను కాంగ్రెస్ సర్కార్ దశలవారీగా క్లియర్ చేస్తూ వస్తోంది. అందులో భాగంగా అక్టోబర్ నెలకు సంబంధించి ప్రభుత్వ ఉద్యోగుల బకాయిలు రూ.712 కోట్లను విడుదల చేశారు. రూ.10లక్షల లోపు పెండింగ్ బిల్లులను సైతం క్లియర్ చేయాలన్న సర్కార్ నిర్ణయంలో భాగంగా పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ శాఖకు సంబంధించి 46,956 బిల్లుల తాలూకు రూ.320 కోట్లను డిప్యూటీ సీఎం ఆదేశాల మేరకు అధికారులు రిలీజ్ చేశారు. రోడ్లు, భవనాల శాఖకు చెందిన రూ.10లక్షల లోపు విలువగల 3,610 బిల్లుల మొత్తం సుమారు రూ.95కోట్లను ఆర్థిక శాఖ అధికారులు విడుదల చేశారు. అదేవిధంగా పంచాయతీరాజ్, గ్రామీణ స్థానిక సంస్థలకు సంబంధించిన 43,364 బిల్లుల మొత్తం రూ.225 కోట్లనూ అధికారులు రిలీజ్ చేశారు.

# చరిత్ర సృష్టిద్దాం రండి


**పటేల్ భారత్ చరిత్ర సృష్టించారు**

**జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ**

**గాంధీనగర్, అక్షరకలం ప్రతినిధి**



చరిత్ర రాయడంలో సమయం వృథా చేయకూడదని, దానిని సృష్టించాలని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విశ్వసించారని, అందుకే ఆయన దేశాన్ని ఏకం చేశారని ప్రధాని నరేంద్రమోడీ అన్నారు. దానికి తగ్గట్టే భారతదేశాన్ని ఏకంచేసి ఆయన చరిత్ర సృష్టించారని మోడీ కొనియాడారు. గుజరాత్‌లో ఐక్యతా విగ్రహం వద్ద పటేల్ 150వ జయంతి వేడుకల్లో ప్రధాని మోడీ పాల్గొని ప్రసంగించారు. స్వాతంత్ర్యం తర్వాత 550 సంస్థానాలను ఏకం చేసి అసాధ్యమైన పనిని సుసాధ్యం చేశారు. ఆయనకు ఏక్ భారత్, శ్రేష్ఠ భారత్ దార్శనికత అత్యంత ముఖ్యమైంది. దానిని మేం సమర్థిస్తాం అని అన్నారు. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవాల మాదిరిగానే ఏక్తా దివస్‌ను జరుపుకొంటున్నాం. భారతీయులంతా ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉంది. విభజన శక్తులకు దూరంగా ఉండాలి. దేశ సమగ్రతకు నక్సలిజం ముప్పుగా పరిణమించింది. నక్సల్స్ ఏరివేత కోసం ఎన్నో ఆపరేషన్స్ చేశాం. నక్సలిజం మూలాలను సమూలంగా పెకిలిస్తాం. కశ్మీర్ మొత్తాన్ని భారత్‌లో కలపాలని పటేల్ ఆకాంక్షించారు. దానిని నెహ్రూ గౌరవించలేదు. పటేల్, అంబేడ్కర్‌ను కాంగ్రెస్ అవమానించింది. ఆయన దూరదృష్టిని మరిచిపోయిందని అన్నారు. కాంగ్రెస్ చేసిన తప్పు వల్లే కశ్మీర్‌లో కొంత భాగాన్ని పాకిస్థాన్ ఆక్రమించింది. దానివల్ల కశ్మీర్, దేశంలో అశాంతి నెలకొంది. ఉగ్రవాదాన్ని దాయాది దేశం పెంచి పోషించింది. ఇంత జరిగినా ఉగ్రవాదుల ముందు కాంగ్రెస్ తలవంచింది. ఆపరేషన్ సిందూర్ ద్వారా భారత్ బలాన్ని ప్రపంచం మొత్తం చూసింది. మన దేశం నిజమైన బలం ఏంటో ఆ ఉగ్రవాదులకు తెలిసింది. దేశ ఐక్యతను బలోపేతం చేసే చర్యలను ప్రోత్సహించాం. ఆయన ఆకాంక్షలను మేం గౌరవించాం. అక్రమ వలసదారులపై చర్యలు తీసుకుంటుంటే కొందరికి బాధగా ఉంటుంది. దేశం నుంచి చొరబాటుదారులను తరిమికొట్టాలని ప్రతిజ్ఞ చేద్దాం అని మోదీ పిలుపునిచ్చారు. పటేల్ జయంతి సందర్భంగా ప్రత్యేక నాణెం, స్టాంపు విడుదల చేశామని వెల్లడించారు. పటేల్



జయంతి సందర్భంగా ఏక్తా దివస్‌ను పురస్కరించుకొని ప్రత్యేక పరేడ్ ఏర్పాటుచేశారు. ఇందులో సైనిక దళాల కవాతు ఆకట్టుకుంది.

# మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణం

**రాజ్‌భవన్‌లో ప్రమాణం చేయించిన గవర్నర్**

**సిఎం రేవంత్ , మంత్రులు తదితరుల హాజరు**

**హైదరాబాద్, అక్షరకలం ప్రతినిధి**



తెలంగాణ మంత్రిగా అజారుద్దీన్ ప్రమాణ స్వీకారం చేశారు. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు పాల్గొన్నారు. హైదరాబాద్ రాజ్‌భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అజారుద్దీన్‌తో ప్రమాణం చేశారు. అల్లా సాక్షిగా ఇంగ్లీషులో ఆయన ప్రమాణం చేశారు. అంతరం గవర్న్, సిఎంలు పుష్పగుచ్ఛాలు ఇచ్చి అభినందనలు తెలియచేశారు. మధ్యాహ్నం 12.15గంటల ప్రాంతంలో ప్రమాణ స్వీకారం చేయించారు. కేబినెట్ విస్తరణలో భాగంగా ఆయన ఒక్కరే మంత్రిగా ప్రమాణం చేశారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, పలువురు మంత్రులు హాజరయ్యారు. నూతన మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు. ఇంతకీ ఏ శాఖను కేటాయిస్తారు అనే అంశంపై క్లారిటీ లేదు. మంత్రి వర్గ విస్తరణపై గత కొన్ని రోజులుగా ఏఐసీసీలో కసరత్తు జరిగింది. రాష్ట్రమంత్రి వర్గ విస్తరణకు ఇటీవల ఏఐసీసీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ప్రస్తుతం రాష్ట్ర కేబినెట్‌లో 15 మంది ఉండగా.. మరో ముగ్గురికి మంత్రి పదవులు ఇచ్చేందుకు అవకాశముంది. అయితే, ముస్లిం మైనార్టీ వర్గానికి చెందిన అజాహరుద్దీన్‌కు మాత్రమే ప్రస్తుతం మంత్రి పదవి ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్రంలో ఎప్పుడు కేబినెట్ ఏర్పడినా.. ముస్లిం మైనార్టీకి ఒక మంత్రి పదవి ఉండేది. కాంగ్రెస్ పార్టీ తరఫున చాలా మంది ముస్లిం మైనార్టీలు ఎన్నికల్లో పోటీ చేసినప్పటికీ ఈసారి ఎక్కడా గెలవలేదు. దీంతో ఆ వర్గానికి కేబినెట్‌లో అవకాశం కల్పించేందుకు సాధ్యపడలేదు. కాగా.. అజాహరుద్దీన్ జూబ్లీహిల్స్ అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. తాజాగా జరుగుతున్న జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధపడ్డారు. అయితే, ఆయనకు కాంగ్రెస్ అధిష్టానం ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నిర్ణయించింది. గవర్నర్ కోటా కింద ఎమ్మెల్సీలుగా అజాహరుద్దీన్, తెలంగాణ జనసమితి అధ్యక్షుడు కోదండరామ్‌ను కాంగ్రెస్ పార్టీ ఎంపిక చేసింది. అయితే, వీరిద్దరి నియామకానికి గవర్నర్ ఇంకా ఆమోదం తెలపలేదు. ఎమ్మెల్సీ నియామక పక్రియ పూర్తికాకపోయినప్పటికీ అజాహరుద్దీన్ మంత్రిగా ప్రమాణం చేసేందుకు ఏఐసీసీ ఆమోదం తెలిపింది. 1963 ఫిబ్రవరి 8న హైదరాబాద్‌లో అజారుద్దీన్ జన్మించారు. అబిడ్స్‌లోని ఆల్ సెయింట్స్ హైస్కూల్‌లో పాఠశాల విద్యను అభ్యసించారు. నిజాం కాలేజీలో బీకాం చదివారు. మేనమామ జైనులాబుద్దీన్ స్ఫూర్తితో క్రికెట్ వైపు అడుగులు వేశారు. 1984లో అంతర్జాతీయ క్రికెట్‌లో రంగప్రవేశం చేశారు. అజారుద్దీన్ క్రికెటర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు. తొలి మూడు టెస్టుల్లోనూ సెంచరీలతో సంచలనం సృష్టించారు. 1989లో భారత క్రికెట్ జట్టు కెప్టెన్‌గా భాధ్యతలు చేపట్టారు. 16 ఏళ్ల క్రికెట్ కెరీర్‌లో 99 టెస్టులు, 334 వన్డేలు ఆడారు. రిటైర్మెంట్ తర్వాత రాజకీయాల్లోకి వచ్చారు. 2009 ఫిబ్రవరి 19న కాంగ్రెస్‌పార్టీలో చేరారు. అదే సంవత్సరం యూపీలోని మొరాదాబాద్ స్థానం నుంచి ఎంపీగా గెలుపొందారు. 2018లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా అజారుద్దీన్‌ను నియమించారు.









# ఒంగోలు పట్టణ వ్యాపారుల లబోదిబో

## వరదలతో పూర్తిగా కొట్టుకుపోయిన సరుకు

## ఆదుకోవాలని ప్రభుత్వానికి వేడుకోలు

**ఒంగోలు,**

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలు ఉమ్మడి ప్రకాశం జిల్లాను అతలాకుతలం చేశాయి. అన్నదాతలతో పాటు, సామాన్యులు కూడా దెబ్బతిన్నారు. ముఖ్యంగా వీధి వ్యాపారుల అవస్థలు చెప్పలేం. ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథగా ఉంది. చిరు వ్యాపారులను తుఫాన్ వర్షం నిలువునా ముంచింది. జిల్లా కేంద్రం ఒంగోలు నగరంలో ఊహించని విధంగా భారీఎత్తున వరద నీరు ముంచెత్తడంతో తీవ్ర నష్టం వాటిల్లింది. కిరణా సామగ్రి విక్రయదారులు, దర్జీలు, తినుబండరాలు అమ్మేవారు, మోటారు మెకానిక్‌లు ఇలా చేతివృత్తులదారులందరూ తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వారంతా విజ్ఞప్తి చేస్తున్నారు. అల్పపీడనం, అనంతరం మొంథా తుపాను ప్రభావంతో గత పది రోజులుగా కురిసిన భారీ వర్షాలతో వ్యాపారాలు అంతంతమాత్రంగా సాగాయి. వర్షాలకు జన సంచారం తగ్గి అమ్మకాలు సాగక చిరు వ్యాపారులకు పూట గడవని పరిస్థితి నెలకొంది. తొలుత ఎలాంటి వరద లేకపోవడంతో ఎప్పుడూ వచ్చే మాదిరి వరద నీరు వచ్చి పోతుందని పెద్దగా జాగ్రత్తలు తీసుకోలేదు. చాలామంది సామగ్రి సర్దుకోలేదు. చాలామంది దుకాణం ఒకచోట, నివాసం మరోచోట ఉండటంతో సామగ్రిని భద్రపరచుకోలేకపోయారు. భారీఎత్తున వరద నీరు చుట్టుముట్టేయడంతో దుకాణాల్లో నీరు చేరింది. దీంతో సామగ్రి పూర్తిగా తడిసిపోయి ఎందుకూ పనికిరాకుండాపోయాయి. వరదతో దుకాణంలో బురద మేటలు వేసిందని, దీంతో తీవ్రంగా నష్టపోయినట్లు వివరించారు. వస్తువులను తయారు చేసే చిన్న ఖార్ఖానాలను వరద నీరు ముంచెత్తడంతో వారంతా నష్టపోయారు. ప్రధానంగా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువను ఆనుకుని ఉన్న కాలనీల్లో చిరు వర్తకులకు తీవ్ర నష్టం ఎదురైంది. నష్టాన్ని పరిశీలించి తమకు సాయం చేయాలని వారంతా కోరుతున్నారు. ఒంగోలు నగరం మొంథా దెబ్బకు జలవిలయాన్ని సృష్టించంది. నగరం మొత్తం నీట మునిగింది. దీంతో చిన్నాచితక వ్యాపారాలు చేసేవారి సామాగ్రి నీట మునిగిపోవడం లేదా కొట్టుకుపోవడం జరిగింది. బలరాం కాలనీకి వెళ్లే దారిలో వంతెన వద్ద సమోసాలు హోల్‌సేల్‌గా విక్రయించే దుకాణంలో పిండి బస్తాలు తడిచిముద్దయి పనికి రాకుండాపోయాయి. ఇదే ప్రాంతంలో పాత సామగ్రి కొనుగోలు దుకాణంలోని మొత్తం సరకు కొట్టుకుపోయినట్లు వ్యాపారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎప్పుడు వర్షం కురిసినా మోకాలి లోతున నీళ్లు వస్తుంటాయని, ఆమేర జాగ్రత్త పడతామని ఈసారి ఊహించని విధంగా వరద ముంచేసిందని ఓ కిరాణా వ్యాపారి వాపోయారు. ఇటీవల కాలంలో ఇంత వరద తామెప్పుడూ చూడలేదని పలువురు కన్నీటిపర్యంతమయ్యారు.

# వర్షాలతో అంటువ్యాధులు రాకుండా చర్యలు

## ప్రభుత్వ వైద్యశాలల్లో అందుబాటులో మందులు

**నల్గొండ**

ఇటీవలి వర్షాల వల్ల అంటు వ్యాధులు ప్రబలకుండా జిల్లా వ్యాప్తంగా ఎపిడమిక్ సెల్, రెస్క్యూ టీంలను ఏర్పాటు చేశామని నల్గొండ జిల్లావైద్యాధికారి పుట్ల శ్రీనివాస్ వెల్లడించారు. డివిజన్ల వారీగా జిల్లా కార్యాలయంలో టోల్‌ఫ్రీ నంబర్లు ఏర్పాటు చేశారు. పీహెచ్‌సీల్లో వైద్యులకు సెలవులు రద్దు చేశామని, అత్యవసర సేవలు అందించేందుకు పాము, తేలుకాటుకు సంబంధించిన ఔషధాలు సిద్ధంగా ఉంచామన్నారు. డెంగీ, జ్వరాలు రాకుండా కాచిచల్లార్చిన నీటిని తాగాలి. వృద్ధులు, గర్భిణులు జాగ్రత్తలు పాటించాలన్నారు. మూడు జిల్లాసుపత్రుల్లో రోగులు చికిత్స కోసం వచ్చినా తగిన ఏర్పాట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు. ఎక్కువగా జ్వరాలు, దగ్గు, జలుబు వంటి అంటువ్యాధులతో పాటు పదుల సంఖ్యలో రైతులు పాము, తేలుకాటుకు గురైనవారు ఉన్నట్లు పేర్కొన్నారు. అన్ని పీహెచ్‌సీల్లో సరిపడా అత్యవసర మందులు అందుబాటులో ఉంచారు. పల్లె, బస్తీ దవాఖానాల్లోని వైద్యులకు నవంబరు 3 వరకు అత్యవసర పరిస్థితుల్లో తప్ప సెలవులు రద్దు చేశారు. ఇకపోతే మొంథా తుపాను ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో కొన్ని రహదారులు ఛిద్రమయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా .. శిథిలమైన పాత భవనాలు, ఇళ్లు నేలమట్టమయ్యాయి. ప్రధానంగా సూర్యాపేట- వరంగల్ ప్రధాన రహదారిపై నెమ్మికల్ వద్ద రహదారి కోతకు గురికావడంతో రాకపోకలు నిలిచాయి. దీంతో అధికారులు చివ్వెంల-ఏపూరు మీదుగా ఖమ్మం రోడ్- వరంగల్‌కు భారీ, చిన్నతరహా వాహనాలను మళ్లించారు. చింతలపాలెం-దొండపాడు వద్ద 100 మీటర్ల వరకు రహదారిపై కోత పడటంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. యాదాద్రి జిల్లాలోని రుద్రవెల్లి- జూలూరు, బొల్లేపల్లి-సంగెం గ్రామాల మధ్య వరద ఉద్ధృతి తగ్గే వరకు రాకపోకలు నిలిపివేశారు. నల్గొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం చందంపేట మండలంలోని 12 గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. మూడు జిల్లాల్లో 30 ఇళ్లు పూర్తిగా, 53 ఇళ్లు పాక్షికంగా నేలకూలాయని కలెక్టరేట్‌లోని విపత్తు, స్పందనల శాఖలోని కంట్రోల్ రూమ్ పర్యవేక్షణ అధికారులు వెల్లడించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మొత్తం 39 ప్రాంతాల్లో 13.46 కి.మీ మేర రహదారులు దెబ్బతిన్నాయి. 25 చోట్ల రహదారులపై అంతరాయం ఏర్పడింది. మొత్తం రూ.70.46 లక్షల నిధులతో మరమ్మతులు చేసేందుకు రహదారులు, భవనాల శాఖ అధికారులు తాత్కాలిక అంచనాలు ప్రతిపాదించి.. శాశ్వత మరమ్మతులకు సుమారు రూ.20.8 కోట్లు అవసరమవుతాయని ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు.

# కొట్టుకుపోయిన మొత్తం ధాన్యం

## ఆదుకోవాలంటున్న రైతాంగం

**కరీంనగర్,**

సైదాపూర్ లో కురిసిన భారీ వాన రైతులకు కన్నీరు మిగిల్చింది. పట్టణంలోని ఎల్లమ్మ గుడి సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు వడ్లు పోశారు. అయితే బుధవారం అర్ధరాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వెంకేపల్లి తుమ్మల చెరువు మత్తడి ఎక్కువ కావడంతో కట్టు కాలువలో ప్రవాహం పెరిగింది. వరద ఉధృతికి కట్టు కాలువ రెండు చోట్ల తెగిపోయింది. ఒక్కసారిగా వరద నీరు రావడంతో సైదాపూర్ కొనుగోలు కేంద్రం వద్ద పోసిన సుమారు 200 ట్రిప్పుల వడ్లు నీట మునిగాయి. ప్రవాహం ఎక్కువ కావడంతో పెద్ద మొత్తంలో వడ్లు కొట్టుకు పోయాయి. పలువురు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రతి ఏడు కొనుగోలు కేంద్రం వద్దనే వడ్లు పోస్తామని, ఈసారి కట్టు కాలువ తెగడంతో మా కష్టం అంత నీటి పలైందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా కట్టు కాలువ తెగడంతో వెంకేపల్లి, సైదాపూర్, జాగిరిపల్లి గ్రామాలలో వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. కట్టు కాలువ మమ్ముల్ని నట్టేట ముంచిందని రైతులు కన్నీటి పర్యంతమవు తున్నారు. పట్టణంలో 202 మిల్లి మీటర్ల వర్షం నమోదుకావడంతో కల్వర్టుల వద్ద వరద నీటికి సైదాపూర్-హుజురాబాద్ మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

# కృష్ణానదిలో పెరుగుతున్న వరద ప్రవాహం

**విజయవాడ,**

: కృష్ణానదిలో వరద ప్రవాహం గంట గంటకు పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజ్ వద్ద ప్రస్తుతం ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ సమానంగా ఉండి భారీ నీటి ప్రవాహం కొనసాగుతోంది. తాజా వివరాల ప్రకారం, బ్యారేజ్ వద్ద ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో రెండూ 5,38,867 లక్షల క్యూసెక్కులుగా నమోదయ్యాయి. పరిస్థితిని సమీక్షిస్తున్న అధికారులు రెండవ ప్రమాద హెచ్చరిక జారీ చేసే అవకాశం ఉందని సూచించారు. విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ మాట్లాడుతూ, కృష్ణా నదిలో వరద ఉధృతి పెరుగుతున్న నేపథ్యంలో పరీవాహక ప్రాంతాల ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలి. పొంగిపొర్లే వాగులు, కాలువలు దాటే ప్రయత్నం చేయరాదు. లోతట్టు ప్రాంత ప్రజలు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కృష్ణా నది పరివాహక ప్రాంతాల్లో వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ముఖ్యంగా గుంటూరు, కృష్ణా, నంద్యాల జిల్లాల్లో రోడ్డు రవాణా అంతరాయాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు వరద ప్రభావిత మండలాల్లో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచారు. వాతావరణ శాఖ హెచ్చరికల ప్రకారం, వచ్చే 24 గంటల్లో కూడా కృష్ణా పరివాహక ప్రాంతాల్లో మోస్తరు నుండి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున వరద పరిస్థితి కొనసాగవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రజలు అధికారుల సూచనలు పాటించి, అప్రమత్తంగా ఉండాలని విపత్తుల నిర్వహణ విభాగం విజ్ఞప్తి చేసింది.

# తెలంగాణ రైతులపై మొంథా దెబ్బ

## కొట్టుకు పోయిన కల్లాల్లో ఆరబోసిన ధాన్యం

## కోయని వరి చేలన్నీ నీట మునిగన దృశ్యం

## గోడదెబ్బ..చెంపదెబ్బలా రైతుల పరిస్థితి

**వరంగల్/కరీంనగర్,**

మొంథా తుఫాన్ ప్రభావంతో తెలంగాణ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. అలాగే పలుచోట్ల పంటలు నీట మునిగాయి. గోడదెబ్బ చెంపదెబ్బలా రైతుల పరిస్థితి దయనీయంగా ఉంది. ప్రభుత్వానికి అందిన వ్యవసాయ శాఖ ప్రాథమిక నివేదిక ప్రకారం.. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ఐదు లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి.పంజా విసిరిన మొంథా తుఫాన్ దాటికి తల్లడిల్లుతున్న అన్నదాతలను, నిరాశ్రయులను ప్రభుత్వం ఆదుకో వాలని మండల ప్రజలు అర్థిస్తున్నారు. మూడు, నాలుగు నెలలు కష్టపడి పెంచి పెద్ద చేసిన పొలాలు చేతికందే దశలో ఒక్క వర్షం అతలాకుతలం చేసింది. రెండు మూడు రోజుల్లో వరి కోయడానికి సిద్ధంగా ఉన్న రైతులను తుఫాను నిండా ముంచింది. కురిసిన భారీ వర్షంతో పొలాలు కింద పడిపోయి మడికట్లలో నీళ్లు నిలిచిపోయి గొలుసు మొత్తం వాలిపోయింది. ఎక్కడో చోట తప్ప దాదాపు అన్ని పొలాలు నేలవాలాయి. వరి కోయని రైతుల పరిస్థితి ఒకలా ఉంటే కోసిన రైతుల కన్నీటి వ్యథ మరో తీరు ఉన్నది. అమ్ముకునేందుకు కళ్ళాల్లో పోసి ఆరబోసిన తరుణంలో వర్షం రావడంతో తడిసి ముద్దయిపోయాయి. వర్షం వస్తుందన్న సమాచారంతో రాశులుగా పోసినప్పటికీ భారీ వర్షానికి తడిసి పోయాయి. మరోవైపు కల్లాల నుంచి నీళ్లు బయటకు పోలేని పరిస్థితుల్లో పూర్తిగా నీటిమట్ట మయ్యాయి. భారీ వర్షాలకు కుంటలు, వాగులు పొంగిపొర్లడంతో పలు గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. కల్వర్టులు ఉప్పొంగడంతో ఎక్కడి వారు అక్కడే నిలిచి పోయారు. అత్యధికంగా వరంగల్ జిల్లాలో పంట నష్టం చోటు చేసుకోగా, ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ జిల్లాల్లోనూ రైతులు భారీగా నష్టపోయారు. తుఫాను కారణంగా ప్రధానంగా వరి, పత్తి పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. 2.80 లక్షల ఎకరాల్లో వరి పంట, 1.50 లక్షల ఎకరాల్లో పత్తి, 4 వేల ఎకరాల్లో మొక్కజొన్న, 3 వేల ఎకరాల్లో మిరప, వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. రాష్ట్ర ప్రభుత్వం నష్టపరిహారంపై సమగ్ర నివేదిక సిద్ధం చేసేందుకు సూచనలు జారీ చేసినట్లు సమాచారం. మరోవైపు.. మొంథా తుఫాను ఎఫెక్ట్ తో ఆర్ అండ్‌బీ రోడ్లు 334 లోకేషన్స్‌లో 230 కి.మీ దెబ్బతిన్నాయని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. రోడ్లు భవనాలు శాఖ పూర్తి అప్రమత్తంగా ఉందని వెల్లడించారు. దెబ్బతిన్న, కోతకు గురైన రోడ్లు, బ్రిడ్జిలు,కాజ్‌వేల తాత్కాలిక పునరుద్ధరణకు సుమారు రూ. 7కోట్లు, శాశ్వత పునరుద్ధరణకు రూ. 225 కోట్ల వరకు ఖర్చు అవుతుందని అధికారులు అంచనాలు రూపొందించినట్లు స్పష్టం చేశారు. తుఫాన్ వల్ల అకాల వర్షాలతో ఉమ్మడి నల్గొండ వ్యాప్తంగా రైతులు తీవ్రంగా నష్టపోయా రన్నారు. వరి, పత్తి పంటలు పెద్ద ఎత్తున దెబ్బతిన్నాయని తెలిపారు. మొంథా తూఫాన్ హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం పై పంజా విసిరింది. రాష్ట్రం లోనే అత్యధికంగా బుధవారం 41.2 సెం.మీ. వర్షపాతం నమోదైంది. దీంతో భీమదేవరపల్లి మండలంలోని చెరువులు, వాగులు, వంకలు పొంగి పొర్లాయి. దాదాపు గ్రామాల్లోని అన్ని చెరువులు, కుంటలు నిండుకు న్నాయి. దశాబ్దాల క్రితం వరకు కూడా ముత్తారం చెరువు నిండ లేదని, ఇప్పుడే చెరువు నిండి మత్తడి పోస్తుందని గ్రామస్తులు చెబుతున్నారు.కొత్తపల్లిలో చెరువు తెగడంతో పోలీసులు, అధికారులు సహాయ సహకారాలు అందించారు. కాగా కొత్తకొండ చెరువు పెద్ద ఎత్తున మత్తడి పోయడంతో, చెరువు కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. చేతికొచ్చిన వరి పంట నీట మునిగిందని, కోసిన వరి ధాన్యం తడిసి ముద్దయిందని చాలా చోట్ల రైతులు కన్నీరు పెట్టుకున్నారు. మండలంలో సుమారు 6030 ఎకరాలు వరి పంట దెబ్బతిందని, 3290 మంది రైతులు రోడ్డున పడ్డారని వ్యవసాయ అధికారుల అంచనా. కొత్తకొండ గట్లనర్సింగాపూర్, కొత్తకొండ మల్లారం గ్రామాల్లో ప్రధాన రహదారులు తెగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి. యాభై ఏండ్ల తరువాత ఇంత స్థాయిలో వర్షం పడిందని స్థానికులు చెబుతున్నారు. బొల్లోనిపల్లి గ్రామం జలదిగ్బంధంలో ఉంది. దాదాపు 25 కుటుంబాల్లో ఇళ్లలోకి నీరు పెద్ద ఎత్తున చేరుకోవడంతో ప్రమాదం ఏర్పడింది.






దీంతో పోలీసులు, రెవెన్యూ అధికారులు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రభుత్వ పాఠశాలలో పునరావాసం కల్పించారు. తుఫాన్ దాటికి మండలంలో రెండు ట్రాన్స్‌పార్మర్స్, 26 విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నట్లు విద్యుత్ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. కొప్పూరులో ఒక ఆవు, రెండు దూడలు, మల్లారం గ్రామంలో రెండు ఆవులు మృతి చెందాయి. మండలంలోని 94 చెరువులు, కుంటలు ప్రమాదంలో ఉన్నట్లు రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. తిమ్మాపూర్ మండలంలోని రామకృష్ణ కాలనీ శివారులో కుంట కింద ఏర్పాటు చేసిన వెంచర్ వల్ల రైతుల పంట పొలాలు నీట మునిగాయి. వెంచర్ ఏర్పాటు చేసిన తర్వాత కుంట మత్తడి వెళ్లేందుకు చిన్న మోరీ లాగా ఏర్పాటు చేశారు. అయితే బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షంతో వచ్చిన వరద వెళ్లేందుకు మార్గం లేకపోవడంతో సమీప పొలాలన్నీ మునిగిపోయాయి. దీంతో తీవ్ర స్థాయిలో నష్టం వాటిల్లినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తిమ్మాపూర్ నుంచి పోరండ్ల, వచ్చునూర్ నుంచి జోగుండ్ల, పోలంపల్లి నుంచి మొగిలిపాలెం వెళ్లే రోడ్లలో వచ్చే వరద కల్వర్టుల వద్ద భారీగా వస్తున్నడంతో రాకపోకలు నిలిచిపోయాయి. ఈ నేపథ్యంలో హై లెవెల్ వంతెనలు ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఉమ్మడి నిజామాబాద్ రైతులపై దెబ్బ

## వరుస వర్షాలతో తల్లడిల్లిన అన్నదాత

## తడిసిన ధాన్యం..కొట్టుకుపోయిన ధాన్యం

## వెంటే ఆదుకోవాలంటున్న అన్నదాతలు

**నిజామాబాద్,**

ఉమ్మడి నిజామాబాద్ ప్రజలు, రైతులు మొంథా తుపాను ప్రభావంతో తీవ్రంగా నష్టపోయారు. వరుసగా ఇది రెండోసారి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు కుదేలయ్యారు. ఉమ్మడి జిల్లాలో కురిసిన భారీ వర్షాలతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట తడిసి పోవడం ఒక ఎత్తయితే, కోయకుండా పొలాల్లో ఉన్న వరి, పత్తి, మొక్కజొన్న మొత్తం నీటిపాల య్యింది. దీంతో వీరు ఆందోళన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలు, కల్లాలు, రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం కొట్టుకుపోగా పలుచోట్ల తడిసి ముద్దయ్యింది. కొన్నిచోట్ల ఆరబెట్టి కొనుగోలుకు సిద్ధం చేసిన ధాన్యం భారీ వర్షాలకు పూర్తిగా తడిసి మొలకలు వస్తున్నాయి. వరదలో వడ్లు కొట్టుకుపోయాయి. కొందరు రైతులు చేసేదేమిలేక ఆరబెట్టిన ధాన్యాన్ని ప్రభుత్వం కొంటుందేమో అన్న ఆరాటంతో కంట తడిపెడుతున్నారు. డిచ్‌పల్లి, బోధన్, ధర్పల్లి, లింగంపేట, నాగిరెడ్డిపేట తదితర మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లపై ఆరబెట్టిన ధాన్యం తడిసి ముద్దయ్యింది. వడ్ల కుప్పల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట విక్రయించడానికి కేంద్రానికి తీసుకువచ్చి ఆరబెడితే వర్షం కారణంగా పూర్తిగా తడిసిపోయిందని రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. కోతకు వచ్చిన ధాన్యం రాలిపోతున్నదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షంలో తడవకుండా ఉండడానికి నానా తంటాలు పడ్డారు. తడిసిన ధాన్యానికి రూ.500 బోనస్ ఇచ్చి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో సరైన సదుపాయాలు లేక పోవడంతోనే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నట్లు రైతులు తెలిపారు. ధాన్యం తడవకుండా అధికారులు వెంటనే టార్పాలిన్లు అందించివుంటే నష్టం ఇంతగా ఉండేది కాదన్నారు. ధాన్యం రంగు మారడంతో పాటు మొలకలు వచ్చే అవకాశం ఉన్నదని, అధికారులు స్పందించి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో తూకం ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రోడ్లపై ఆరబెట్టుకున్న ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. తడిసిన ధాన్యాన్ని మళ్లీ ఆరబెట్టుకుందామంటే మళ్లీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ ప్రకటించింది. చేతికి వచ్చిన పంట వర్షార్పణం కావడంతో తమను ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడుస్తున్నా సొసైటీ సిబ్బంది టార్పాలిన్లు ఇవ్వడంలేదని ఆగ్రహించిన అన్నదాతలు ఆందోళన చేపట్టారు. కోటగిరి మండల కేంద్రంలో సహకార సంఘం గోదాం వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం కోటగిరి-పొతంగల్ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. సొసైటీ సిబ్బంది తీరుపై నిరసన వ్యక్తంచేశారు. సహకార సంఘం సిబ్బంది చిన్న రైతులను పట్టించుకోవడంలేదని మండిపడ్డారు. ఇప్పటికే ధాన్యం విక్రయించుకున్న పెద్ద రైతులకు అవసరం లేకున్నా టార్పాలిన్లు ఇచ్చారని ఆగ్రహం వ్యక్తంచేశారు. చిన్న రైతులకు చెందిన ధాన్యం వర్షాలకు తడిసి, మొలకలు వస్తున్నా పట్టించుకునే వారే కరువయ్యారని వాపోయారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో ఎడాపెడా కురుస్తోన్న వానలతో రైతు పరిస్థితి ఆందోళనకరంగా మారింది. వానాకాలం సీజన్ ముగిసినప్పటికీ వానలు వీడక పోవడంతో రైతులు తలలు పట్టుకుంటున్నారు. చేతికి వచ్చిన పంటను కోయలేక అనుకూల వాతావరణం కోసం ఎదురు చూస్తున్నారు. వరి కోసిన రైతులంతా తేమ శాతం తగ్గించుకునేందుకు రోడ్లపై పాట్లు పడుతున్నారు. పీఏసీఎస్, ఐకేపీ కొనుగోలు కేంద్రాలకు తీసుకెళ్తే సిబ్బంది నిర్వాకంతో ధాన్యం వర్షానికి తడిసి పోతోంది. టార్పలిన్ కవర్లు సరిపడా అందుబాటులో పెట్టకపోవడంతో సమస్య ఎదురవుతోందని వాపోతున్నారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించాలంటూ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. కోసిన ధాన్యాన్ని ఆరబెట్టు కునేందుకు కల్లాలు లేకపోవడంతో చాలా మంది రోడ్లపై కుప్పలు పోస్తున్నారు. ఆకస్మికంగా కురిసే వానలతో ధాన్యం తడిసి పనికి రాకుండా పోతోంది. తేమ శాతం పేరుతో కేంద్రాల్లో కొనుగోళ్లకు ససేమిరా అంటుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కొనుగోళ్లు జరిగినప్పటికీ ట్యాబ్ ఎంట్రీ సరిగా లేకపోవడంతో నిజామాబాద్ జిల్లాలో రూ.170కోట్లు చెల్లింపులు జరగాల్సి ఉన్నది. కామారెడ్డి జిల్లాలో రూ.30కోట్లు మేర పెండింగ్ ఉన్నాయి. నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు రూ.275కోటు విలువ చేసే 1.15లక్షల మెట్రిక్ టన్నులు మేర ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6552 మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, 1.08లక్షలు సన్న రకం ధాన్యం ఉంది. 704 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రతిపాదనలు సిద్ధం చేయగా ఇప్పటి వరకు 657 కేంద్రాలు ప్రారంభమయ్యాయి. 354 సెంటర్లకు ధాన్యం రాక మొదలవ్వగా కొనుగోలు షురూ అయ్యా యి. 3218 మంది రైతులకు రూ.100కోట్లు చెల్లింపులు పూర్తయ్యాయి. మిగిలిన ధాన్యానికి చెల్లింపులు జరగాలంటే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలి. పీఏసీఎస్, ఐకేపీ సెంటర్లలో సిబ్బంది నిర్లక్ష్యం మూలంగా నమోదు పక్రియ సత్వరం జరగడం లేదు. ఫలితంగా రైతుకు కనీస మద్ధతు ధర జమ కావడానికి జాప్యం జరుగుతోంది. కామారెడ్డి జిల్లాలో ఇప్పటి వరకు 2,500 మంది రైతుల నుంచి 20వేల మెట్రిక్ టన్నులు వరకు ధాన్యాన్ని సేకరించారు. ఇందులో 6వేల మెట్రిక్ టన్నులు దొడ్డు రకం, మిగిలినది సన్న రకం ధాన్యం ఉంది. 190 ఐకేపీ, 233 పీఏసీఎస్ కేంద్రాలను ప్రారంభించారు. ప్రస్తుతం 124 చోట్ల కొనుగోళ్ల సందడి నెలకొన్నట్లుగా అధికారులు చెబుతున్నారు. కామారెడ్డిలో రూ.40కోట్లు విలువ చేసే ధాన్యాన్ని కొనుగోలు చేయగా రూ.12కోట్లు మేర కనీస మద్ధతు ధరకు చెల్లింపులు పూర్తి చేశారు.









ఉమ్మడి నల్లగొండ జిల్లా

అక్షరకలం
తెలుగు దినపత్రిక

సంపాదకీయం...

# సహాయ, పునరావాసం తక్షణ కర్తవ్యం కావాలి !

**మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు. వాగులు, వంకలు చెరువులు ఏరులయ్యాయి. వేల ఎకరాల్లో పంటలు మునిగాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వరి, పత్తి, మక్కజోన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. వర్షం వచ్చినా వరదలు వచ్చినా, తుఫాన్లు వచ్చినా తొలుత నష్టపోయేది మాత్రం రైతన్నలే. ఇరు తెలుగు రాష్ట్రాల్లో రైతులు భారీగా నష్టపోయారు. పంటలు నీటమునిగాయి. వరిచేలు నీట మునిగింది. కొన్నిచోట్ల ఆరపోసిన ధాన్యం కొట్టుకు పోయింది. కోతదశకు వచ్చిన పంట నేలకొరిగింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో వేల ఎకరాల వరకూ వరి పంటకు నష్టం జరిగినట్లు ప్రాథమికంగా అధికారులు గుర్తించారు. నేలకు ఒరిగిన పంటను పైకి లేపి కట్టలుగా కట్టాలని అధికారులు సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న సమయంలో పంట నేలవాలడంతో రైతులు కన్నీరుమున్నీరవు తున్నారు. అరటి పంటలు సైతం దెబ్బతిన్నాయి. ఇప్పుడు ప్రభుత్వాలు తొలుత ఆదుకోవాల్సింది రైతన్నలనే. నివేదికలతో ఆలస్యం చేయకుండా రైతులను తొలుత ఆదుకోవాలి. నీరు చేరడంతో నానిన పంటలను కొనుగోలు చేయాలి. మునిగిన పంటలకు వెంటనే పరిహారం చెల్లిచాలి. దెబ్బతిన్న రోడ్లను యుద్ధప్రాతిపదికన పూడ్చాలి. అతిభారీ వర్షాలతో వాగులు,వంకలు ఉగ్రరూపం తో ప్రవహిస్తున్నాయి.**

శ్రీశైలం ప్రాజెక్టు సమీపంలో, పాతాళగంగ దారిలో కొండచరియలు విరిగిపడ్డాయి. నల్లమలలోనూ చెరువులు, కుంటలు నీటితో నిండిపోయాయి. చెరువులు నిండుకుండల్లా తయారయ్యాయి. వందల గ్రామాలకు రాకపోకలు స్తంభించాయి. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురంలో తీరం దాటిన మొంథా తీవ్ర తుపాను.. అతిభారీ వర్షాలు, బలమైన గాలులతో ఉమ్మడి నెల్లూరు, ప్రకాశం, గుంటూరు జిల్లాల్ని ముంచేసింది. ఇటు తెలంగానలో ఖమ్మం, వరంగల్, సిద్దిపేట, కరీంనగర్ జిల్లాలను ముంచెత్తింది. ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా, విశాఖపట్నం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోనూ భారీవర్షాలతో వాగులు పొంగి ప్రవహించడంతో జనజీవనం అతలాకుతలం అయ్యింది. సముద్రం 20-30 మీటర్లు ముందు కొచ్చింది. వందల గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు నేలవాలడంతో సరఫరా స్తంభించింది. ప్రభుత్వ చర్యలతో చాలాచోట్ల పునరుద్ధరించారు. సాధారణ స్థితికి రావడానికి మరికొంత కాలం పట్టవచ్చు. తీరప్రాంత మండలాల్లో గాలుల దెబ్బకు చెట్లు, విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి. కొన్నిచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కోల్‌కతా-చెన్నై



జాతీయరహదారిపై రాకపోకలు నిలిచాయి. ముందే ముప్పును గుర్తించి చాలామందిని పునరావాస కేంద్రాలకు తరలించారు. నంద్యాల పట్టణం మధ్యలో ప్రవహించే కుందూనది, మద్దిలేరు, చామకాలువ కూడా ఉప్పొంగడంతో పలు ప్రాంతాలు జలమయ మయ్యాయి. శ్రీశైలం-హైదరాబాద్ మార్గంలో సున్నిపెంట దాటిన తర్వాత కొండ చరియలు విరిగిపడ్డాయి. పలు గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిలిచిపోవడంతో అంధకారం నెలకొంది. భారీ వృక్షాలు నేలకూలి రహదారులకు అడ్డంగా పడడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. భారీ వర్షాలకు జలాశయంలో పెద్దఎత్తున నీరు చేరడంతో విజయనగరం జిల్లా పరిధిలోని తాటిపూడి రిజర్వాయరు గేట్లు ఎత్తేశారు. ఆ నీటి ఉద్ధృతికి విశాఖ జిల్లా భీమిలి మండలంలోని గోస్తనీ నది పరీవాహక ప్రాంతాలు ముంపునకు గురయ్యాయి. గత వారం రోజుల పాటు ప్రజలను గజగజలాడించిన మొంథా తుఫాను ప్రభావం ఉపశమించడంతో, ప్రమాదం నుండి బయట పడ్డామని ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మొంథా తుపాను ప్రభావంతో తెలంగాణలోని పలు చోట్ల భారీ వర్షాలు కురిసాయి. తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో భారీగా వర్షాలు అతలాకుతలం చేశాయి. వాగులు, వంకలు ఉదృతంగా ప్రవహిస్తున్నాయి. భారీ వరదలతో రోడ్లు కొట్టుకుపోయి రాకపోకలు నిలిచిపోయాయి. పలు ప్రాంతాలను వరదనీరు ముంచెత్తింది. వరద నీరుతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మొంథా తుఫాన్ ప్రభావంతో వరంగల్, హన్మకొండ, జనగాం, యాదాద్రి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీచేసారు. ఉమ్మడి వరంగల్ జిల్లాపై మొంథా తుఫాన్ పంజా విసిరింది. భారీ వర్షాలతో వరంగల్‌లో రహదారులు నీట మునిగాయి. ఖమ్మం జిల్లాలోని కొణిజర్ల మండలం తీగల బంజర వద్ద పగిడేరు వాగు ఉధృతంగా పారడంతో 20 గ్రామాలకు రాకపోకలు బంద్ అయ్యాయి. ఇప్పుడు ప్రభుత్వాలు పునరుద్ధరణ చర్యలకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలి. రాజకీయాలు పక్కన పెట్టి క్షేత్రస్థాయిలో నష్టం అంచనాలు వేసి సహాయ, పునరావాస కార్యక్రమాలు ముమ్మరం చేయాలి. రోడ్లను మరమ్మత్తులు చేసి రాకపోకలు పునరుద్ధరించాలి. పంటల నష్టాలను అంచనా వేసి రైతులకు ముందుగా తాత్కాలిక ఉపశమనం కలిగించాలి. ఇళ్లు వాకిళ్లు కొట్టుకుపోయిన వారిని గుర్తించి వారికి నిత్యావసరాలతో పాటు జీవనోపాధి కింది పరిహారం అందించాలి. యుద్ధప్రాతిపదికన ఇవి చేపడితే తప్ప ప్రజలు కోలుకోలేరు. ప్రభుత్వాలు వెంటనే ఈ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలి. కేంద్రం కూడా నివేదికల కోసం ఎదురు చూడకుండా ముందుగా తక్షణ సాయంగా కొంత డబ్బును రాష్ట్రాలకు అందించాలి. అవసరమైతే గ్రామాల వారిగా బాధజతులను గుర్తించి అక్కడిక్కడే పరిహారం చెల్లింపులు చేయాలి. గతంలో లాగా నెలల తరబడి వేచిచూసే ధోరణికి స్వస్తి పలకాలి.

## తన పిల్లలు చిత్రసీమలోకి వస్తారనుకోలేదు

**కొచ్చి,**

తన పిల్లలు సినిమాల్లోకి వస్తారని తానెప్పుడూ అనుకోలేదని ప్రముఖ నటుడు,దాదాసాహెబ్ ఫాల్కె అవార్డు గ్రహీత మోహన్‌లాల్ అన్నారు. కెరీర్ విషయంలో వారికి స్వేచ్ఛ ఇచ్చానని తెలిపారు. 'తుడక్కుమ్' ప్రారంభోత్సవ వేడుకలో మాట్లాడారు. తానూ ఊహించని రీతిలోనే ఇండస్ట్రీలోకి వచ్చానంటూ నాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకున్నారు. తన కూతురు విస్మయ నటిస్తున్న తొలి సినిమానే 'తుడక్కుమ్'. '2018' మూవీ ఫేమ్ జూడ్ ఆంథోనీ జోసెఫ్ దర్శకత్వంలో తెరకెక్కుతోంది. వేడుకనుద్దేశించి మోహన్‌లాల్ మాట్లాడుతూ.. 'సినిమాల్లో నటించాలని నేను కోరుకోలేదు. నేను నటుడిని కావడం విధి. గత 48 ఏళ్లుగా ప్రేక్షకులు నన్ను ఆదరిస్తున్నారు. వారి వల్లే నేనీ స్థాయిలో ఉన్నా. నా పిల్లల విషయానికొస్తే వారికంటూ కొన్ని లక్ష్యాలున్నాయి. వారి అభిప్రాయాలను గౌరవించేవాడిని. సినిమాల్లో నటించడం అనుకున్నంత సులువు కాదు. కానీ, విస్మయ నటిని కావాలని నిశ్చయించుకోవడంతో ఆమెకు కావాల్సిన సపోర్ట్ ఇచ్చాం. మంచి కథతో సినిమా రంగంలోకి వస్తోంది' అని పేర్కొన్నారు. తమ కుటుంబానికి ఈ ఏడాది ఎంతో ప్రత్యేకమని మోహన్‌లాల్ సతీమణి సుచిత్ర అభిప్రాయపడ్డారు. మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకోవడం, తనయుడు ప్రణవ్ కొత్త సినిమా విడుదల కాబోతుండటం (ఈ నెల 31న రిలీజ్ కానున్న డియాస్ ఇరాయ్ ), తనయ నటిగా ప్రయాణం మొదలుపెట్టడంపై ఆమె ఆనందం వ్యక్తం చేశారు.

## చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట

**న్యూఢిల్లీ,**

ఇరాన్‌లోని చాబహార్ పోర్టు విషయంలో భారత్‌కు ఊరట లభించింది. వచ్చే ఏడాది ప్రారంభం వరకు అమెరికా ఆంక్షల నుంచి దీనికి మినహాయింపు దొరికింది. అమెరికా గతంలో ఇచ్చిన మినహాయింపునకు నేటితో గడువు ముగిసిన నేపథ్యంలో మళ్లీ ఈ గడువు పొడిగింపు వచ్చింది. దీంతో చాబహార్ పోర్ట్‌లోని షహీద్ బెహెస్తీ టెర్మినల్ అభివృద్ధి, నిర్వహణకు భారత్‌కు వీలు కలిగింది. చాబహార్ పోర్టుపై ఆరు నెలల పాటు ఈ ఆంక్షల మినహాయింపు ఉందని భారత ప్రభుత్వం ధ్రువీకరించింది. మధ్య ఆసియా దేశాలతో భారత్ వాణిజ్యం నెరపడానికి చాబహార్ పోర్టు ప్రధాన మార్గంగా ఉంది. ఈ పోర్టు అభివృద్ధి, నిర్వహణలో భారత్‌దే కీలక పాత్ర. ఇప్పటికే న్యూదిల్లీ ఈ ప్రాజెక్టులో భారీగా పెట్టుబడులు పెట్టింది. కజఖిస్థాన్, కిర్గిజ్ రిపబ్లిక్, తజికిస్థాన్, తుర్క్‌మెనిస్థాన్, ఉజ్బెకిస్థాన్ వంటి దేశాలకు భారత్ ఇక్కడినుంచి సరకు రవాణా చేయవచ్చు. పాకిస్థాన్‌తో సంబంధం లేకుండా అఫ్గానిస్థాన్‌కు భారత్ అందించే ఆహార ధాన్యాలను కూడా ఈ మార్గంలోనే పంపిస్తున్నారు. ఇదిలాఉంటే.. ఈ ఓడరేవులో 10ఏళ్ల పాటు టెర్మినల్ నిర్వహణ కోసం గత ఏడాది భారత్-ఇరాన్ (ఎనిటతిజీ-ఎసజీని)ల మధ్య ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం తర్వాత భారత్‌కు అమెరికా హెచ్చరికలు చేసింది. ఇరాన్‌పై అమెరికా కొన్ని ఆంక్షలు విధించింది. వాటి అమలు కొనసాగుతూనే ఉంటుంది. ఏ సంస్థ అయినా, దేశమైనా టెహ్రాన్‌తో వ్యాపార లావాదేవీలు జరిపితే.. వారు కూడా వాటి పరిధిలోకి వస్తారన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని వ్యాఖ్యానించింది. ఆ ఒప్పందాన్ని సంకుచిత దృష్టితో చూడకూడదని అప్పట్లో విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ కౌంటర్ ఇచ్చారు.

## పెన్నానదిలో భారీగా వరదప్రవాహం

**సంగం బ్యారేజీకి కొట్టుకు వచ్చిన భారీ బోటు**

**సమయస్ఫూర్తితో బోటును ఒడ్డుకు చేర్చిన అధికారులు**

**విజయవాడ,**

మొంథా తుఫాన్ ప్రభావంతో పెన్నా నదిలో ఉధృతంగా పెరిగిన వరద ప్రవాహం నెల్లూరు జిల్లాలోని సంగం బ్యారేజ్‌కు భారీ ప్రమాదం కలిగించే పరిస్థితి ఏర్పడింది. వరదలో కొట్టుకుపోయిన 30 టన్నుల భారీ బోటు బ్యారేజ్ గేట్లకు అడ్డంగా పడటంతో అధికారులు అప్రమత్త మయ్యారు. తక్షణ చర్యలు చేపట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. తుఫాన్ కారణంగా రికార్డు స్థాయిలో కురిసిన వర్షాలు వాగులు, వంకలు పొంగిపొర్లేలా చేశాయి. పెన్నా నదిపై ఉన్న సంగం బ్యారేజ్‌కు లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం వచ్చింది. అదే సమయంలో భారీ బోటు ప్రవాహంలో కొట్టుకుపోయి బ్యారేజ్ వైపు చేరింది. అది గేట్లను తాకే పరిస్థితి వస్తే బ్యారేజ్‌కు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉండటంతో అధికారులు వేగంగా చర్యలు చేపట్టారు. సమాచారం అందుకున్న వెంటనే నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, ఎస్పీ అజిత వేజెండ్ల సంఘటనా స్థలానికి చేరుకుని పర్యవేక్షణ చేపట్టారు. వారి ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు, అగ్నిమాపక సిబ్బంది, కృష్ణపట్నం పోర్టు గస్తీ సిబ్బంది, పోలీసు విభాగం, వ్యవసాయ శాఖ అధికారులు సమిష్టిగా పని చేశారు. దాదాపు 100 మంది సిబ్బంది సహకారంతో ఆ బోటును విజయవంతంగా వెలికితీశారు. మొత్తం 3.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణానికి ఆధారమైన సంగం బ్యారేజ్ ప్రమాదం నుంచి బయటపడడంతో ప్రజలు ఊపిరిపీల్చుకున్నారు. జిల్లా యంత్రాంగం సమయోచితంగా స్పందించిందని సర్వత్రా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. హోం మంత్రి వంగలపూడి అనిత కూడా అధికారులను అభినందిస్తూ, ఆ బోటు అలాగే కిందకు వెళ్లి ఉంటే బ్యారేజ్ గేట్లను ఢీకొని భారీ నష్టం జరిగేదేనని పేర్కొన్నారు. అధికారుల ప్రకారం, బిరపేరు, బోగ్గేరు వాగుల్లో అకస్మాత్తుగా నీటి మట్టం పెరగడంతో బుధవారం తెల్లవారుజామున 3 గంటలకు సంగం బ్యారేజ్ వద్ద నీరు 11 అడుగులకు చేరుకుంది. ఈ వరద వేగం కారణంగా వంతెన రైలింగ్‌కు కట్టిన మూడు బోట్ల తాళ్లు తెగిపోయాయి. వాటిలో ఒకటి ఇసుక తిన్నెల్లో చిక్కుకోగా, మరోటి కనిగిరి రిజర్వాయర్ వైపుకు వెళ్లింది. మూడో బోటు మాత్రం బ్యారేజ్‌కు కేవలం 400 మీటర్ల దూరంలో నిలిచిపోవడంతో వెంటనే చర్యలు తీసుకుని రక్షించారు. అధికారుల చాకచక్యంతో నెల్లూరు సంగం బ్యారేజ్ పెద్ద ప్రమాదం నుంచి తప్పించుకుందని స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## తుపాన్‌తో వరిపంటకు తీవ్ర నష్టం

**పైరు పొట్ట దశలో ఉండగా తుపాను దెబ్బ**

**15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి**

**రైతులకు తోడుగా నిలబడాలని పార్టీ నేతలకు జగన్ పిలుపు**

**అమరావతి,**

తుపాను కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయని.. ముఖ్యంగా వరి రైతులు తీవ్రంగా నష్టపోయారని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. మొంథా తుపాను నేపథ్యంలో పార్టీ నేతలతో వైఎస్ జగన్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుపాను ప్రభావంపై పార్టీ నేతలతో చర్చించారు. పైరు పొట్ట దశలో ఉన్నప్పుడు తుపాను దెబ్బపడింది. దీనివల్ల దిగుబడులు బాగా దెబ్బతింటాయి. నేలకొరిగిన పంట తిరిగి నిలబడ్డం కష్టమయ్యే పరిస్థితి. దాదాపు 25 జిల్లాల్లో ప్రభావం చూపింది. ఉన్న సమాచారం ప్రకారం 15 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. 11 లక్షల ఎకరాల్లో వరి పంటకు నష్టం దాటిల్లింది. 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరు శనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో హార్టికల్చర్ పంటలు దెబ్బతిన్నాయి. పార్టీ పరంగా రైతులకు తోడుగా నిలబడాలని వైఎస్ జగన్ పిలుపునిచ్చారు. మన ప్రభుత్వంలో ఆర్బీకేల వ్యవస్థ అప్రమత్తంగా ఉండేది. ప్రతి పంటకూ ఇ-క్రాప్ చేసే వాళ్లం. గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు సమన్వయం తో గట్టిగా పనిచేసేది. ఉచిత పంటలబీమాతో రైతులకు భరోసా ఉండేది. 80 లక్షల మంది రైతులు ఉచిత పంటల బీమా అందుబాటులో ఉండేది. 70 లక్షల ఎకరాల పంట బీమా పరిధిలో ఉండేది. ఇవాళ ప్రీమియం కట్టిన రైతులు 19 లక్షలమందికి మాత్రమే బీమా అందుబాటులో ఉంది. మిగిలిన రైతుల పరిస్థితి ఏం కావాలి. ఇలాంటి పరిస్థితుల్లో రైతులకు మనం అండగా ఉండాలన్నారు. 16 నెలల్లో అల్పపీడనలు, వాయుగుండాలు, తుపాన్లు కారణంగా 16 వచ్చాయి. ఎంతమందికి రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ అందింది, నష్టపోయిన రైతులను ఎంతమందిని ఆదుకున్నారు చూస్తే.. గుండుసున్నాయే కనిపిస్తుంది. ఏ రైతునూ ఆదుకున్న పరిస్థితి లేదు. ఇ-క్రాప్ అందించిన పరిస్థితి కూడా లేదు. వాళ్లు వేసిన అరకొర లెక్కల ప్రకారమే 5.5 లక్షలమంది రైతులకు రూ.600 కోట్లు పెండింగ్‌లో పెట్టారు. మిర్చికి క్వింటాలుకు రూ.11,781కి కొనుగోలు చేస్తామన్నారు ఒక్క రూపాయికూడా రైతుకు ఇవ్వలేదు. పొగాకును కొనుగోలు చేస్తామ న్నారు దిక్కూ మొక్కూ లేదు. మామిడిని కిలో రూ.12లకు కొనుగోలు చేస్తామన్నారు. ఒక్క రైతుకూ మంచి చేయలేదు. తర్వాత హెక్టారుకు రూ.50వేలు ఇస్తామన్నారు. అదికూడా ఇచ్చిన పాపాన పోలేదని జగన్ విమర్శించారు.

## కారు డ్రైవర్ కంచిపల్లి శ్రీనివాస్ అదృశ్యం విషాదాంతం

**కోనసీమ,**

అమలాపురం పట్టణం కొంకాపల్లికి చెందిన కారు డ్రైవర్ కంచిపల్లి శ్రీనివాస్ (37) ఘటన విషాదాంతమైంది. గత శనివారం అదృశ్యమైన అతడు బుధవారం పి.గన్నవరం మండలం ఆర్.ఏనుగపల్లి గ్రామంలోని వైనతేయ నదీ పాయలో శవమై కనిపించాడు. అతడి సోదరుడు అంజి పుట్టు మచ్చల ఆధారంగా శ్రీనివాస్ మృతదేహాన్ని గుర్తించాడు. ఈ కేసును అమలాపురం పట్టణం, పి.గన్నవరం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శ్రీనివాస్ మృతి చెంది దాదాపు ఐదు రోజులు అవుతుందని, పోస్టుమార్టం నివేదిక వస్తేనే మృతికి కారణాలు తెలుస్తాయని పి.గన్నవరం ఎస్సై బి.శివకృష్ణ, అమలాపురం పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు. ఇదిలా ఉండగా.. శ్రీనివాస్ భార్య దేవి, కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం అమలాపురం పట్టణ పోలీసు స్టేషన్‌కు వచ్చారు. తన భర్త అదృశ్యం కేసు ఎంత వరకూ వచ్చిందని ఆరా తీశారు. ఇదే విషయాన్ని పట్టణ పోలీస్ స్టేషన్ ముందు విలేకరులకు తెలిపారు. ఆర్.ఏనుగపల్లిలో ఓ మృతదేహాన్ని పోలీసులు గుర్తించారని తెలిసి ఆమె పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. ఆ మృతదేహం తన భర్తదే అని నిర్ధారణ కావడంతో కన్నీరు మున్నీరుగా విలపించారు. గత శనివారం శ్రీనివాస్ ఇంట్లో తాను రాజమహేంద్రవరం వెళుతున్నానని చెప్పి స్కూటీపై బయలు దేరాడు. అప్పటి నుంచి అతను తిరిగి రాలేదు. ఆర్.ఏనుగపల్లిలో శ్రీనివాస్ మృతదేహం లభ్యమైనప్పుడు అక్కడి పోలీసులు అతడి శరీరంపై సినీ దర్శకుడు సుకుమార్ చిత్రంతో పాటు పలు పేర్లను టాటూలుగా వేయించుకున్న విషయాన్ని గుర్తించారు. అతడి కుడి చేతిపై దేవి, రిషి, వినీత్ అనే పేర్లు ఇంగ్లిషులో ఉన్నాయి. నీలి రంగు ప్యాంట్ ఊడిపోయి అతని కాళ్ల వద్ద వేలాడుతోంది. తన భర్తను పట్టణానికి చెందిన గంగుమళ్ల కాసుబాబు, అతడి అనుచరులు చంపినట్టు తనకు అనుమానంగా ఉందని మృతుడి శ్రీనివాస్ భార్య దేవి స్థానిక విలేకర్లకు తెలిపింది. తన భర్తపై కాసుబాబు కక్ష పెంచుకుని ఇదంతా చేశాడని ఆరోపించింది. కాసుబాబుతో పాటు శంకర్, సలాది అప్పన్న, కారు డ్రైవర్ కలిపి తన భర్తను చంపారన్న అనుమానం ఉందని తెలిపింది. పట్టణ పోలీసులు ఈ నలుగురి కదలికలపై నిఘా పెట్టారు. తాము కూడా ఆ దిశగానే దర్యాప్తు చేస్తున్నామని పట్టణ సీఐ పి.వీరబాబు తెలిపారు.

## వరంగల్ ముంపు ప్రాంతాల్లో పోలీస్ సేవలు

**హైదరాబాద్,**

వరంగల్‌లో తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో పోలీసుల సేవలను వినియోగించుకోవాలని, అవసరమైతే హైదరాబాద్ నుంచి హైడ్రా టీమ్‌లను, అవసరమైన సామగ్రిని పంపించాలని సీఎస్, డీజీపీలను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. వరంగల్లో తక్షణ సహాయక చర్యలకు అవసరమైనన్ని పడవలను అక్కడికి పంపించాలని, వివిధ జిల్లాల్లో అందుబాటులో ఉన్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందిని తక్షణమే తరలించాలని సీఎస్, డీజీపీకి ఆదేశించారు. హైదరాబాద్ నుంచి హైడ్రా సిబ్బందిని, హైడ్రా వద్ద ఉన్న వరద సహాయక సామాగ్రిని కూడా అత్యవసరమైన చోట వినియోగించుకునే చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్లో వరద ప్రాంతాల్లో చిక్కుకున్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని, ఎక్కడైనా వరదలో ఇండ్ల కప్పులు, బంగ్లాలపై చిక్కుకున్న కుటుంబాలకు డ్రోన్ల ద్వారా తాగునీటితో పాటు, ఫుడ్ పాకెట్లు సరఫరా చేయాలని సూచించారు. వరంగల్లో వరద బాధితులకు అందించే సహాయక చర్యలను ముమ్మరం చేయాలని, 24 గంటలు పరిస్థితిని పర్యవేక్షించేందుకు వీలుగా కలెక్టరేట్లో టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ ఏర్పాటు చేయాలని సీఎం సూచించారు. మొంథా తుపాను వరంగల్ జిల్లాను ముంచెత్తింది. భారీ వరదలకు అనేక ప్రాంతాలు నీటమునిగాయి. ఈ క్రమంలో జిల్లాలో వరదలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందిస్తూ.. పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉన్న వారిని వెంటనే సురక్షిత ప్రాంతానికి తరలించాలని అన్నారు. వరంగల్ జిల్లాకు వెళ్లనున్న సీఎం... వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు. నేడు వరంగల్, హుస్నాబాద్ ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించనున్నారు. కాగా.. వరంగల్ నగరాన్ని మొంథా తుపాను అతలాకుతలం చేసింది. భారీ వర్షాలకు జనజీవనం స్తంభించింది. అనేక ప్రాంతాలు వరద నీటిలో చిక్కుకున్నాయి. వరంగల్ నగరంలోని 30 ముంపు కాలనీలతో పాటు హనుమకొండలోని 15 ముంపు కాలనీవాసులను సురక్షితంగా పునరావాస కేంద్రాలకు డిజాస్టర్ సిబ్బంది తరలించింది. హనుమకొండలో మూడు పునరావాస కేంద్రాలు, వరంగల్లో 9 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొత్తం 1200 మందిని సురక్షితంగా పునరావాస కేంద్రాలకు తరలించారు. గ్రేటర్ పరిధిలో ఏడు ప్రత్యేక బృందాలను వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ ఏర్పాటు చేసింది. ఏడు బృందాల ద్వారా సహాయ చర్యలను సిబ్బంది చేపట్టింది. మరోవైపు భారీ వర్షం నేపథ్యంలో పాఠశాలలకు జిల్లా కలెక్టర్ సెలవు ప్రకటించారు.

## మున్నేరు, కృష్ణా ప్రవాహాలపై నిరంతర అప్రమత్తత

**ప్రజలెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు**

**నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందుతుంది**

**రైతుల క్షేమం, సంక్షేమం ధ్యేయంగా ప్రభుత్వం చొరవ**

**జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**విజయవాడ,**

తెలంగాణ ప్రాంతంలో కురిసిన వర్షాలతో మున్నేరుకు వరద పోటెత్తుతోందని.. ఈ నేపథ్యంలో మున్నేరుతో పాటు కృష్ణానదిలోని వరద ప్రవాహాలను నిరంతరం పర్యవేక్షిస్తూ అప్రమత్తంగా ఉంటున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టర్ లక్ష్మీశ, పోలీస్ కమిషనర్ ఎస్వీ రాజేశేఖరబాబు.. నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్యతో కలిసి కీసర వంతెన వద్ద మున్నేరు వరద ఉద్ధృతిని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు వివిధ ప్రాంతాల్లో మున్నేరు వరద పరిస్థితులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ కృష్ణా, మున్నేరు, కట్టలేరు, వైరా, పాలేరులోని ప్రవాహాలపై ప్రత్యేకంగా దృష్టిపెట్టామని.. మున్నేరుకు అటూఇటూ ఉన్న 40 గ్రామాల ప్రజలను అప్రమత్తం చేశామని తెలిపారు. ఎవరికీ ఎక్కడా ఎలాంటి ఇబ్బందిలేకుండా ముందు జాగ్రత్తలు తీసుకున్నామని.. గ్రామ సచివాలయాలు, పాఠశాలలను సిద్ధంగా ఉంచామని, ఏ ఇబ్బంది తలెత్తినా వెనువెంటనే ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించే ప్రణాళికలతో ముందుకెళ్తున్నామన్నారు. జాతీయ రహదారులు (ఎన్‌హెచ్), ఆర్ అండ్ బీ, ఇరిగేషన్, రెవెన్యూ, పోలీస్.. ఇలా వివిధ శాఖల అధికారుల బృందాలు సమన్వయంతో పనిచేస్తున్నట్లు తెలిపారు. వాహనాల రాకపోకలకు ఏవైనా ఇబ్బందులు ఉంటే ప్రత్యామ్నాయ రహదారులకు సంబంధించి కూడా ప్రణాళికలు ఉన్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. ల్గ÷తులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని.. నష్టాల తుది అంచనాల నివేదికలకు అనుగుణంగా నష్టపోయిన ప్రతిరైతుకూ పరిహారం అందించి ప్రభుత్వం అండగా నిలుస్తుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అన్నదాతల క్షేమం, సంక్షేమం లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. గౌరవ ముఖ్యమంత్రి పరిస్థితిని ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారని, సూచనలు ఇస్తున్నారని పేర్కొన్నారు. ప్రకాశం బ్యారేజీకి కూడా వరద నీరు పోటెత్తుందోని.. ఈ నేపథ్యంలో బ్యారేజీకి ఎగువున, దిగువున ప్రాంతాల ప్రజలకు ఇప్పటికే హెచ్చరికలు జారీచేశామన్నారు.

## చంద్రబాబు ముందస్తు చర్యలతో నష్టనివారణ

**విజయవాడ,**

ముందస్తుగా తీసుకున్న చర్యలతో తుఫాన్ నష్ట నివారణ కొంత వరకు తగ్గించగలిగామని ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ముందు చూపు కారణంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నామని చెప్పారు. ప్రజలకు ఎలర్ట్ మెసేజ్‌లు కూడా పంపామని.. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో బాగా నష్టం జరిగిందని వెల్లడించారు. అన్ని జిల్లాల కలెక్టర్‌లు, ప్రభుత్వ యంత్రాంగం బాగా పని చేసిందని కొనియాడారు. కృష్ణా జిల్లాలోని అవనిగడ్డ నియోజకవర్గంలో మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటించారు. కోడూరు మండలం కృష్ణాపురం గ్రామంలో పర్యటించారు.

అక్షరకలం
తెలుగు దినపత్రిక

# స్పోర్ట్స్



## వర్షం కారణంగా మొదటి టీ20 రద్దు

### సూర్యకుమార్, శుభ్‌మాన్ గిల్‌ల విధ్వంసం

కాన్‌బెర్రాలో వర్షం క్రికెట్ అభిమానుల ఆనందంపై నీళ్లు చల్లింది. భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన మొదటి టీ20 మ్యాచ్ రద్దు అయ్యేందుకు కారణమైంది. వర్షం కారణంగా, కేవలం 58 బంతులు మాత్రమే ఆడగలిగారు. ఈ సమయంలో, టీం ఇండియా ఒక వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది. కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ -శుభ్‌మాన్ గిల్ ఫోర్లు, సిక్సర్ల వర్షం కురిపించారు. కానీ 10వ ఓవర్‌లో, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం ప్రారంభమైంది. వర్షం ఆగిపోవడానికి గంటన్నర పాటు వేచి ఉన్న తర్వాత కూడా ఆగలేదు. చివరకు చూసిన నిర్వాహకులు మ్యాచ్ రద్దు చేసినట్టు ప్రకటించారు. ఇప్పటికే వర్షం పడుతుందని భావించారు. మ్యాచ్ సకాలంలో ప్రారంభమైనప్పటికీ, ఆరో ఓవర్‌లో వర్షం వచ్చి దాదాపు అరగంట పాటు ఆటను నిలిపివేసింది. ఆ తర్వాత మ్యాచ్‌ను ఒక్కొక్కరికి 18 ఓవర్లకు కుదించారు. వర్షం తర్వాత మ్యాచ్ తిరిగి ప్రారంభమైనప్పుడు, సూర్య, గిల్ దూకుడుగా బ్యాటింగ్ ప్రారంభించారు. ఇద్దరూ ఆస్ట్రేలియన్ బౌలర్లను పూర్తిగా దెబ్బతీశారు, కానీ అకస్మాత్తుగా, 10వ ఓవర్‌లో మళ్ళీ భారీ వర్షం మొదలైంది, మ్యాచ్ తిరిగి ప్రారంభం కాకుండా నిరోధించింది. వర్షం ప్రారంభమైనప్పుడు, కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ 24 బంతుల్లో 3 ఫోర్లు, రెండు సిక్సర్లతో 39 పరుగులు చేశాడు. శుభ్‌మాన్ గిల్ 20 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు చేశాడు. భారత్ కేవలం 9.4 ఓవర్లలో ఒక వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది.టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ మొదట బ్యాటింగ్ చేయాలని నిర్ణయించుకున్నాడు. అయితే, భారత బ్యాట్స్ మెన్ తన నిర్ణయం తప్పని నిరూపించుకున్నాడు. అభిషేక్ శర్మ 14 బంతుల్లో 19 పరుగులు చేసి నాలుగు ఫోర్లు బాదాడు. నాథన్ అలెన్ అభిషేక్ ను అవుట్ చేశాడు. సూర్యకుమార్ యాదవ్ 24 బంతుల్లో 39 పరుగులు చేశాడు, శుభ్‌మన్ గిల్ 20 బంతుల్లో అజేయంగా 37 పరుగులు చేశాడు. గిల్ నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ బాదగా, సూర్య మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు బాదాడు. ఆస్ట్రేలియా తరఫున, జోష్ హాజిల్‌వుడ్ 3 ఓవర్లలో 24 పరుగులు ఇచ్చాడు. మాథ్యూ కున్హెమాన్ 2 ఓవర్లలో 22 పరుగులు, మార్కస్ స్టెయిన్స్ 1 ఓవర్లో 10 పరుగులు, నాథన్ ఎల్లిస్ 1.4 ఓవర్లలో 25 పరుగులు ఇచ్చాడు. జేవియర్ బార్ట్లెట్ 2 ఓవర్లలో 16 పరుగులు ఇచ్చాడు. ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టీ20లో భారత టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ రికార్డు నెలకొల్పాడు. ఈ విధ్వంసక బ్యాట్స్‌మన్ రెండు సిక్సర్లు కొట్టి, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌లలో 150 సిక్సర్లు కొట్టిన ప్రపంచంలో ఐదో ఆటగాడిగా నిలిచాడు. ఈ జాబితాలో రోహిత్ శర్మ అగ్రస్థానంలో ఉన్నాడు, అతను ఫార్మాట్ నుంచి రిటైర్ అయ్యే ముందు 159 మ్యాచ్‌ల్లో 205 సిక్సర్లు కొట్టాడు. ఈ మ్యాచ్‌లో మూడో స్థానంలో వచ్చిన సూర్యకుమార్ యాదవ్ తన దూకుడు విధానాన్ని కొనసాగించాడు. 10వ ఓవర్ మూడో బంతికి ఇన్నింగ్స్‌లో తన రెండో సిక్స్‌తో 150వ టీ20ఐ సిక్స్‌ను పూర్తి చేశాడు.

## 6 పరుగులకే ఆలౌట్..

### బంగ్లా, మాల్దీవుల మహిళా క్రికెట్ జట్ల మధ్య మ్యాచ్

ఫాస్ బ్యాటింగ్‌కు పేరుగాంచిన టీ20 క్రికెట్‌లో, ఒక జట్టు కేవలం 6 పరుగులకే ఆలౌట్ అయింది. మొదట్లో ఈ చెత్త రికార్డును ఎవరూ నమ్మలేదు. ఎందుకంటే, టీ20 క్రికెట్‌లో ఇంత స్కోరును ఊహించడం కష్టం. ఈ మ్యాచ్ స్కోరు కార్డు ఒక పీడకల లాంటిది. ఒక జట్టు 20 ఓవర్లలో 250 పరుగులు దాటగా, మరొక జట్టు అదే టీ20 మ్యాచ్‌లో కేవలం 6 పరుగులు మాత్రమే చేసి చరిత్రలో ఒక అవమానకరమైన రికార్డును లిఖించింది. ఈ మ్యాచ్ డిసెంబర్ 5, 2019న దక్షిణాసియా క్రీడల మహిళల క్రికెట్ పోటీలో బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ జట్టు, మాల్దీవుల మహిళా క్రికెట్ జట్టు మధ్య జరిగింది. నేపాల్‌లోని పోఖారాలో జరిగిన మ్యాచ్‌లో, బంగ్లాదేశ్ కెప్టెన్ సల్మా ఖాతున్ టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకుంది. మొదట బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ తమ ఓపెనర్లు ఇద్దరినీ చౌకగా కోల్పోయింది. కానీ, నిగర్ సుల్తానా, ఫర్గానా హక్‌ల అద్భుతమైన భాగస్వామ్యం బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 255/2 పరుగుల భారీ స్కోరును సాధించింది. 19 పరుగుల స్వల్ప స్కోరుకే ఇద్దరు ఓపెనర్లను కోల్పోయిన తర్వాత, బంగ్లాదేశ్ జట్టు చౌకగా ఆలౌటవుతుందనే ఊహాగానాలు చెలరేగాయి. కానీ, నిగర్ సుల్తానా, ఫర్గానా హూక్‌ల అద్భుతమైన సెంచరీలు జట్టును 20 ఓవర్లలో 255 పరుగుల భారీ స్కోరుకు చేర్చాయి. ఈ మ్యాచ్‌లో సుల్తానా 65 బంతుల్లో 14 ఫోర్లు, మూడు సిక్సర్లతో అజేయంగా 113 పరుగులు చేయగా, ఫర్గానా హౌక్ 53 బంతుల్లో 20 ఫోర్లతో సహా 110 పరుగులు చేశాడు. విశేషమైన విషయం ఏమిటంటే, ఇద్దరు బ్యాట్స్‌మెన్స్ అజేయంగా నిలిచారు. జట్టు మొత్తం 255 పరుగులు సాధించడంలో సహాయపడింది. 255 పరుగులు చేసిన తర్వాత బంగ్లాదేశ్ విజయం సాధిస్తుందని 99% ఖచ్చితంగా ఉంది. కానీ మైదానంలో ఉన్న ప్రేక్షకులకు, బంగ్లాదేశ్‌కు కూడా ఈ మ్యాచ్‌లో 249 పరుగుల భారీ తేడాతో గెలుస్తుందని ఎవ్వరికీ తెలియదు. నిజానికి, 20 ఓవర్లలో 256 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే మాల్దీవుల మహిళా క్రికెట్ జట్టు 12.1 ఓవర్లలో కేవలం ఆరు పరుగులకే ఆలౌటైంది. షమ్మా అలీ అత్యధికంగా 2 పరుగులు చేశారు. సజా ఫాతిమత్, కినానాథ్ ఇస్మాయిల్ ఒక్కొక్క పరుగు చేయగా, మిగతా బ్యాటర్స్ ఖాతా తెరవలేకపోయారు. జట్టు మొత్తానికి రెండు పరుగులు అదనపు పరుగులుగా జోడించబడే పరిస్థితి ఏర్పడింది. బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ జట్టు తరపున రీతు మోని, సల్మా ఖాతున్ అత్యుత్తమ బౌలింగ్ ప్రదర్శనలు ఇచ్చారు. వీరు ముగ్గురు బ్యాటర్లను ఔట్ చేశారు. రీతు తన నాలుగు ఓవర్లలో 1 పరుగుకు మూడు వికెట్లు పడగొట్టింది. అందులో మూడు మెయిడెన్ ఓవర్లు కూడా ఉన్నాయి. అదే సమయంలో, కెప్టెన్ సల్మా తన 3.1 ఓవర్లలో 2 పరుగులకు మూడు వికెట్లు పడగొట్టింది. రబేయా ఖాన్ తన రెండు ఓవర్లలో కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చి వికెట్ తీసుకోలేకపోయింది. అయితే, పూజా చక్రవర్తి, నహిదా అక్తర్ ఒక్కొక్క బ్యాటర్‌ను ఔట్ చేయడంతో, మాల్దీవులు 12.1 ఓవర్లలో కేవలం 6 పరుగులకే ఆలౌట్ అయింది.

## నన్ను విలన్‌గా మార్చేశారు

### భారత స్టార్ బౌలర్ మహమ్మద్ షమీ

భారత స్టార్ బౌలర్ మహమ్మద్ షమీ టీమిండియాకు దూరంగా ఉన్నప్పటికీ.. రంజీ ట్రోఫీలో సంచలనం సృష్టిస్తున్నాడు. రంజీ ట్రోఫీలో అద్భుతంగా రాణించి తాను రీఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు నిరూపించుకుంటున్నాడు. రంజీ ట్రోఫీలో రెండు మ్యాచ్‌లలో 15 వికెట్లు తీసి తన ఫిట్‌నెస్‌ను నిరూపించుకోవడమే కాకుండా సెలెక్టర్లకు గట్టి సమాధానమిచ్చాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో గుజరాత్‌తో జరిగిన రెండో రౌండ్ మ్యాచ్‌లో మొత్తం 8 వికెట్లు పడగొట్టి బెంగాల్ జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. మ్యాచ్ అనంతరం టీమిండియాలో ఎంపిక కాకపోవడంపై జరుగుతున్న వివాదంపై షమీ కీలక ప్రకటన చేశాడు.మంగళవారం గుజరాత్‌పై రెండో ఇన్నింగ్స్‌లో షమీ 38 పరుగులిచ్చి 5 వికెట్లు పడగొట్టి, తన జట్టుకు 141 పరుగుల తేడాతో భారీ విజయాన్ని అందించాడు. మ్యాచ్ తర్వాత మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ.. ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపిక కాకపోవడంపై చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ చేసిన వ్యాఖ్యల గురించి అడగ్గా, షమీ ఇలా అన్నాడు."నాకు తెలుసు, ఈ ప్రశ్న వస్తుందని. నేను ఎప్పుడూ ఏదో ఒక వివాదంలో ఉంటాను. మీరు నన్ను అప్పటికే విలన్‌గా మార్చేశారు. దీని గురించి నేను ఇంకేం చెప్పగలను? ఈ రోజుల్లో సోషల్ మీడియాలో ప్రతి చిన్న విషయాన్ని వక్రీకరించి చూపిస్తున్నారు. నా పని కేవలం బాగా ప్రదర్శన ఇవ్వడం, ఫిట్‌గా ఉండి భారత జట్టు కోసం ఎల్లప్పుడూ అందుబాటులో ఉండడం. నాకు అవకాశం దొరికినప్పుడల్లా నా అత్యుత్తమ ప్రదర్శన ఇస్తాను. మిగతాదంతా సెలెక్టర్లపై ఆధారపడి ఉంటుంది." అని పేర్కొన్నాడు. షమీ ఇంకా మాట్లాడుతూ.. "ఒక కష్టమైన దశ నుంచి బయటపడి బాగా రాణించడం చాలా సంతోషాన్నిస్తుంది. ప్రపంచ కప్ తర్వాత నా సమయం చాలా కష్టంగా, బాధాకరంగా ఉంది. కానీ ఆ తర్వాత నేను రంజీ ట్రోఫీ, వైట్-బాల్ క్రికెట్, ఐపీఎల్, దులీప్ ట్రోఫీ ఆడాను. ఇప్పుడు నా ఫామ్ మళ్లీ పూర్వ స్థితికి వచ్చింది. నాలో ఇంకా చాలా క్రికెట్ మిగిలి ఉందని నేను స్పష్టంగా అనుభూతి చెందుతున్నాను" అని చెప్పాడు.షమీ అహ్మదాబాద్‌లో జరిగిన 2023 వన్డే ప్రపంచ కప్ ఫైనల్ తర్వాత ఏడాదికి పైగా టీమిండియాకు దూరంగా ఉన్నాడు. ఆ తర్వాత ఛాంపియన్స్ ట్రోఫీ కోసం జట్టులోకి తిరిగి వచ్చాడు. భారత జట్టు తరఫున చివరి మ్యాచ్ 2025 మార్చి 9న దుబాయ్‌లో న్యూజిలాండ్‌తో జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్. అప్పటి నుంచి మహమ్మద్ షమీ టీమిండియాలోకి తిరిగి రావడానికి ఎదురుచూస్తున్నాడు.షమీ చిన్ననాటి కోచ్ మొహమ్మద్ బద్రుద్దీన్ మంగళవారం మాట్లాడుతూ.. షమీ తన ఫామ్‌ను తిరిగి పొందాడని, పూర్తిగా ఫిట్‌గా ఉన్నాడని అన్నారు. "అతని ఫామ్ తిరిగి వచ్చింది, అతను 100 శాతం ఫిట్‌గా ఉన్నప్పుడు మాత్రమే ఇలా జరుగుతుంది. షమీకి ఫామే ముఖ్యం. ఒకసారి అతనికి ఫామ్ దొరికితే, అతను వేరే బౌలర్‌గా మారిపోతాడు. ఈ రోజు నేను చూసింది పాత షమీని. నాకు ఎటువంటి లోపం కనిపించలేదు" అని కోచ్ వ్యాఖ్యానించాడు.


## శ్రేయస్ ఎలాంటి సర్జరీ జరగలేదు

### బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడి

సిడ్నీ వేదికగా జరిగిన ఆసీస్? మ్యాచ్?లో భారత ఆటగాడు శ్రేయస్? అయ్యర్?కు తీవ్ర గాయం కావడంతో ఆస్పత్రిలో చేరారు. అతడి ప్లీహానికి గాయమవడంతో అంతర్గతంగా రక్తస్రావం జరిగి ఐసీయూలో చేర్చినట్లు వార్తలు వచ్చాయి. శ్రేయస్ అయ్యర్?కు శస్త్ర చికిత్స జరిగిందని, కనీసం ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు క్రికెట్ వర్గాలు పేర్కొన్నాయి. అయితే శ్రేయస్? పరిస్థితిపై బీసీసీఐ మరోసారి స్పందించింది. శ్రేయస్ పరిస్థితి నిలకడగానే ఉన్నట్లు పేర్కొంది. ?అతడు ఎలాంటి సర్జరీ చేయించుకోవడం లేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా వెల్లడించారు. 'శ్రేయస్ అయ్యర్ పరిస్థితి బాగానే ఉంది. వైద్యులు అనుకున్న దానికంటే వేగంగా శ్రేయస్ రికవరీ అవుతున్నాడు. డాక్టర్ రిజ్వాన్‌తో నిరంతరం టచ్‌లోనే ఉన్నాం. సిడ్నీ ఆసుపత్రిలోనే భారత జట్టు వైద్యుడు కూడా ఉన్నారు. పూర్తిగా కోలుకుని రావడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుందని అనుకుంటున్నాం. కానీ, శ్రేయస్ తీరును చూస్తే ఇంకాస్త ముందుగానే కోలుకున్నా ఆశ్చర్యపోనక్కర్లేదు. వైద్యులు కూడా శ్రేయస్ పరిస్థితి మెరుగుదల బాగా ఉందని తెలిపారు. ఇప్పటికే అతడు తన రోజువారీ కార్యక్రమాలను చేసుకుంటున్నాడు. గాయం తీవ్రంగా అయి ఉండొచ్చు. కానీ ప్రమాదం నుంచి మాత్రం బయటపడ్డాడు. ఇప్పటికే ఐసీయూ నుంచి శ్రేయస్?ను సాధారణ రూంకు మార్చారు' అని సైకియా వివరించారు. ఇక శ్రేయస్?కు శస్త్రచికిత్స జరిగినట్లు సోషల్? మీడియాలో వార్తలు వచ్చాయని సైకియా అన్నారు. కానీ అతడికి ఎలాంటి సర్జరీ జరగలేదని చెప్పారు. అయితే శ్రేయస్? ప్లీహంలో అంతర్గత రక్తస్రావం అయ్యిందని, దానిని ఆపేందుకు భిన్నమైన వైద్య ప్రక్రియను చేపట్టినట్లు తెలిపారు. అందుకే, చాలా త్వరగా రికవరీ అవుతున్నాడని పేర్కొన్నారు. ఇలాంటి గాయాలు ఉన్నప్పుడు కనీసం ఏడు రోజులు ఆసుపత్రిలోనే ఉండాలని అన్నారు.



వేగంగా కోలుకుంటున్నప్పటికీ శ్రేయస్ కూడా ఆసుపత్రిలోనే ఉంటాడని సైకియా స్పష్టం చేశారు. సిడ్నీ వేదికగా ఆసీస్‌తో జరిగిన మూడో వన్డేలో క్యాచ్‌ను అందుకునే క్రమంలో శ్రేయస్ అదుపు తప్పి నేలపై పడ్డాడు. దీంతో పక్కటెములకు గట్టి దెబ్బ తగిలింది. వెంటనే బీసీసీఐ మెడికల్ టీమ్ శ్రేయస్?ను ఆసుపత్రికి తరలించింది. పక్కెటెముకల్లో అంతర్గతంగా రక్తస్రావం అయినట్లు వైద్యులు గుర్తించారు. దీంతో అతడిని ఐసీయూలో చేర్చారు. ఇప్పటికే శ్రేయస్ కుటుంబసభ్యులు ఆస్ట్రేలియాకు పయనమైంది. కాగా, ఈ సిరీస్?కు ముందు అయ్యర్?ను వైస్ కెప్టెన్?గా నియమించారు. తొలి మ్యాచ్?లో ఫెయిలైన అయ్యర్ రెండో వన్డే హాఫ్ సెంచరీతో రాణించాడు. అడిలైడ్? వేదికగా జరిగిన ఈ మ్యాచ్?లో ఆయ్యర్ 61 పరుగులు చేశాడు. ఇక మూడో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగానే గాయపడ్డాడు. శ్రేయస్ మళ్లీ ఆడాలంటే దాదాపు రెండు మూడు నెలల వరకు ఆగాల్సి వస్తోంది. ఇక ఆసీస్ టూర్‌లో భాగంగా భారత్? జట్టు 5 టీ20ల సిరీస్‌ను ఆడనుంది. బుధవారం కాన్‌బెర్రా వేదికగా మొదటి? మ్యాచ్ జరగనుంది. మూడు వన్డేల సిరీస్‌ను టీమ్‌ఇండియా ఇప్పటికే 2-1 తేడాతో కోల్పోయింది.




## విరాట్ కోహ్లీకి నం. 1 ప్లేస్

### రోహిత్ శర్మకు సెకండ్ ప్లేస్ ఇస్తాను

### ఆసీస్ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ వెల్లడి

### టాప్-5 వన్డే బ్యాట్స్‌మెన్ జాబితా విడుదల

భారత జట్టు ప్రస్తుతం ఆస్ట్రేలియా పర్యటనలో ఉంది. వన్డే సిరీస్ ఇప్పటికే ముగియగా టీ20 సిరీస్ ఈరోజు నుండి ప్రారంభం కానుంది. ఇటీవల మాజీ ఆసీస్ పేసర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఒక జాబితాను విడుదల చేశాడు. భారత జట్టు తరపున రాణించిన టాప్-5 వన్డే బ్యాట్స్‌మెన్‌ల జాబితాను ఆయన వెల్లడించారు. క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కు ఇందులో చోటు లభించినప్పటికీ, ఆయన కంటే ముందు ప్రస్తుత తరం ఆటగాళ్లకు స్థానం కల్పించడం ఆశ్చర్యకరం. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, సచిన్, ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్‌లను టాప్-5 భారత వన్డే బ్యాట్స్‌మెన్‌లుగా మెక్‌గ్రాత్ పేర్కొన్నాడు. మాజీ ఆస్ట్రేలియా ఫాస్ట్ బౌలర్ గ్లెన్ మెక్‌గ్రాత్ ఎప్పటివరకు ఉన్న టాప్-5 భారత వన్డే బ్యాట్స్‌మెన్‌ల జాబితాను విడుదల చేశాడు. ఇందులో అతను రోహిత్ శర్మను సచిన్ టెండూల్కర్ కంటే పై స్థానంలో ఉంచడం, మాజీ ఓపెనింగ్ బ్యాట్స్‌మెన్ వీరేంద్ర సెహ్వాగ్‌ను ఆశ్చర్యకరంగా విస్మరించడం చర్చనీయాంశమైంది. మెక్‌గ్రాత్ తన జాబితాలో విరాట్ కోహ్లీకి నం. 1 ప్లేస్ ఇచ్చాడు. ఆ తర్వాత రోహిత్, సచిన్, ఎంఎస్ ధోని, యువరాజ్ సింగ్‌లకు చోటు కల్పించాడు. "ఈ జాబితాలో నేను రోహిత్ శర్మకు సెకండ్ ప్లేస్ ఇస్తాను. వన్డే క్రికెట్‌లో అతని గణాంకాలు చాలా బాగున్నాయి. అతను ఇందులో మూడు డబుల్ సెంచరీలు చేశాడు. వన్డేల్లో 264 పరుగుల అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డు కూడా అతని పేరు మీద ఉంది. అతను ఇప్పటివరకు 276 మ్యాచ్‌లలో 11,000 కంటే ఎక్కువ పరుగులు చేశాడు. టెస్ట్‌లతో పోలిస్తే, అతను వన్డేల్లో మెరుగ్గా రాణించాడు. రోహిత్ ఒక క్లాస్ ప్లేయర్. అందుకే నేను అతనికి సెకండ్ ప్లేస్ ఇచ్చాను. ఈ జాబితాలో విరాట్ కోహ్లీ కాకుండా మరెవరికైనా ఫస్ట్ ప్లేస్ ఇవ్వడం చాలా కష్టం. అతని స్ట్రైక్ రేట్, యావరేజ్ అద్భుతం" అని మెక్‌గ్రాత్ విశ్లేషించాడు. "నా నం.2 రోహిత్ శర్మ. వన్డే క్రికెట్‌లో అతని గణాంకాలు, అతను ఆడిన తీరు అద్భుతం. మూడు డబుల్ సెంచరీలు, 264 పరుగుల అత్యధిక స్కోరు చాలు. తను ఎంత గొప్ప ప్లేయరో చెప్పడానికి. 276 మ్యాచ్‌లలో 11,000 కంటే ఎక్కువ పరుగులు. వన్డే స్పెషలిస్ట్ అని తన మీద ముద్రపడింది. టెస్ట్ క్రికెట్‌లో అతని గణాంకాలు మరింత మెరుగ్గా ఉండాల్సింది. ఎందుకంటే అతను ఒక క్లాస్ ప్లేయర్. నేను అతన్ని నం.2 లో ఉంచుతాను" అని అన్నారు. దాదాపు ఏడు నెలల తర్వాత అంతర్జాతీయ క్రికెట్‌లోకి తిరిగి వచ్చిన రోహిత్ శర్మ, ఆస్ట్రేలియాపై జరిగిన వన్డే సిరీస్‌లో ఆకట్టుకున్నాడు. అతను ఒక సెంచరీ, ఒక హాఫ్ సెంచరీ సాధించి, మ్యాన్ ఆఫ్ ది సిరీసుగా నిలిచాడు. ఈ క్రమంలో ఆస్ట్రేలియా గడ్డపై వన్డేల్లో 1000 పరుగులు చేసిన బ్యాట్స్‌మెన్‌గా రికార్డు సృష్టించాడు. ఆస్ట్రేలియాపై వన్డేల్లో 2500 పరుగులు చేసిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా కూడా రోహిత్ నిలిచాడు. ఆస్ట్రేలియాపై రోహిత్‌కు స్వదేశంలో, ఆస్ట్రేలియాలో చాలా మంచి వన్డే బ్యాటింగ్ రికార్డు ఉంది. అతను 2013లో బెంగళూరులోని ఎం. చిన్నస్వామి స్టేడియంలో వారికి వ్యతిరేకంగా తన మొదటి డబుల్ సెంచరీ (209) సాధించాడు. ఆస్ట్రేలియాలో ఆస్ట్రేలియాపై ఐదు వన్డే సెంచరీలు ఉన్నాయి. ఇటీవల ముగిసిన





భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో రోహిత్ మూడు మ్యాచ్‌లలో ఆడి, 8, 73, 121 పరుగులు సాధించి, అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డును గెలుచుకున్నాడు. ఆస్ట్రేలియాలో జరిగిన భారత్-ఆస్ట్రేలియా వన్డే మ్యాచ్‌లలో 1000 పరుగులు చేసిన ఏకైక క్రికెటర్ కూడా రోహిత్. అక్టోబర్ 25న ఎస్‌సీజీలో రెండు జట్ల మధ్య జరిగిన మూడవ మ్యాచ్‌లో అతని 121 పరుగుల ఇన్నింగ్స్ సమయంలో వన్డే క్రికెట్‌లో ఆస్ట్రేలియాపై 2500 పరుగులు చేసిన రెండవ బ్యాట్స్‌మెన్‌గా కూడా నిలిచాడు. టీ20 సిరీస్‌లో జస్ప్రీత్ బుమ్రా బరిలోకి దిగుతున్నాడు. అతని పాత అద్భుతమైన ప్రదర్శనలకు తోడు, ఇప్పుడు టీ20ఐలలో అతను పవర్‌ప్లేలో మరింత దూకుడుగా బౌలింగ్ చేస్తాడని భావిస్తున్నారు.

## ఆసీస్‌తో అమీతుమీ తేల్చుకోనున్న టీమిండియా

### మెల్‌బోర్న్ వేదికగా నేడు రెండో టీ20

### ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగనున్న భారత్

### అర్ష్‌దీప్ సింగ్ ను జట్టులోకి తీసుకునే చాన్స్

ఆస్ట్రేలియాతో ఐదు టీ20ల సిరీస్‌లో తొలి మ్యాచ్‌ను వరణుడు మింగేయడంతో టీమిండియా మరో ఆసక్తికరమైన పోరుకు సిద్ధమైంది. మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరిగే రెండో టీ20లో ఆతిథ్య ఆసీస్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది. వర్షం అంతరాయం కలిగించిన తొలి మ్యాచ్‌లో భారత్ బ్యాటర్లు దుమ్మురేపారు. అదే జోరును రెండో టీ20లోనూ కొనసాగించాలనుకుంటున్నారు. తొలి టీ20లో ముగ్గురు స్పిన్నర్లు, ఇద్దరు స్పెషలిస్ట్ పేసర్లతో పాటు ఓ పేస్ ఆల్‌రౌండర్‌తో బరిలోకి దిగిన టీమిండియా.. రెండో టీ20లో తమ కాంబినేషన్‌ను మార్చుకునే ఛాన్స్ ఉంది.మెల్ బోర్న్ పిచ్ సాధారణంగా పేస్‌కు అనుకూలంగా ఉంటుంది. ఇది బౌన్సీ పిచ్. బ్యాటర్లు పరుగుల పండుగ చేసుకుంటారు. మైదానం పెద్దది కాబట్టి స్పిన్నర్లు వికెట్లు తీయకపోయినా.. పరుగులు నియంత్రించే అవకాశం ఉంటుంది. ఈ మ్యాచ్‌కు కూడా వర్షం ముప్పు పొంచి ఉంది. పిచ్ కండిషన్స్‌ను పరిగణలోకి తీసుకుంటే.. టీమిండియా ఎక్స్‌ట్రా పేసర్‌తో బరిలోకి దిగవచ్చు. అప్పుడు కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తిలో ఒకరు




బెంచ్‌కు పరిమితమవుతారు. అదనపు పేసర్‌గా అర్ష్‌దీప్ సింగ్ తుది జట్టులోకి వస్తాడు.ఓపెనర్లుగా శుభ్‌మన్ గిల్, అభిషేక్ శర్మ బరిలోకి దిగనున్నారు. తొలి టీ20లో ఈ ఇద్దరు మెరుగైన ప్రదర్శన చేశారు. ఈ ఏడాది పేలవ ప్రదర్శన కనబర్చిన టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ కూడా తొలి మ్యాచ్‌తో టచ్‌లోకి వచ్చాడు. తనకు అచ్చొచ్చిన ఫస్ట్ డౌన్‌లో బరిలోకి దిగి దుమ్మురేపాడు. తిలక్ వర్మ, సంజూ శాంసన్, శివమ్ దూబే మిడిలార్డర్‌లో ఆడనున్నారు. స్పిన్ ఆల్‌రౌండర్‌గా అక్షర్ పటేల్ కొనసాగనుండగా.. వికెట్ కీపర్‌గా సంజూకు ప్రాధాన్యత దక్కనుండటంతో జితేష్ శర్మకు మరోసారి నిరాశే ఎదురు కానుంది. స్పెషలిస్ట్ స్పిన్నర్లుగా కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి జట్టులో కొనసాగనున్నారు. ఎక్స్‌ట్రా పేసర్ కావాలనుకుంటే ఈ ఇద్దరిలో ఒకరు బెంచ్‌కు పరిమితమవుతారు. తొలి టీ20లో అర్ష్‌దీప్ సింగ్‌ను కాదని హర్షిత్ రాణాను ఆడించడం విమర్శలకు దారి తీసింది. కానీ అతను బ్యాటింగ్ చేయడంతో పాటు ఆసీస్ కండిషన్స్‌లో బాగా రాణించగలడనే కారణంతో తుది జట్టులోకి తీసుకున్నారు. మరోసారి బుమ్రాకు తోడుగా అతన్నే కొనసాగించనున్నారు.

రెండో టీ20 ఆడే భారత తుది జట్టు(అంచనా)

అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్(వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి/అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా.

ఆస్ట్రేలియా పర్యటనకు ఎంపికైన భారత టీ20 జట్టు:

సూర్యకుమార్ యాదవ్(కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్(వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్, రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.



# భూ వివాదాల పెండింగ్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి

ప్రతి మండలంలో వారానికి ఒకసారి సమీక్షించాలి

జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి






**అక్షరకలం నల్గొండ**

పెండింగ్ లో ఉన్న వివిధ దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రెవిన్యూ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆమె కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో రెవెన్యూ అంశాల పై సమీక్షించారు. పెండింగ్ లో ఉన్న భూ రికార్డులు, భూ భారతి, భూ వివాదల దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రతిమండలంలో పెండింగ్ ఫిర్యాదులను వారానికి ఒకసారి సమీక్షించాలని, భూ సంబంధ వ్యవహారాల లో పారదర్శకతకు ప్రాధ్యనత ఇవ్వాలని, ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని చెప్పారు. సాదా బై నామల పై వచ్చిన ఫిర్యాదులను సైతం జాప్యం లేకుండా పరిష్కరించాలని చెప్పారు. అసైన్డ్ భూముల విషయంలో పెండింగ్ సమస్యలు త్వరగా పరిష్కరించాలని, రెవిన్యూ అధికారులందరూ అంకితభావంతో, చిత్త శుద్ధితో పెండింగ్ పనులను పూర్తి చేయాలని కోరారు. మొంథా తుఫాను సందర్భంగా భారీ వర్షాలతో చుట్టూ వరద నీరు చేరిన దేవరకొండ మండలం, కొమ్మేపల్లి ఎస్టి గురుకుల పాఠశాల విద్యార్థులను సురక్షిత ప్రాంతానికి తరలించిన మండల, డివిజన్ రెవెన్యూ అధికారులను ఆమె అభినందించారు. అదనపు కలెక్టర్. జే శ్రీనివాస్, స్థానిక సంస్థలు ఇంచార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, నల్గొండ ఆర్డీవో వై.అశోక్ రెడ్డి, దేవరకొండ ఆర్డిఓ రమణారెడ్డి, చండూరు ఆర్డీవో శ్రీదేవి, తహాశీల్దార్లు ఉన్నారు.

# గొప్ప దేశ భక్తుడు సర్దార్ వల్లభాయి పటేల్

ఎజిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్

రన్ ఫర్ యూనిటీ కార్యక్రమంలో భాగంగా 2కె రన్



**అక్షరకలం నల్గొండ క్రైం**

దేశ సమగ్రత, ఐక్యత కోసం కృషి చేసిన గొప్ప దేశ భక్తుడు ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ అని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ అన్నారు. జాతీయ ఐక్యత దినోత్సవం ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయి పటేల్ 150 వ జయంతి సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో రన్ పర్ యూనిటీ లో బాగంగా 2కె రన్ కార్యక్రమని శుక్రవారం నల్గొండ పట్టణ కేంద్రంలోని యన్జి కళాశాల నుండి క్లాక్ టవర్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ జెండా ఊపి ప్రారంభించి, పోలీస్ అధికారులు, సిబ్బంది, స్థానిక యువత, విద్యార్థులు, ఇతర అధికారులు దాదాపు 500 మందితో కలిసి దేశ సమైక్యతను ప్రతిబింబించేలా ఉత్సాహంగా ఈ పరుగులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడారు. భారత దేశ స్వాతంత్ర పోరాటంలో కీలక పాత్ర పోషించి, 550 కి పైగా సంస్థానాలను భారత దేశంలో విలీనం చేయుటం లో దృడ సంకల్పంతో ఏలాంటి వత్తిడికి లొంగకుండా కీలక పాత్ర పోషించిన గొప్ప వ్యక్తి సర్దార్ వల్లభాయి పటేల్ అన్నారు. అతని150 వ జయంతి సందర్భంగా ఆయన ఆశయాలను గుర్తు చేసుకుంటూ దేశ సమగ్రత, ఐక్యత దేశ భక్తితో కలిసి ఉంటూ దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.అనంతరం జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమానికి ముందు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, నల్లగొండ డిఎస్పి శివరాంరెడ్డి, ఏఆర్ డిఎస్పి శ్రీనివాసులు, సిఐలు రాజశేఖర్ రెడ్డి, మహా లక్ష్మయ్య, జితేందర్ రెడ్డి, శ్రీను నాయక్, రఘువీర్ రెడ్డి ఆర్ఐ లు సంతోష్, శ్రీను, సూరప్ప నాయుడు, హరిబాబు ఎస్సైలు సైదులు, గోపాల్ రావు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఏ శాఖ ఇచ్చినా సంతోషమే

మంత్రి పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు

తనపై ఆరోపణలు ఏవీ రుఝువు కాలేదు

కిషన్ రెడ్డికి నా గురించి సరిగా తెలియదు

మీడియాతో మంత్రి అజారుద్దీన్

**హైదరాబాద్,**

మంత్రిగా తనకు అవకాశం దక్కినందుకు చాలా సంతోషంగా ఉందని అజారుద్దీన్ అన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ అధిష్ఠానానికి, సీఎం రేవంత్‌రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం మీడియాతో అజారుద్దీన్ మాట్లాడారు. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతలు తనపై చేస్తున్న విమర్శలపై స్పందించారు. నాపై వచ్చినవన్నీ ఆరోపణలు మాత్రమే. భాజపా, భారత రాష్ట్ర సమితి నేతల విమర్శలు సరైనవి కావు. నా గురించి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి పూర్తిస్థాయి అవగాహన లేదు. నాపై ఉన్న ఒక్క కేసులోనూ నేరం రుజువు కాలేదు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుంది. మంత్రిగా నాకు అవకాశం కల్పించారు.. నాకు ఏ శాఖ ఇచ్చినా ఇబ్బంది లేదని అజారుద్దీన్ అన్నారు.తెలంగాణ మంత్రిగా కాంగ్రెస్ నేత అజారుద్దీన్ శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఈ మేరకు అజారుద్దీన్‌తో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరయ్యారు. మంత్రివర్గంలో అజారుద్దీన్ చేరికతో తెలంగాణ కేబినెట్ మంత్రుల సంఖ్య 16కి చేరింది. అయినా తెలంగాణ కేబినెట్‌లో ఇంకా 2 బెర్తులు ఖాళీగా ఉన్న విషయం తెలిసిందే.. ఈ సందర్భంగా నూతన మంత్రి అజారుద్దీన్‌కి సీఎం రేవంత్ రెడ్డి శుభాకాంక్షలు తెలిపి మంత్రివర్గంలోకి ఆహ్వానం పలికారు.

# అధికారుల్లో సమన్వయ లోపం..స్పష్టం

అది వరంగల్ వరదల్లో కనిపించింది

ఇలాగే వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు

మొంథా తుఫాన్‌తో 12జిల్లాల్లో ప్రభావం

పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు

మృతి చెందిన వారికి 5లక్షల పరిహారం

ఎకరా పంట నష్టానికి 50వేలు చెల్లింపు

ఇసుకమేటలు తొలగించేందుకు ప్రణాళికలు

వరంగల్ వరద ప్రాంతాల్లో సిఎం ఏరియల్ సర్వే

కలెక్టరేట్‌లో అధికారులతో రేవంత్ సమీక్ష

**హనుమకొండ,**

'మొంథా' తుపాను ప్రభావంతో తెలంగాణలోని 12 జిల్లాల్లో తీవ్ర నష్టం వాటిల్లిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. పంట నష్టం, ఆస్తి నష్టం, దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని, ప్రజాప్రతి నిధుల వద్దకు వచ్చిన నివేదికలను కలెక్టర్లకు పంపాలన్నారు. అన్ని నివేదికలు సమీకరించి నిర్ణీత విధానంలో కేంద్రానికి నివేదించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్రంలో వరదలపై సీఎం రేవంత్‌రెడ్డి హను మకొండ కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. తుపాను నష్టాలపై కేంద్ర నిధులు రాబట్టుకోవాల్సి ఉందని, ఈ విషయంలో అలసత్వం ప్రదర్శించవద్దని అధికారులకు సూచించారు. నిర్లక్ష్యం వహించిన అధికారులపై చర్యలకు వెనుకాడబోమని హెచ్చరించారు. ధనిక రాష్ట్రమని కేంద్రం నుంచి రావాల్సిన నిధులు వదులకునే ప్రసక్తే లేదన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో ప్రజలకు అందించాల్సిన ఆర్థిక సాయంపై గతంలో ఇచ్చిన జీవో ప్రకారం.. తాజా వరదల్లో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇళ్లు మునిగిన వారికి రూ.15వేల చొప్పున నష్టపరిహారం చెల్లించనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. గుడిసెలు కోల్పోయిన వారికి ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఎకరా పంట నష్టానికి రూ.10వేలు చొప్పున, ఆవులు, గేదెలు మృత్యువాత పడితే రూ.50వేలు, మేకలు, గొర్రెలకు రూ.5వేలు చెల్లించేందుకు చర్యలు చేపట్టాలని సీఎం ఆదేశించారు. వరంగల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి పర్యటించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఏరియల్ సర్వే నిర్వహించిన సీఎం రేవంత్



సమ్మయ్య నగర్, పోతన నగర్, రంగంపేటలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం జిల్లా కలెక్టరేట్ లో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గ్రేషియా అందించనున్నట్లు ప్రకటించారు. వరద బాధితులకు తక్షణ సాయం కింద రూ. 15 వేలు అందించనున్నట్లు ప్రకటించారు. పంట నష్టం అంచనా వేయాలని.. పంట నష్టం అంచనాలో ప్రజా ప్రతినిధులను తీసుకెళ్లాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తెలంగాణకు కేంద్రం మొండిచేయి చూపితే ఊరుకోమని అన్నారు. పేరుకుపోయిన చెత్తనంతా క్లియర్ చేయాలని.. ఓరుగల్లును త్వరగా పునరుద్ధరించాలని సీఎం రేవంత్ అన్నారు. నాలాలపై అక్రమ నిర్మాణాలు గుర్తించి వెంటనే తొలగించాలని ఆదేశించారు. అన్ని శాఖలతో సమన్వయంగా ముందుకెళ్లాలని.. కేంద్రం నుంచి నిధులు తీసుకురావాలని అన్నారు. బాగా దెబ్బతిన్న ఇందిరమ్మ ఇండ్లకు స్పెషల్ కోటా కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని అన్నారు. వరంగల్ నగరంలో చెరువులు నాళాల కబ్జాలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కబ్జాదారులు ఎంతటి వారైనా వదలొద్దని హెచ్చరించారు. ఫ్లడ్ వాటర్ మేనేజ్‌మెంట్‌పై ఇరిగేషన్ శాఖ సంసిద్ధంగా ఉండాలని దిశానిర్దేశం చేశారు. అన్ని శాఖలు ఇరిగేషన్ శాఖతో సమన్వయం చేసుకోవాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లేక సమస్యలు పెరుగుతున్నాయని చెప్పుకొచ్చారు. చెరువుల ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లోపై లెక్కలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. నాళాల కబ్జాపై ఉక్కు పాదం మోపాలని వార్నింగ్ ఇచ్చారు. ఒక్కరితో వందల మంది ఆగం కావద్దని సూచించారు. డిజాస్టర్ మేనేజ్‌మెంట్‌పై ప్రత్యేక ప్రణాళిక ఉండాలని ఆజ్ఞాపించారు. ఇసుక మేటలు వేసిన పొలాల్లో ఎన్‌ఆర్‌ఈజీఎస్ కింద పనులు చేయాలని సూచించారు. ఇండ్లు కోల్పోయిన వాళ్ల లిస్ట్ సిద్ధం చేసి ఇండ్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్, ఇరిగేషన్ శాఖల మధ్య సమన్వయ లోపంతోనే ముంపు తీవ్రత పెరిగిందని చెప్పుకొచ్చారు. మరోసారి ఇలాంటి ఘటన జరగకుండా చూసుకోవాలని, వరద ప్రభావంపై పూర్తి నివేదికలు ఇవ్వాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు విజిట్ చేయాలని హుకుం జారీ చేశారు. మొంథా తుఫానుపై ఆస్తి, పంట నష్టం అంచనాలు చేసే సమయంలో ప్రజాప్రతినిధులను తీసుకెళ్లాలని సూచించారు. ఇన్‌చార్జ్ మంత్రులు, కలెక్టర్లతో నివేదికలు తయారుచేయాలని ఆదేశించారు. ప్రాణ నష్టం, పశు సంపద నష్టంపై నివేదికలు తెప్పించాలని ఆజ్ఞాపించారు. తుఫానుకి దెబ్బతిన్న రోడ్లపై నివేదికలు తెప్పించాలని ఆదేశించారు. క్లౌడ్ బరస్ట్‌లు భవిష్యత్‌లోనూ వస్తాయని తెలిపారు. వర్ష ప్రభావిత సమస్యలను అధిగమించేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని దిశానిర్దేశర చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు కేంద్ర నిధులు కూడా తెచ్చుకుందామని తెలిపారు. గతంలో కేంద్ర నిధులు వాడుకోలేదని గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వం నుంచి ప్రతి రూపాయి వచ్చేలా రాష్ట్ర అధికారులు నివేదికలు తయారు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు, కలెక్టర్ల మధ్య సమన్వయం ఉండాలని ఆదేశించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు వెంటనే చేపట్టాలని ఆజ్ఞాపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున నష్టపరిహారం ఇస్తున్నామని ప్రకటించారు. పొలాల్లో ఇసుక మేటలు తొలగించేందుకు ఎకరాకు రూ.లక్ష అయినా ఇస్తామని చెప్పుకొచ్చారు. ప్రభుత్వ భవనాలు, రోడ్లు, ఇండ్లు, పంటలు, పశువుల నష్టంపై పూర్తి నివేదిక కావాలని ఆదేశించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి పూర్తిస్థాయి నష్టాన్ని అంచనా వేయాలని ఆజ్ఞాపించారు. ప్రజాప్రతినిధులు తమ నియోజకవర్గాలకు సంబంధించి కలెక్టర్లకు రిపోర్ట్ ఇవ్వాలని సూచించారు. ప్రతి ఎకరానికి రూ.10 వేల చొప్పున పరిహారం అందజేస్తామని పేర్కొన్నారు. దెబ్బతిన్న ప్రతి ఇంటికీ రూ.15 వేల చొప్పున ఆర్థికసాయం అందజేస్తామని హామీ ఇచ్చారు. ఇండ్లు మునిగిన వారికి ప్రతీ ఇంటికి రూ.15 వేలు ఇచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఇండ్లు కోల్పోయి నిరాశ్రయులైన వారిని గుర్తించి వారికి ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. సిఎం వెంట మంత్రి పొంగులేటి, మేయర్ గుండుసుధారాణి తదితరులు ఉన్నారు. ---

# గ్రామ అభివృద్ధి జరగాలంటే... చదువుకున్న యువత రాజకీయ రంగంలో ముందుండాలి....


- స్థానిక సంస్థల బరిలోకి యువత సిద్ధం కండి...

యువ నాయకులు...

- గ్రామ అభివృద్ధి జరగాలంటే చదువుకున్న యువకులు రాజకీయరంగంలో అడుగు వేయాలి.....

**కొల్చారం, అక్టోబర్ 31( అక్షర కలం):-**

అభివృద్ధి మనతోటే సాధ్యమవుతుంది. అనేకమంది యువత చెడు వ్యసనానికి దూరంగా ఉంటూ నాలుగు రోజుల మురిపానికి మద్యానికో, బీరు బిర్యానీకో , డబ్బుకు, చెడు వ్యసనానికి బానిసలు కాకండని పదవి కోసం కాదు ప్రజల కోసం అని విలేకరులకు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు తెలియజేస్తూ రాబోయే రోజుల్లో యువత చేతుల్లోనే దేశ భవిష్యత్తు మరియు గ్రామ అభివృద్ధి దాగి ఉందని, అలాంటి యువత రాజకీయాలలో రాణించాలని స్థానిక సంస్థల ఎన్నికలలో యువత పోటీ చేసేందుకు సిద్ధం కండని, ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా సేవ చెయ్యడమే ధ్యేయంగా పెట్టుకోవాలని తెలిపారు. గ్రామ సమస్యలపై పాఠశాల కాపౌండ్, వీధి లైట్స్, డ్రైనేజి, మౌలిక సదుపాయాల (రహదారులు, తాగునీరు, ఇళ్లు) వంటి అంశాలు మరియు ప్రజా సమస్యలు అర్హతలు ఉండి పింఛన్, హౌసింగ్, ఇతర ప్రభుత్వ పథకాలు అందని వారికి అందే విధంగా యువత గళం విప్పాలని కోరారు. చదువుకున్న యువత మనకెందుకులే అనుకుంటున్నారు కాబట్టి నిరక్షరాసులు నాయకులు అయ్యి గ్రామనికే పెత్తందార్లగ తయారయ్యి గ్రామాన్నే దోచేస్తున్నారు కానీ గ్రామ అభివృద్ధికి తోడ్పడట్లేదు. కాబట్టి యువత అలోచించండి...! విద్యావంతులై మనం రాజకీయ రంగంలో ప్రవేశిస్తే రాయకీయంతో పాటు గ్రామ అభివృద్ధికి తోడ్పడాతమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో యువత పోటీకి ముందుకు రావాలని తెలిపారు.




# మున్నేరు వాగు ఉధృతితో మరోమారు ఆందోళన

ఖమ్మం-బొమ్మకల్ రహదారిపై భారీగా వరద

**ఖమ్మం,**

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీవర్షాలకు ఖమ్మంలోని 'మున్నేరు' వారు మరోమారు ఉధృతంగా సాగుతోంది. అంతకంతకూ నీటిమట్టం పెరగడంతో మరోమారు భయాందోళనలు మొదలయ్యాయి. వాగు పరివాహకంలోని కాలనీలను వరద చుట్టుముట్టింది. మోతీనగర్, బొక్కలగడ్డ కాలనీల్లోకి వరద చేరింది. మోతీనగర్‌లోని 35, బొక్కలగడ్డలో 57 కుటుంబాలను పునరావాస కేంద్రాలకు తరలించారు. మున్నేరుకు భారీగా వరద ప్రవాహం కొనసాగుతోంది. ప్రస్తుతం నీటిమట్టం 24.7 అడుగులకు చేరింది. ఎగువన భారీ వర్షాలతో వరద ప్రవాహం అంతకంతకూ పెరుగుతోంది. మున్నేరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వరద నీరు ఖమ్మం-బోనకల్ ప్రధాన రహదారిపై చేరింది. ఖమ్మం నగరం సమీపంలోని దంసలాపురం వద్ద ఆర్‌అండ్‌బీ రహదారిపై మూడు అడుగుల మేర వచ్చింది. దీంతో పోలీసులు ఆ మార్గంలో రాకపోకలను నిలిపివేశారు. వాహనాలు వెళ్లకుండా బారికేడ్లు ఏర్పాటు చేశారు. చింతకాని మండలం రామకృష్ణాపురం సమీపంలో లో లెవెల్ వంతెనపై వరద ప్రవహిస్తోంది. పాలేరు జలాశయానికి భారీగా వరద ప్రవాహం వచ్చి చేరుతోంది. ఖమ్మంలోని రాపర్తి నగర్ బీసీ కాలనీ వద్ద డంపింగ్ యార్డుకు వెళ్లే రహదారి కొట్టుకుపోయింది. టీఎన్జీవోస్ కాలనీని నలువైపులా వరద నీరు ముంచెత్తడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మున్నేరు పరివాహక ప్రాంతంలోని చేరింది.

అక్షరకలం
తెలుగు దినపత్రిక









# బంధువుల పెళ్లి వేడుకలో అనసూయ హంగామా..

టాలీవుడ్ యాంకర్, నటి అనసూయ భరద్వాజ్ క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. న్యూస్ రీడర్‌గా కెరీర్ ప్రారంభించిన ఆమె, తరువాత యాంకర్‌గా మారి 'జబర్దస్త్' షో ద్వారా ప్రజాదరణ పొందారు. ఆ తర్వాత సినిమాల్లోకి అడుగుపెట్టి, 'క్షణం', 'రంగస్థలం', 'కథనం', 'విమానం', 'పుష్ప', 'కిలాడి' వంటి హిట్ చిత్రాల్లో నటించి తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్నారు. ముఖ్యంగా 'రంగస్థలం' సినిమాలో రంగమ్మత్త పాత్రతో ప్రేక్షకుల హృదయాల్లో స్థానం సంపాదించారు. 39 ఏళ్ల వయస్సులోనూ యంగ్ హీరోయిన్లకు పోటీగా గ్లామర్, గ్రేస్ కలగలిపి ప్రేక్షకులను ఆకట్టుకుంటున్న అనసూయ, సోషల్ మీడియాలో కూడా మిలియన్ల సంఖ్యలో అభిమానులను సొంతం చేసుకున్నారు. తరచుగా తన స్టైలిష్ ఫోటోషూట్లు, వ్యక్తిగత అనుభవాలతో ఫ్యాన్స్‌ను కనెక్ట్ అవుతూ ఉంటారు. తాజాగా అనసూయ తన సోషల్ మీడియాలో కజిన్ సిస్టర్ పెళ్లి వేడుకలో చేసిన సందడికి సంబంధించిన ఫొటోలు షేర్ చేసింది. ఈ ఫొటోలలో అనసూయ చాలా జాలీగా కనిపించింది. తమ బంధువులతో కలిసి చేసిన సందడి అభిమానులని ఎంతగానో ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ పిక్స్ నెట్టింట వైరల్ కాగా, వాటికి నెటిజన్స్ క్రేజీ కామెంట్స్ పెడుతున్నారు. ఇటీవల అనసూయకి సినిమా అవకాశాలు పెద్దగా రావడం లేదు.దాంతో మళ్లీ బుల్లితెరపై సందడి చేస్తుంది. యాంకర్‌గా కాకుండా జడ్జ్ రోల్‌లో సందడి చేస్తుంది. ఇక ఇదిలా ఉంటే, అనసూయ ఇటీవల తన మేనేజర్ మహేంద్ర గురించి చేసిన ఒక పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## స్వచ్ఛమైన ప్రేమకు దర్పణం

సాత్విక్‌వర్మ, ప్రీతి నేహా జంటగా నటిస్తున్న చిత్రం 'ప్రేమిస్తున్నా'. భాను దర్శకత్వం వహించిన ఈ చిత్రానికి కనక దుర్గారావు పప్పుల నిర్మాత. నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. గురువారం ట్రైలర్‌ను అగ్ర దర్శకుడు వెంకీ అట్లూరి విడుదల చేశారు. నేటి తరానికి స్వచ్ఛమైన ప్రేమ గురించి తెలియచెప్పే చిత్రమిదని, అన్‌కండీషనల్ లవ్‌కు దృశ్యరూపంలా ఉంటుందని దర్శకుడు తెలిపారు. ఈ కథలో సంగీతానికి చాలా ప్రాధాన్యం ఉందని, పాటలకు మంచి స్పందన లభిస్తున్నదని నిర్మాతలు తెలిపారు.




## సినిమా స్వర్ణయుగం కాంత

దుల్కర్ సల్మాన్ కథానాయకుడిగా నటిస్తున్న పీరియాడిక్ డ్రామా 'కాంత'. సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. భాగ్యశ్రీబోర్సే కథానాయిక. నవంబర్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. గురువారం ఈ సినిమా ఆంథమ్ 'రేజ్ ఆఫ్ కాంత'ను విడుదల చేశారు. 1950నాటి మద్రాస్ సినిమా స్వర్ణయుగం నేపథ్యంలో రూపొందిస్తున్న చిత్రమిదని, అప్పటి ప్రజల జీవితానికి అద్దంపడుతుందని మేకర్స్ తెలిపారు.


## ది ప్యారడైజ్‌లో నాయికగా?

'అల్లూరి' చిత్రం ద్వారా తెలుగు తెరకు పరిచయమైంది అస్సామీ సుందరి కయాదు లోహర్. అయితే ఆ సినిమా నిరాశపరడచంతో తమిళ, మలయాళ భాషలపై దృష్టిపెట్టింది. ప్రస్తుతం ఈ భామ తమిళంలో వరుస సినిమాలతో బిజీగా ఉంది. తెలుగులో విశ్వక్‌సేన్‌తో కలిసి 'ఫంకీ' చిత్రంలో నటిస్తున్నది.తాజా సమాచారం ప్రకారం తెలుగులో ఈ భామ బంపరాఫర్‌ను సొంతం చేసుకున్నట్లు తెలిసింది. నాని 'ది ప్యారడైజ్' చిత్రంలో ఆమెను కథానాయికగా ఖరారు చేశారని సమాచారం. హైదరాబాద్ నేపథ్యంలో పీరియాడిక్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రానికి శ్రీకాంత్ ఓదెల దర్శకుడు. జడల్ పాత్రలో నాని ఫస్ట్‌లుక్ సినిమాపై అంచనాల్ని పెంచింది. కొంతకాలంగా కథానాయిక అన్వేషణలో ఉన్న చిత్రబృందం చివరకు కయాదు లోహర్‌ను ఎంపిక చేసినట్లు తెలిసింది. ఎట్టకేలకు ఈ భామ తెలుగులో భారీ ఆఫర్‌ను సొంతం చేసుకున్నదని, ఆమె కెరీర్‌కు మంచి బ్రేక్‌నిచ్చే చిత్రమవుతుందని అంటున్నారు.



## అంతర్జాతీయ స్థాయిలో సినిమాటికా ఎక్స్‌పో

సినిమాటికా ఎక్స్‌పో భారతీయ సినిమాను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తుందని, సినిమాకు సంబంధించిన టెక్నాలజీ, ఆర్ట్, కల్చర్‌లను ఒకే వేదిక మీదికి తీసుకొచ్చి సాంకేతిక విప్లవానికి మార్గదర్శకంగా నిలుస్తుందనే నమ్మకం ఉందని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ పీజీ విందా చెప్పారు నవంబర్ 1, 2వ తేదీలలో హైదరాబాద్ హెచ్‌ఐసీసీ వేదికగా సినిమాటికా ఎక్స్‌పో మూడవ ఎడిషన్‌ను నిర్వహించబోతున్నారు. ఇందులో సినిమాటోగ్రఫీ, వీఎఫ్‌ఎక్స్, వర్చువల్ ప్రొడక్షన్, ఏఐ ఫిల్మ్ మేకింగ్ వంటి ఆధునిక సాంకేతికతలపై మాస్టర్ క్లాసులు, వర్క్‌షాపులు నిర్వహించబోతున్నారు.





## నటన కంటే దర్శకత్వానికే ప్రాధాన్యం!

'నేను కాలేజీలో చూసిన ఓ సంఘటన ఆధారంగా ఈ కథ రాసుకున్నా. అప్పట్లో వచ్చిన ఓ పాట కూడా కథ విషయంలో స్ఫూర్తినిచ్చింది. రష్మిక మందన్న ఈ కథ విని బాగా ఎక్సైట్ అయింది. 'ఓ అమ్మాయిగా ఈ స్టోరీకి నేను బాగా కనెక్ట్ అయ్యాను. అందరికి చెప్పాల్సిన కథ ఇది' అంటూ నన్ను ప్రోత్సహించింది' అని అన్నారు నటుడు, దర్శకుడు రాహుల్ రవీంద్రన్. ఆయన నిర్దేశకత్వంలో రష్మిక మందన్న, దీక్షిత్‌శెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన ప్రేమకథా చిత్రం 'ది గర్ల్‌ఫ్రెండ్' నవంబర్ 7న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం రాహుల్ రవీంద్రన్ విలేకరులతో సినిమా విశేషాలను పంచుకున్నారు.





# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలి





**వలిగొండ అక్టోబర్ 31 అక్షరకలం**

:ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని స్థానిక ఎంపిడిఓ జలంధర్ రెడ్డి అన్నారు.శుక్రవారం ఆయన మండల పరిధిలోని వెల్వర్తిలో,రెడ్లరెపాకలో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను పరిశీలించి మాట్లాడుతూ ఇండ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి తొందరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు సూచించారు.మొగిలిపాకలో అండర్ డ్రైనేజీ సమస్యను గ్రామస్థుల కోరిక మేరకు అక్కడికక్కడే పరిష్కరించారు.అనంతరం రెడ్లరేపాక గ్రామంలో తుపాన్ ప్రభావంతో వర్షానికి కూలిన ఇళ్లను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఏఈ సందీప్ రెడ్డి,పంచాయతీ కార్యదర్శులు మత్స్యగిరి,నరేందర్,శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలు



**వలిగొండ అక్టోబర్ 31 అక్షరకలం:**

మండలకేంద్రంలో మాజీ ప్రధాని ఇందిరా గాంధీ 41వ వర్ధంతి సందర్భంగా స్థానిక రాజీవ్ గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ మండల కమిటి ఆధ్వర్యంలో ఆమె చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ స్వర్గీయ ప్రధాని ఇందిరాగాంధీ దేశ వ్యాప్తంగా పేద ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి అమలు చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో పాశం సత్తిరెడ్డి,కంకల కిష్టయ్య,బత్తిని సహదేవ్,బత్తిని లింగయ్య,పాలకూర్ల వెంకటేశం,సహదేవ,చిలుగురి సత్తిరెడ్డి,కొండూరు భాస్కర్,సంజీవరెడ్డి,ఈతాప రాములు,మల్లేష్,మారగొని సురేష్,ఐటిపాముల పుష్ప, ఎక్కలదేవి ప్రమీల,బత్తిని నిర్మల,తదితరులు పాల్గొన్నారు.

# ఏరియాలో 65 శాతం బొగ్గు ఉత్పత్తి

## ఏరియా జిఎం రాధాకృష్ణ



**అక్షర కలం, మందమర్రి అక్టోబర్ 31:**

ఏరియాలో అక్టోబర్ మాసానికి గాను నిర్దేశించిన లక్ష్యానికి 65 శాతం బొగ్గు ఉత్పత్తి సాధ్యమైందని సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్ రాధాకృష్ణ తెలిపారు. శుక్రవారం జిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బొగ్గు ఉత్పత్తి వివరాలను వెల్లడించారు. కేకే 5 గనిలో 20వేల టన్నులకు గాను 17242 టన్నులు 86 శాతం, కాసిపేట గనిలో 19 వేల టన్నులకు గాను 12458 టన్నులు 66 శాతం, కాసిపేట 2 గనిలో 16 వేల టన్నులకు గాను 12495 టన్నులు 78 శాతం, శాంతిఖనిలో 10వేల టన్నుల గాను 6841 టన్నులు 68 శాతం, కేకే ఓసీపి లో 1.8 లక్షల టన్నులకు గాను 1.9 లక్షల టన్నులు 61 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించడం జరిగిందన్నారు. భూగర్భగనుల కార్మికుల గైర్హాజర్ మూలంగా ఆశించిన బొగ్గు ఉత్పత్తి సాధించడం లేదని, రానున్న రోజుల్లో బొగ్గు ఉత్పత్తి మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామన్నారు. బొగ్గు ఉత్పత్తి లక్ష్యాల సాధన కోసం అధికారులు, సూపర్వైజర్లు సమిష్టిగా కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఏరియా పిఎం శ్యాంసుందం లు పాల్గొన్నారు.

## వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలి

**చిట్యాల: (అక్టోబర్ 31 ) అక్షర కలం, ప్రతినిధి**

పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై బోధన సిబ్బంది దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి శ్రవణ్ కుమార్ ఉపాధ్యాయులను ఆదేశించారు. శుక్రవారం చిట్యాల మండలంలోని పెద్దకాపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరు రిజిస్టర్ లను, విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన సంబంధించిన రిజిస్టర్ లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులకు ఉదయం సాయంత్రం ప్రత్యేక తరగతులను నిర్వహించి 100% ఫలితాలతో పాటు అత్యధిక జీపీఏ వచ్చేలా కృషి చేయాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజనం ను పరిశీలించి ప్రభుత్వం నిర్ణయించిన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని



సూచించారు. విద్యార్థులు భోజనం చేసే ప్రదేశంలో నీరు నిల్వ ఉండడాన్ని గమనించి వెంటనే ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని ఇంకుడు గుంతలను మంజూరు చేశారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసి ఇంకుడు గుంతలను వాడుకలోనికి తీసుకురావాలన్నారు ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సైదా నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీధర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీమత్స్యగిరీషుని దర్శనం సర్వపాపహరణం

## కోరిన కోరికలు తీరును,కొలిచిన వారికి కొంగు బంగారమగును

## ప్రారంభమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

**వలిగొండ అక్టోబర్ 29 అక్షరకలం**

:ఎంతో మహిమాన్వితమైనది ఆ పుణ్య క్షేత్రం..కోరిన వారి కోరికలను తీరుస్తూ,కొలిచిన వారి కొంగు బంగారాన్ని చేస్తూ



ప్రసిద్ధి పొందుతుంది.సాక్షాత్తు ఆ విష్ణుమూర్తి దశావతారాల్లో ఒకటైన మత్స్యావతారంతో వెలిసిన శ్రీమత్స్యగిరి లక్ష్మీనర సింహునిగా అవతరించాడు. వలిగొండ మండల పరిధిలోని వెంకటాపురం గ్రామ పరిధిలో గల వేములకొండలో



శ్రీమత్స్యగిరి లక్ష్మీనరసింహస్వామి కొలువై ఉండగా క్షేత్రపాలకుడిగా అంజనేయుడు దర్శనమిస్తాడు.ఇక్కడ స్వామి వారిని దర్శించుకుంటే సర్వపాపాలు తొలిగిపోతాయని అని భక్తుల నమ్మకం.పిలిస్తే పలికి భక్తులకు కోరిన కోరికలు తీర్చి ఎటువంటి దోషాలున్నా, చీడపీడలున్నా స్వామి వారు వాటిని నయం చేస్తూ తన మహిమలను చాటుకుంటున్నాడు. తెలంగాణ రాష్ట్రంలోనే సుప్రసిద్ధ పుణ్యక్షేత్రాల్లో ఒకటిగా పిలువబడుతున్నది శ్రీ మత్స్యగిరి లక్ష్మి నరసింహస్వామి పుణ్యక్షేత్రం. స్వామివారి బ్రహ్మోత్సవాలు

### ప్రారంభమై ఈనెల 5వ తేదీ వరకు జరగనున్నాయి..

ఇందులో భాగంగా స్వామి వారి క్షేత్రాన్ని సుందరంగా అలంకరించి,రంగులు అద్ది,స్వాగత తోరణాలతో,విద్యుత్ కాంతులతో,దీపాలతో అలంకరించారు. బ్రహ్మోత్సవాలకు అందరూ ఆహ్వానులేనని,భక్తులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని శ్రీ మత్స్యగిరి లక్ష్మీనరసింహ స్వామి దేవస్థాన చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు కోరుతున్నారు.

### విష్ణు స్వరూపులుగా మూడు

### నామాల చేపలు...

శ్రీమహావిష్ణువు నుదుటి పైన ఉన్న నామాల రూపం ఇక్కడి కొలనులోని చేపల తలపైన విష్ణు నామాలు ఉండటం ఇక్కడ చేపల ప్రత్యేకత.శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దర్శనం కోసం వచ్చే భక్తులు కొలనులోని చేపలను విష్ణు స్వరూపులుగా శ్రీ మహా విష్ణువు మత్స్య రూపంలో కొండపైన అవతరించినట్లు భక్తులు భావించి వాటిని భక్తితో పూజిస్తారు.

### కోనేటి స్నానంతో మూడు జన్మల పాపాలు తొలగును...

మత్స్యగిరి కొండపైన ఎప్పటికీ తరగని జలసిరితో కోనేరు ప్రత్యేకమైనది.భక్తులు స్వామి వారిని దర్శించుకునే ముందు కోనేరులో స్నానం చేసి స్వామి వారిని దర్శించుకునీ పూజలు చేస్తారు.కోనేరులో స్నానం చేస్తే మూడు జన్మల పాపాలు తొలగుతాయని భక్తుల నమ్మకం.ఇక్కడికి వచ్చిన భక్తులు తప్పని సరిగా కోనేరులో స్నానమాచరిస్తారు.

### 1) బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి చేశాం

### ఆలయ ఈవో మోహన్ బాబు

శుక్రవారం నాడు ప్రారంభమై,5వ తేదీ వరకు జరిగే శ్రీ మత్స్యగిరి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలకు,స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఘనంగా ఏర్పాట్లు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందుకు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నట్లు.బ్రహ్మోత్సవాలలో భక్తులు వేలాదిగా తరలివచ్చి స్వామివారి కళ్యాణాన్ని వీక్షించి స్వామి కరుణాకటాక్షాలు పొందాలని కోరుతున్నాం.

# రైతులకు అన్యాయం జరిగితే పెద్ద ఎత్తున ఉద్యమిస్తాం : బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్రరావు





**చిట్యాల (అక్టోబర్ 31) అక్షర కలం, ప్రతినిధి**

రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరితో రైతాంగం అంతా నష్టపోయే పరిస్థితి వచ్చిందని తెలంగాణ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు అన్నారు. శుక్రవారం రోజున నల్గొండ జిల్లా చిట్యాల పట్టణ కేంద్రంలో భువనగిరి రోడ్ లో గల ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు కళ్ళంలో తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అనంతరం బిజెపి అధ్యక్షుడు రామచంద్రరావు మాట్లాడుతూ తడిసిన ధాన్యాన్ని కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మద్దతు ధర చెల్లించి వెంటనే ధాన్యాన్ని కొని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అన్నారు. రైతులకు ధాన్యం తడవకుండా ఉండటానికి సరైన కవర్లు ఏర్పాట్లు చేయడంలో నిర్లక్ష్యం వహించడం వల్ల ధాన్యం తడిసిపోయింది అని, వడ్లు పట్టడానికి ఫ్యాన్లు , సరైన వసతులు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. వెంటనే రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా తడిసిన ధాన్యాన్ని మద్దతు ధర చెల్లించి కొనుగోలు చేసి రైతుల సమస్యను పరిష్కరించాలని , రైతులకు అన్యాయం జరిగితే బిజెపి పెద్ద ఎత్తున ఉద్యమంలో చేపట్టి రైతుల తరపున పోరాటం చేస్తుందని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ ఈ కార్యక్రమానికి బిజెపి కిసాన్ మోర్చా జాతీయ నాయకులు గోలి మధుసూదన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర నాయకులు గంగిడి మనోహర్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ నకరికంటి మొగులయ్య , జిల్లా ఉపాధ్యక్షులు మహిళ నరసింహ, చిట్యాల పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్, మండల అధ్యక్షులు పీకే వెంకన్న, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు నరసింహ బిజెపి సీనియర్ నాయకులు మాస శ్రీనివాస్, చికిలం మెట్ల అశోక్, కన్నబోయిన మహలింగం, పొట్లపల్లి నరసింహ, చిట్యాల రామన్నపేట నార్కట్పల్లి బిజెపి నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# చిట్యాల పోలీసుల ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ

## పాల్గొన్న పట్టణ వివిధ వర్గాల ప్రజలు, పుర ప్రముఖులు




**చిట్యాల (అక్టోబర్ 31) అక్షర కలం, ప్రతినిధి**

భారత మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకొని నల్గొండ జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన 2కే రన్ కార్యక్రమాన్ని శుక్రవారం చిట్యాల పట్టణ కేంద్రంలో ఎస్సై రవికుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ సమగ్రత, సమైక్యత పెంపొందేలా ప్రజలు జాతీయ భావాన్ని చాటాలన్నారు. చిట్యాల పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల నుండి వనిపాకల గ్రామ పొలిమేర వరకు జరిగిన ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, యువజన సంఘాల నాయకులు, మీడియా ప్రతినిధులు, వివిధ వర్గాల ప్రజలు ఉత్సావంతంగా పాల్గొన్నారు.

# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి.

**చిట్యాల (అక్టోబర్ 31 ) అక్షర కలం, ప్రతినిధి**

దేశ మాజీ ఉప ప్రధాని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని చిట్యాలలో కనకదుర్గ గుడి సెంటర్లో బిజెపి పట్టణ అధ్యక్షులు గుండాల నరేష్ గౌడ్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటితరం నాయకులు యువత సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవిత ని ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పాల్గొన్నారు



# జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా..."రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం విజయవంతం....

**మెదక్, అక్టోబర్ 31( అక్షర కలం ):-**

జాతీయ ఐక్యత దినోత్సవం (అక్టోబర్ 31) సందర్భంగా, సర్దార్ వల్లభభాయ్ పటేల్ గారి జయంతిని పురస్కరించుకొని, పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమం



ఘనంగా నిర్వహించబడింది.శుక్రవారం మెదక్ లో ఉదయం నిర్వహించిన 2 %ఖ% రన్ లో స్థానిక యువత, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, అధికారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 300 మంది పాల్గొన్న ఈ పరుగు కార్యక్రమాన్ని మెదక్ అదనపు ఎస్పీ ఎస్. మహేందర్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ రన్ బోధన్ చౌరస్తా నుండి ప్రారంభమై పట్టణంలోని రాందాస్ చౌరస్తా వద్ద ముగిసింది. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మహేందర్ మాట్లాడుతూ, కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలియజేశారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల ధన-మాన-ప్రాణ రక్షణ కోసం పోలీస్ యంత్రాంగం అహర్నిశలు కృషి చేస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి సహకరించిన విద్యార్థులు, యువత, అధికారులు, పోలీస్ సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెదక్ డి.ఎస్.పి ప్రసన్న కుమార్, ఏఆర్ డి.ఎస్.పి రంగా నాయక్, సీఐ లు, సందీప్ రెడ్డి, కృష్ణ మూర్తి , మహేష్ , రాజా శేఖర్ రెడ్డి , జర్జ్ శైలందర్ ఎసైలు భారీగా పాల్గొన్నారు.



## మాజీ ప్రధాని ఇందిరాగాంధీ కి ఘన నివాళు లర్పించిన యూత్ కాంగ్రెస్ నాయకులు



మందమర్రి/ చెన్నూర్ అక్టోబర్ 31 అక్షర కలం ప్రతినిధి:-

భారతదేశ తొలి మాజీ మహిళా ప్రధానమంత్రి దివంగత ఇందిరా గాంధీ 41వ వర్ధంతిని కార్మిక మైనింగ్ శాఖ మంత్రి డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో శుక్రవారం మందమర్రి పట్టణం బి- 1 క్యాంప్ కార్యాలయం వద్ద ఇందిరా గాంధీ చిత్రపటానికి యూత్ కాంగ్రెస్ నాయకులు పూలమాలవేసి నివాళులు అర్పించారు. వర్ధంతిని ఉద్దేశించి మందమర్రి పట్టణ యూత్ కాంగ్రెస్ నాయకులు రాయబారపు కిరణ్, ముడారపు శేఖర్ లు మాట్లాడుతూ.. తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ అవడం దేశ మహిళలకి ఎంతో ఆదర్శమని, ఆ కాలంలో ఇందిరా గాంధీ దేశాన్ని ప్రగతి పథంలో నడిపించి విప్లవాత్మకమైన సంస్కరణలతో దేశాన్ని ముందుకు నడిపించిన గొప్ప యోధురాలు అని, ఇందిరగాంధీ మన తెలంగాణ ప్రాంతం నుంచి మెదక్ ఎంపీగా ప్రాతినిథ్యం వహించడం పట్ల తెలంగాణ వాసులుగా గర్విస్తున్నామని, ఇందిరా గాంధీ సేవలను గుర్తించి ఆ రోజుల్లోనే భారతరత్న ఇవ్వడం చాలా గర్వించదగ్గ విషయమని, దాదాపు 43 రోజులు పాదయాత్ర నిర్వహించి గరీబ్ హటావో అనే నినాదం ప్రజల్లో స్ఫూర్తిని నింపిన గొప్ప మహిళ, ఇప్పటికీ వారి స్ఫూర్తితోనే కాంగ్రెస్ పార్టీ ఎన్నో పథకాలు అమలు చేసి, ఈరోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళల పట్ల ఎన్నో అభివృద్ధి పథకాలు పెట్టి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికి అభివృద్ధి చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు జావిద్ ఖాన్, రహీం, ఒజ్జ గణేష్, చిలుముల మహేష్, రేగుంట కిరణ్, మెర్గు సతీష్, ధనుక్ అజయ్, యాసిన్, చింటూ, అష్రఫ్, ప్రవీణ్, సోహల్, సమీర్, శ్రీనివాస్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## రన్ పర్ టు కే రన్ లో ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు



అక్షరకలం /భద్రాచలం

భద్రాచలంలో సర్దార్ వల్లభభాయ్ పటేల్ నూట యాభై వ జయంతి సందర్భంగా జాతీయ ఐక్యత దినోత్సవంను పురస్కరించుకుని, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ ఆదేశాల మేరకు భద్రాచలం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ %-% టుకే రన్" కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ రన్ భద్రాచలం బ్రిడ్జి సెంటర్ నుండి జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు గారు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభభాయ్ పటేల్ భారత ఐక్యతకు ప్రతీక అని, ఆయన స్ఫూర్తితో యువత దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి శివనాయక్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, సిఐ నాగరాజు, సిఆర్పిఎఫ్ నూట నలభై ఒక్కటి బెటాలియన్ రెండో వ కమాండెంట్ ప్రీత సి, ఎస్ఐ సతీష్, ట్రాఫిక్ ఎస్ఐ తిరుపతి తదితరులు పాల్గొన్నారు. అలాగే పోలీసు సిబ్బంది, సిఆర్పిఎఫ్ జవాన్లు, విద్యార్థులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సాహంగా పరుగెత్తారు. రన్ ఫర్ యూనిటీ ద్వారా ఐక్యత, సోదరభావం, దేశభక్తి విలువలను ప్రతీ ఒక్కరూ ఆచరించాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంటలకు పరిహారం అందించాలి

### ఎకరానికి 30 వేలు పరిహారం ఇవ్వాలి

### నేలకొరిగిన పంటలను పరిశీలించిన మూడ్ శోభన్

అక్షర కలం/ కారేపల్లి:

తుఫాను ప్రభావంతో నష్టపోయిన పంట పొలాలకు పరిహారం అందించి ఆదుకోవాలని సిపిఎం రాష్ట్ర నాయకులు మూడ్ శోభన్ డిమాండ్ చేశారు. శుక్రవారం సింగరేణి మండలంలోని ఉసిరికాయలపల్లి గ్రామంలో నెలకొరిగిన పత్తి, వరి పంటలను పరిశీలించారు. రైతులను పరామర్శించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముంతా తుఫాను వల్ల రైతులకు తీరని అన్యాయం జరిగిందని అవేదన వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడిన పెట్టి పంటలు సాగు చేసుకుంటే ప్రకృతి వైపరీత్యాల రిత్యా పంటలు దెబ్బతిని రైతులకు ఆర్థికంగా నష్టం తెచ్చిపెట్టిందన్నారు. పత్తి చేతికొచ్చే సమయానికి అధిక వర్షాల వలన నెలరాలుతుందని అన్నారు. పాలు పోసుకొని గింజ గట్టి పడే సమయంలో ఈదురుగాలులు తుఫాను కారణంగా వరి పంటలన్నీ నేలకొరగాయని దీనివల్ల గింజలు రాలిపోయానే తెలిపారు. ఎకరానికి 30 నుంచి 40 వేల రూపాయల వరకు పెట్టుబడి పెట్టారని తీరా పంట చేతికి వచ్చిన సమయంలో తుఫాను కారణంగా పంట నాశనం అయిందని అవేదన వ్యక్తం



చేశారు. ప్రభుత్వం వెంటనే వ్యవసాయ అధికారులతో క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపించి సర్వే నిర్వహించి నష్టపోయిన రైతుల వివరాలను సేకరించాలన్నారు. ఎకరానికి 30 వేల పరిహార అందించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. పత్తి, తడిసిపోయిన ధాన్యాన్ని ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేసి ఆదుకోవాలన్నారు. రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కే నరేంద్ర, డివిజన కమిటి సభ్యులు వజ్జ రామారావు, మాజీ సర్పంచ్ భానోత్ బన్సీలాల్, శాఖ కార్యదర్శులు తేజవత్ చందర్, దాసరి సైదులు, భూక్యా వీరు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు మనిషి స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ జాతీయ సమైక్యతలో భాగస్వామ్యం కావాలి: జీఎం రాధాకృష్ణ, సీఐ శశిధర్ రెడ్డి

మందమర్రి/ చెన్నూర్ అక్టోబర్ 31 అక్షర కలం ప్రతినిధి:-

భారత తొలి ఉప ప్రధాని, హెూం మంత్రి, 'ఉక్కు మనిషి' సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతిని పురస్కరించుకుని మందమర్రి పట్టణంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'రన్ ఫర్ యూనిటీ' కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వక్తలు దేశ సమైక్యతకు పటేల్ అందించిన మహత్తర సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి సింగరేణి ఏరియా జీఎం రాధాకృష్ణ, తహసీల్దార్ సతీష్, మున్సిపల్ కమిషనర్ రాజలింగు హాజరయ్యారు. సింగరేణి మందమర్రి ఏరియా జీఎం రాధాకృష్ణ మాట్లాడుతూ.. భారత దేశాన్ని ఏకతాటిపై నిలిపిన ఘనత పూర్తిగా సర్దార్ వల్లభాయ్ పటేల్‌దేనని ఉద్ఘాటించారు. దేశంలోని వందలాది స్వదేశీ సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసి, పటేల్ దేశ సమైక్యతకు చేసిన కృషి, ఆయన నిస్వార్థ సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. దేశ ప్రగతి కోసం పాటుపడిన ఆయన ఔన్నత్యాన్ని, ధృఢ సంకల్పాన్ని



యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. మందమర్రి సీఐ శశిధర్ రెడ్డి మాట్లాడుతూ.. సర్దార్ పటేల్ గొప్పతనాన్ని, ధైర్యాన్ని ప్రతి పౌరుడు గుర్తుంచుకోవాలని తెలిపారు. కుల, మత, వర్గ, లింగ భేదాలకు అతీతంగా ప్రజలందరూ ఐకమత్యంతో మెలుగుతూ, జాతీయ సమైక్యతలో క్రియాశీలకంగా భాగస్వామ్యం కావాలని కోరారు. ఉక్కు మనిషి అందించిన ఐక్యతా స్ఫూర్తితో సమాజంలో శాంతి, సహకారం నెలకొల్పేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలోని సింగరేణి పాఠశాల మైదానం నుండి ప్రారంభమైన 2కే రన్‌ను మందమర్రి తహశీల్దార్ సతీష్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ రన్‌లో పట్టణ పోలీసులు, విద్యార్థులు, యువతతో పాటు పలు రాజకీయ, సామాజిక సంఘాల నాయకులు, క్రీడాకారులు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. రన్‌లో విజేతలైన అభిరామ్ (ప్రథమ), రాజేందర్-పోలీస్ కానిస్టేబుల్ (ద్వితీయ), నిరంజన్ (తృతీయ) లకు సీఐ, జీఎం, ఎమ్మార్వో, మున్సిపల్ కమిషనర్, ఎస్సై రాజశేఖర్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మందమర్రి పట్టణం పేరును రాష్ట్ర స్థాయిలో, జాతీయ స్థాయిలో నిలిపిన పలువురు క్రీడాకారులను ఈ సందర్భంగా శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి అధికారులు, పట్టణ యువత, వాకర్స్ క్లబ్ సభ్యులు, పట్టణ వాసులు,మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీ నిధులు దుర్వినియోగం...

### పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి

### జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు

అక్షర కలం /భద్రాచలం





భద్రాచలం గ్రామపంచాయతీ నిధులను దుర్వినియోగానికి పాల్పడుతూ జనావాసాల మధ్య నిర్మించాల్సిన సిసి రోడ్డులో రియల్ ఎస్టేట్ వ్యాపారుల లాభాల కోసం ఖాళీ స్థలాలకు వద్ద ప్రైవేట్ కాటేజీల వద్ద ప్రభుత్వ కార్యాలయాల వద్ద నిర్మిస్తున్నారని పేదల నివాసాలను మరిచి ప్రైవేట్ వ్యాపారులకు లబ్ధి చేకూర్చే గ్రామపంచాయతీ అధికారుల విధానం సరైంది కాదని సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి తీవ్రంగా ఆరోపించారు. శనివారం స్థానిక సమస్యలను పరిష్కరించాలని పట్టణ వ్యాప్తంగా పేరుకుపోయిన పాశుద్ధ్య సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఎం భద్రాచలం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా పార్టీ పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి మాట్లాడుతూ రాజుపేట జగదీష్ కాలనీ, కొత్త కాలనీ, సుభాష్ నగర్, అశోక్ నగర్, భూపతి రావు కాలనీ, సుందరయ్య కాలనీ, కుర్రాజులు గుట్ట, ఎంపీ కాలనీ, ఏఎంసీ కాలనీ,తదితర పేదలు నివసించే కాలనీలలో సైడ్ డ్రైన్ లు, సీసీ రోడ్డు లేక మురుగునీరు రోడ్లపై పారుతుందని అన్నారు. పెరిగిన జనావాసాలకు అనుగుణంగా వీధిలైట్లు కూడా లేక చీకట్లోనే వందలాది కుటుంబాలు గడుపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పేదలు ఉండే కాలనీలలో కనీసం సైడ్ రైళ్లు కూడా నిర్మించని గ్రామపంచాయతీ అధికారులు రెడ్డి సత్రానికి పది లక్షల రూపాయల సిమెంట్ రోడ్డు ని మంజూరు చేశారని అంతేకాకుండా ప్రభుత్వ కార్యాలయాలకు వ్యాపారులు చేసే ఖాళీ స్థలాల వద్ద సిమెంట్ రోడ్లను నిర్మించారని ఆరోపించారు. ప్రజలు ఇంటి పన్నుల రూపంలో డబ్బులు చెల్లిస్తుంటే రియల్ ఎస్టేట్ వ్యాపారులకు లబ్ధి చేకూరేలా రోడ్లు ఎలా నిర్మిస్తారని ప్రశ్నించారు. వెంటనే శివారు కాలనీలలో రోడ్లు నిర్మించకపోతే గ్రామపంచాయతీ పాలనను స్తంభింప చేస్తామని హెచ్చరించారు. స్థానిక సమస్యలు పరిష్కరించడంలో ప్రజా ప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పూర్తిగా వైఫల్యం చెందారని సిపిఐఎం జిల్లా కమిటీ సభ్యులు బండారు శరత్ బాబు అన్నారు. ఈనెల ఇరవై ఐదు నుండి సిపిఐఎం చేపట్టిన మాస్ లైన్ పాదయాత్రలో జగదీష్ కాలనీ రాజుపేట అశోక్ నగర్ కొత్త కాలనీ ఏఎంసీ కాలనీ భూపతి రావు కాలనీలలో అనేక స్థానిక సమస్యలు తమ దృష్టికి వచ్చాయని గుర్తు చేశారు. జనావాసాల మధ్య మురుగునీరు చేరి దోమలు సైరవిహారం చేస్తున్నాయని అనేక కాలనీలలో ప్రజలు విష జ్వరాలతో బాధపడుతున్నారని అన్నారు. వెంటనే గ్రామపంచాయతీ అధికారులు పట్టణ వ్యాప్తంగా పారిశుద్ధ్య పనులను చేపట్టాలని కోరారు. అదేవిధంగా కరకట్ట పునర్ నిర్మాణానికి నిధులు కేటాయించి గోదావరి ముంపు నుండి భద్రాచలం రక్షించాలని డిమాండ్ చేశారు.

### ""రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం""

### గ్రామపంచాయతీ ఈవో సిహెచ్ శ్రీనివాస్ రావు

పంచాయతీలకు ఎన్నికలు లేకపోవటం వల్ల నిధుల జాప్యం జరుగుతుందని విడుదలయ్యే అరకురా నిధులతో ఉన్నంతలో ప్రజలకు మేలు చేసే విధంగా అభివృద్ధి పనులు చేపడుతున్నామని సిపిఐఎం వినతి పత్రంలో అందించిన రోడ్లు డ్రైన్లు పరిశీలించి ప్రతిపాదనలు అధికారులకు పంపిస్తామని గ్రామపంచాయతీ కార్యదర్శి సిహెచ్ శ్రీనివాసరావు హామీ ఇచ్చారు. పూర్తిస్థాయిలో సిబ్బంది లేకపోవడం వల్ల పారిశుద్ధ్య సమస్యలు తలెత్తుతున్నాయని త్వరలో ఈ సమస్య కూడా పరిష్కరించి పట్టణ వ్యాప్తంగా పారిశుద్ధ్య కార్యక్రమాలను చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు సున్నం గంగా, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పారెల్లి సంతోష్ కుమార్, డి సీతాలక్ష్మి, పట్టణ కమిటీ సభ్యులు నాదెండ్ల లీలావతి, ధనకొండ రాఘవయ్య, ఎస్ డి ఫిరోజ్,చాట్ల శ్రీనివాసరావు, కనక శ్రీ,నకిరేకంటి నాగరాజు, ఉస్తేల జ్యోతి, జీవనజ్యోతి, కుంజా శ్రీనివాస్, కొరడా శ్రీనివాసరావు, సంద్ర భూపేంద్ర, డివైఎఫ్ఐ నాయకులు డి సతీష్ బాబు, ఆది, పోసి, ఎస్ఎఫ్ఐ నాయకులు రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు

## మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన: పోలీస్ కమిషనర్

అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:

రక్తదానం చేయడం ప్రాణదానంతో సమానమని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్కరణ అమరవీరులో వారోత్సవాల్లో భాగంగా ఖమ్మం రూరల్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మార్కెట్ యార్డ్ లో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరానికి భారీ స్పందన లభించింది. రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి 1,500 మందిపైగా దాతల నుంచి రక్తం సేకరించారు.. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో రక్తం అందుబాటులో లేకపోవడంతో ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారన్నారని, ఆరోగ్యవంతులైన ప్రతీ ఒక్కరు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా రక్తదానం చేయాలన్నారు. తలసేమియా రోగులకు ప్రతి15 రోజులకు ఒకసారి రక్తం అవసరం అవుతుందని, అందు కోసమే అమరవీరుల త్యాగాలకు నివాళిగా ఈ మెగా రక్తదాన శిబిరం ఏర్పాట చేసినట్లు తెలిపారు. ఈ శిబిరాన్ని విజయవంతం చేయడానికి సహకరించిన ఖమ్మం రూరల్, ముదిగొండ, కూసుమంచి, నేలకొండపల్లి మండలం నుండి అధిక సంఖ్యలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులోనూ ఇటువంటి సేవా కార్యక్రమాలు కొనసాగుతాయని



చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ రామానుజం, ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి, ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి, సిఐ లు మురళి, రాజు, సంజీవ్,సాగర్, ఎస్ ఐ సంతోష్, తదితరులు పాల్గొన్నారు.



## అడుగు తడబడకుండా ! చిన్న పాదాలకు పెద్ద అండ !!

### పీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బూట్ల పంపిణీ

అక్షర కలం / ఏదులాపురం:

ఏదులాపురం : తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారుల చదువు ప్రయాణానికి అండగా నిలుస్తున్నారు. ఆయన సూచనల మేరకు పీఎస్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏదులాపురం ప్రభుత్వ పాఠశాలలో ప్రథమ తరగతి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు శుక్రవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా బూట్ల పంపిణీ చేపట్టారు. పల్లె బాలల అడుగు తడబడకుండా%ౌ% ముళ్లు, రాళ్లు గుచ్చుకోకుండా%ౌ% చదువు దారిలో ముందుకు సాగాలనే సదుద్దేశ్యంతో ఈ సాయం మంత్రి పొంగులేటి తన సొంత పీ ఎస్ ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా అందిస్తున్నట్లు నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ



నాయకులు హరినాథ్ బాబు, అజ్మీర అశోక్ నాయక్, సురేష్ నాయక్, వెంపటి రవి, తమ్మినేని నవీన్, ఏటుకూరి సుధాకర్, అంబటి సుబ్బారావు, కందుకూరి వెంకట నారాయణ, మెండె వెంకటేష్ యాదవ్, గౌస్, వెంకట రమణ, శ్రీదేవి, దివ్య, బోయిన సంగయ్య, వెంపటి సురేష్, శేఖర్ రెడ్డి, వెంపటి వెంకన్న, శేషు రెడ్డి, సురేష్ రెడ్డి, విజయలక్ష్మి, రాజు, వెంకటేష్, బోయిన సాయి, పాఠశాల యాజమాన్యం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలి: పోలీసు, రెవిన్యూ అధికారులు.

### – జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్– 31.**



ప్రతి నెల చివరి తేదిన పౌర హక్కుల దినోత్సవం (సివిల్ రైట్స్ డే) నిర్వహించడం జరుగుతుంది అని నారాయణపేట జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో పోలీస్, రెవెన్యూ అధికారులు కొన్ని గ్రామాలను సందర్శించి ప్రతి నెల చివర పౌర హక్కుల దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని తెలిపారు. కొన్ని



సంవత్సరముల క్రితం కుల వివక్ష ఉండేది అని ప్రస్తుతం అంతగా లేనప్పటికీ అక్కడక్కడ గ్రామాలలో ఉన్న అసమానతలను అంటరానితనాన్ని,కుల వివక్షను నిర్మూలించవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని దానికి కృషి చేయాలని అన్నారు. కుల నిర్మూలనకు, ఎస్సీ ఎస్టీ కులాల వారిని చైతన్య పరుచుటకు, వారిని అభివృద్ధి వైపు నడిపించుటకు పోలీస్ శాఖ గ్రామాలలో రెవెన్యూ శాఖ అధికారుల సమన్వయంతో పౌరహక్కుల రక్షణ దినోత్సవం నిర్వహించడం జరుగుతుంది అని అన్ని కులాలకు చెందిన వారిని గ్రామాలలో సమావేశం నిర్వహించి చట్టాలను అమలు చేయు విధానం గురించి అవగాహన కల్పించి వారిలో చైతన్యం తీసుకురావడం కుల వివక్ష నిర్మూలనపై అవగాహన కల్పించడం వల్ల అందరికి అవగాహన చైతన్యం ఉంటుందని అన్నారు. పౌర హక్కుల దినం నిర్వహించడం గ్రామాల్లో ఇంకా కుల వివక్ష అంటరానితనము దళితుల భూవివాదాలు మహిళలపై అత్యాచారాలు నిరోధించడం జరుగుతుందన్నారు.కులం పేరుతో ఎవరినైనా దూషిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని, అంటరానితనం నేరమన్నారు. కులమతాల్లో తేడా లేకుండా అందరూ కలిసికట్టుగా ఐకమత్య%శీ%గా ఉండాలని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీసు, రెవెన్యూ అధికారులు గ్రామ ప్రజలు మొదలగు వారు పాల్గొన్నారు.

# నారాయణపెట తహసిల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్– 31**

నారాయణ పేట జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ సిక్త పట్నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలో పెండింగ్ లో ఉన్న వివిధ దస్త్రాల గురించి ఆరా తీశారు. అలాగే స్లాట్ బుకింగ్, రిజిస్ట్రేషన్లు, సాదా బైనామా దరఖాస్తులతో పాటు భూ భారతి దరఖాస్తుల గురించి తహసిల్దార్ అమరేంద్ర కృష్ణను అడిగి తెలుసుకున్నారు. నారాయణ పేట కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సేకరణ ఎంతవరకు వచ్చిందని, ఇంకా ఎంత మంది రైతులతో భూమిని సేకరించాల్సి ఉందని అడిగారు. రైతులతో విల్లింగ్ తీసుకుని భూ సేకరణ ను పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యాలయంలోని వివిధ విభాగాలను కలెక్టర్ పరిశీలించారు. అయితే తహసిల్దార్ కార్యాలయంలో ఒక వైపు నిల్వ చేసిన ఫైళ్ళ మూటలను చూసి వాటిని తీసేయాలని తహసిల్దార్ కు సూచించగా అవి తమ కార్యాలయానికి చెందిన ఫైల్స్ కాదని, విద్యాశాఖ కు చెందినవని తహసిల్దార్ తెలపడంతో వాళ్ళ ఫైల్స్ వాళ్ళ కార్యాలయంలోనే పెట్టుకోవాలని, ఇక్కడ ఎందుకు వేశారని అసహనం వ్యక్తం చేస్తూ విద్యా శాఖ కార్యాలయ ఉద్యోగిని పిలిపించి ఆ ఫైల్స్ ను తీసుకెళ్లాలని ఆదేశించారు. అలాగే తహసిల్దార్ కార్యాలయంలో తాళం వేసిన గదిలోనూ కొన్ని ఫైల్స్ ఉన్నాయని, వాటిని కూడా తీసుకువెళ్లాలని సూచించగా తమ కార్యాలయంలో స్థలం లేకపోవడంతో వాటిని ఇక్కడ పెట్టామని విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి శ్రీనివాస్ తెలపగా, అవన్నీ ఏమీ చెప్పవద్దని, వెంటనే వాటిని తీసుకు వెళ్ళాలని కలెక్టర్ తేల్చి చెప్పారు. జిల్లా కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ఇలా ఉంటే ఎలా అని, కార్యాలయాన్ని శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యాలయం పక్కనే ఖాళీగా ఉన్న స్థలం ఎవరిదని? ప్రభుత్వానిదే అయితే అక్కడ కొత్త భవనాలను నిర్మించుకోవచ్చు అని తహసిల్దార్ కు తెలిపారు.

# మరికల్ సర్వేనెంబర్ ఒకటి భూ సర్వే...

### – మరికల్ మండల సర్వే అధికారి కృష్ణయ్య.....

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి – అక్టోబర్– 31.**

నారాయణపేట జిల్లా కేంద్రంలోని మరికల్ మండలం లో సర్వే నంబర్ ఒకటిలో ఉన్న భూమి లో ఉన్న దుకాణాలు, డబ్బాలు,కూరాగాయ అంగళ్ళు, తోపుడు బండ్లు, ఇతరములు ఎన్ని ఉన్నాయని నారాయణపేట జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు,వాటి పూర్తి వివరాలు మరికల్



మండల సర్వే అధికారి కృష్ణయ్య,ఆధ్వర్యం లో శుక్రవారం సర్వే చేశారు. వీటి పూర్తి వివరాలను నారాయణపేట జిల్లా కలెక్టర్కు నివేదికను అందజేయడం జరుగుతుందని మండల సర్వే అధికారి కృష్ణయ్య వివరించారు. ఈ సర్వే కార్యక్రమంలో అసిస్టెంట్ సర్వేర్లు ఆంజనేయులు, అబ్బాస్,రమేష్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు సామర్థ్యాలు సాధించే విధంగా కృషి చేయాలి

### పాఠశాల పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

### జిల్లా పాలనాధికారి సిక్తా పట్నాయక్.

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి, అక్టోబర్– 31.**





విద్యార్థులు తమ సామర్థ్యాలు పెంచుకునేందుకు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సూచించారు. శుక్రవారం ఆమె నారాయణ పేట జిల్లాలోని ఉట్కూరు మండలం కేంద్రంలోని మండల ప్రాథమిక సిపిఎస్ పాఠశాలను అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల వివరాలను హెచ్ఎం ను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యం పెంచేందుకు ఏ విధమైన చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. అందులో భాగంగా నాలుగో తరగతి విద్యార్థుల తరగతి గదిలో ఉపాధ్యాయురాలుగా మారి విద్యార్థులచే గణితం ప్రశ్నలను బోర్డుపై ప్రశ్నలు వేసి జవాబులను రాబట్టారు. అక్కడ ఉన్న విద్యార్థులు లెక్కలను ఎంతో చాకచక్యంగా చేయడంతో విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. రెండో తరగతి విద్యార్థులకు జాలిఫానిక్స్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ద్వారా ఆంగ్ల విషయంలో నైపుణ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులు సౌండ్ ఆధారంగా ఆంగ్ల పదాలను చదివారు. జిల్లాలో యంగ్ ఓలేటర్ క్లబ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు పిక్చర్ రీడింగ్ ద్వారా షోకేస్ నిర్వహించారు. అనంతరం పాఠశాలలోని రికార్డులను పరిశీలించారు. విద్యార్థుల అనుపస్థితి పట్ల ఆసనం వ్యక్తం చేస్తూ హాజరు శాతాన్ని పెంచే విధంగా కృషి చేయాలని హెచ్ ఎం ను ఆదేశించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలు తీరుని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని నాణ్యత పాటించాలని ఆదేశించారు. పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతూ పాఠశాలకు రాని తోటి స్నేహితులను ఇంటి దగ్గరికి వెళ్లి వాళ్లను కూడా పాఠశాలను తీసుకురావాలని ఆమె సూచించారు. విద్యార్థులు పాఠశాలకు వస్తేనే విద్యార్థుల నైపుణ్యం మెరుగు అవుతుందన్నారు. విద్యార్థులకు యూనిఫార్మ్ వచ్చాయా లేదా ప్రతి విద్యార్థికి రెండు జతల స్కూల్ యూనిఫామ్ ను ఇవ్వాలన్నారు. తర్వాత పాఠశాల ఆవరణలోనే ఉన్న అంగన్వాడీ 4, 12 సెంటర్ లను కలెక్టర్ తనిఖీ చేశారు. అంగన్ వాడీ టీచర్ ఆలస్యంగా రావడంపై వివరణ కోరగా మీటింగ్ కు వెళ్ళి రావడం వల్ల ఆలస్యం అయిందని టీచర్ సంజాయిషీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సెక్టోరల్ అధికారి శ్రీనివాస్, సి ఎం ఓ రాజేంద్రకుమార్ ,మండల విద్యాశాఖ అధికారి మాధవి కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కుసుమ పాఠశాల హెచ్ ఎం తదితరులు పాల్గొన్నారు.

### పత్తి మిల్లును సందర్శించిన కలెక్టర్

ఉట్కూర్ మండలం తిప్రాస్ పల్లి గ్రామ సమీపంలో లో గల విజయ్ కాటన్ మీల్ ను శుక్రవారం కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆకస్మికంగా సందర్శించారు. మిల్లు లో ఉన్న రైతులతో మాట్లాడి పత్తిని అమ్మడానికి ఎలా తీసుకువచ్చారని వాకబు చేయగా కపాస్ కిసాన్ యాప్ ద్వారా స్లాట్ బుక్ చేసుకొని మిల్ కు తీసుకొచ్చామని ఆ రైతు తెలిపారు. అనంతరం కలెక్టర్ మిల్లులో పత్తి తుకాలు, కంప్యూటర్ లో కొనుగోళ్ల వివరాలను పరిశీలించారు. పత్తి రైతులు కపాస్ కిసాన్ యాప్ ను వినియోగించుకుని పత్తిని మద్దతు ధరకు విక్రయించి లాభ పడాలని ఆమె కోరారు. తహసిల్దార్ చింత రవి, ఏవో గణేష్ రెడ్డి తదితరులున్నారు.

# జాతీయ సమైక్యతకు నిదర్శనం సర్దార్ వల్లభభాయ్ పటేల్

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31:**






దేశ ప్రజలందరినీ ఏకతాటి పైకి తీసుకువచ్చి జాతీయ సమైక్యతకు నిదర్శనంగా నిలిచిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల నుండి ఐబి చౌరస్తా వరకు నిర్వహించిన రన్ ఫర్ యూనిటీ 2కె రన్ కార్యక్రమాన్ని డిసిపి ఎ భాస్కర్, మంచిర్యాల ఎసిపి ప్రకాష్, జిల్లా క్రీడా యువజన సర్వీసుల అధికారి హనుమంతరావు లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, దేశ ప్రజలందరినీ ఐక్యం చేస్తూ జాతీయ సమైక్యతకు కృషి చేసిన మహనీయుడు సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని అన్నారు. కుల, మత, వర్గ, వర్ణ, ప్రాంతీయ, సాంస్కృతిక విభేదాలు లేకుండా ప్రజలందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చారని, భారతదేశ మొదటి ఉప ప్రధానమంత్రిగా దేశానికి విశిష్ట సేవలు అందించారని తెలిపారు. దాదాపు 530 రాష్ట్రాలను భారతదేశంలో విలీనం చేశారని, పౌర హక్కులు, రైతు ప్రయోజనాల కోసం కృషి చేశారని తెలిపారు. ప్రజలందరూ ఐక్యతతో ముందుకు సాగితే రాష్ట్రం, దేశ అభివృద్ధి సాధ్యపడుతుందని, దేశభక్తి, సమైక్యత భావం ప్రతి ఒక్కరిలో ఉండాలని తెలిపారు. ప్రజల సంక్షేమం, దేశ అభివృద్ధికి కృషిచేసిన మహనీయుల ఆశయాలను యువత సమిష్టిగా ముందుకు తీసుకువెళ్లాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31:**

జిల్లాలో నవంబర్ 1వ తేదీ నుండి పత్తి కొనుగోలు చేపట్టనున్న పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండలంలోని మహేశ్వరి కాటన్స్, శ్రీరామా జిన్నింగ్– ప్రెస్సింగ్ యూనిట్ లను మండల తహశీల్దార్ జ్యోత్స్న తో కలిసి సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం సిసిఐ ద్వారా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి మద్దతు ధర చెల్లించి రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. 2025– 26 సంవత్సరంలో మద్దతు ధర క్రింద సిసిఐ కు పత్తి విక్రయించేందుకు ప్రభుత్వం ప్రారంభించిన కపాస్ కిసాన్ యాప్ లో రైతులు తమ వివరాలు నమోదు చేసుకుని, పత్తి విక్రయానికి స్లాట్ బుక్ చేసుకునే విధంగా రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. నిబంధనల ప్రకారం పత్తిలో తేమ శాతం, ఇతర అంశాలను పరిగణలోకి తీసుకుని రైతుల వద్ద నుండి పత్తి కొనుగోలు చేయాలని సూచించారు. ఆధార్ నంబర్ కు అనుసంధానం చేయబడిన బ్యాంకు ఖాతాలో మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఆధార్ కార్డులో ఫోటో కలిగి ఉన్న రైతు మాత్రమే తక్పట్టిలో ఫోటో దిగవలసి ఉంటుందని తెలిపారు. దళారులు కొనుగోలు చేసిన పత్తిని కొనుగోలు కేంద్రాలలోనికి అనుమతించకూడదని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# సకల సదుపాయాలతో విద్యార్థులకు నాణ్యమైన విద్య

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**అక్షర కలం, మంచిర్యాల జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 31:**



ప్రభుత్వ పాఠశాలలలో విద్యార్థులకు సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యను అందించడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని కాసిపేట మండల కేంద్రంలో గల కస్తూరిబా



గాంధీ బాలికల విద్యాలయాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ సింగ్, మండల పంచాయతీ అధికారి సప్దర్ అలీ లతో కలిసి ఆకస్మికంగా సందర్శించి తరగతి గదులు, వంటశాల, రిజిస్టర్లు, మధ్యాహ్న భోజనం నాణ్యత, ఇంటర్మీడియట్ అదనపు తరగతి గదుల నిర్మాణ పనులు, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం అన్ని ప్రభుత్వ పాఠశాలలో పూర్తి స్థాయిలో సదుపాయాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ మధ్యాహ్నం భోజనంలో పౌష్టిక ఆహారాన్ని అందిస్తుందని, ఈ క్రమంలో విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో ఆహారం, శుద్ధమైన త్రాగునీటిని అందించాలని తెలిపారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులను నియమించి నాణ్యమైన విద్యా బోధన అందిస్తుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలని, తరగతిలో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల లను సందర్శించి ల్యాబ్, వంటశాల, రిజిస్టర్లు, పరిసరాలను పరిశీలించి అధికారులు, ఉపాధ్యాయులు, అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. విద్యార్థుల సంఖ్య పెంపొందించాలని, విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సదుపాయాలు కల్పించి విద్యా బోధన చేయాలని తెలిపారు. మండలంలోని రేగులగుంట, మల్కాపెల్లి గ్రామాలలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలను సందర్శించి వంటశాలలు, తరగతి గదులు, పరిసరాలను పరిశీలించి విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించి విద్యా బోధన అందించాలని, పాఠశాలలలో అవసరమైన మూత్రశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా మెగా రక్తదాన శిబిరం.

**అక్షర కలం/ భద్రాచలం**

పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా భద్రాచలం పట్టణంలోని అన్నపూర్ణ ఫంక్షన్ హాల్లో భద్రాచలం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు పాల్గొని, రక్తదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “అమరవీరుల త్యాగాలు ఎప్పటికీ మర్చిపోలేవు. పోలీసుల సేవలను స్మరించుకుంటూ రక్తదానం చేయడం స్ఫూర్తిదాయకం” అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ శివ నాయక్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్,స్వచ్ఛందంగారక్తదానంచేశారు. అలాగే సిఆర్పిఎఫ్ బెటాలియన్ జవాన్లు, పోలీసు సిబ్బంది, ఆటో యూనియన్ సభ్యులు, వికలాంగులు, బార్ అసోసియేషన్



న్యాయవాదులు ఉత్సాహంగా రక్తదానంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ మ్రినాలి శ్రేష్ట, సిఐ నాగరాజు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రామకృష్ణ, ఎస్ఐలు సతీష్, శ్యామ్ ప్రసాద్, ట్రాఫిక్ ఎస్ ఐ తిరుపతి, మండల నాయకులు, కార్యకర్తలు, మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎంపీ వద్దిరాజు మాజీ ఎమ్మెల్యే సండ్రతో కలిసి నూతన వధూవరులకు ఆశీస్సులు



**అక్షర కలం/ ఖమ్మం ప్రతినిధి:**

బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య,ప్రముఖ వ్యాపారవేత్త మరికల్ పోత సుధీర్ కుమార్ తదితరులతో కలిసి అక్షింతలు వేసి పుష్పగుచ్ఛమిచ్చి నూతన వధూవరులు కార్తికేయ–యశస్విలను ఆశీర్వదించారు.ఎమ్మెల్సీ ఏల్.రమణ–సంధ్య దంపతుల కనిష్ఠ కుమారుడు కార్తికేయ పెళ్లి కే.అజయ్ కుమార్ రెడ్డి –మణిమాల దంపతుల జ్యేష్ఠ కుమార్తె యశస్వినితో శంషాబాద్ ఏస్ఏస్ కన్వెన్షన్ హాలులో శుక్రవారం ఘనంగా జరిగింది.ఈ సందర్భంగా ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే వెంకటవీరయ్య తదితర ప్రముఖులు నూతన వధూవరులను ఆశీర్వదించి, వారి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని... - కొల్చారంలో టు కే రన్ ప్రారంభించిన ఎస్సై మహమ్మద్ మొహినుద్దీన్....





**కొల్చారం, అక్టోబర్ 31 ( అక్షర కలం):-**

సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కొల్చారంలో 2 కే రన్ నిర్వహించినట్లు కొల్చారం ఎస్సై అహ్మద్ మోహినుద్దీన్ తెలిపారు. మెదక్ జిల్లా మండల కేంద్రమైన కొల్చారంలో శుక్రవారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో 2 కే రన్ నిర్వహించారు. స్థానిక పోలీస్ స్టేషన్ నుంచి బస్టాండ్ గుండా వరిగుంతం రోడ్ వరకు 2 కే రన్ నిర్వహించారు. అనంతరం బస్టాండ్ వద్ద మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై అహ్మద్ మొయిద్దీన్ మాట్లాడుతూ టు కె రన్ యువతలో దేశభక్తి, సమైక్యత స్ఫూర్తి నింపుతుందన్నారు. ఈ సందర్భంగా విజేతలకు మెడల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సత్యనారాయణ రాజ్, ఏఎస్ఐ లక్ష్మీరెడ్డి, పోలీస్ సిబ్బంది సుధాకర్, అశోక్, జోగయ్య, సీనియర్ సిటిజెన్లు సంజీవరావు, శేఖర్, ఆయా గ్రామాలకు చెందిన ఆయా పార్టీల నాయకులు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

# నేడు మరికల్ పెద్ద చెరువు లో చేప పిల్లలు విడుదల .

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి,అక్టోబర్ - 31,**



నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని పెద్ద చెరువులో మత్స్యకారుల ఆధ్వర్యంలో శనివారం చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నారాయణపేట జిల్లా మత్స్య కార్మికుల సంఘం నాయకులు కాని గంటి నారాయణ మరికల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. మరికల్, మండల లో ని చుట్టుపక్కల గ్రామాల మత్స్యకారులు, కుల పెద్దలు మరికల్ పెద్ద చెరువు దగ్గరికి రావాలని ఆయన కోరారు. చేప పిల్లల విడుదల కార్యక్రమానికి నారాయణపేట జిల్లా మత్స్యకారులు, నాయకులు అధికారులు పాల్గొంటారని ఆయన వివరించారు.

# రన్ ఫర్ యూనిటీ,మరికల్ సర్కిల్,

**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి అక్టోబర్- 31**

సర్దార్ వల్లభాయ్ పటేల్ 150 వ జయంతి సందర్భంగా మరికల్ మండల కేంద్రంలో శుక్రవారం పోలీస్ వారి ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ 2 కే రన్, ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మరికల్ సి ఐ రాజేందర్ రెడ్డి , మరికల్ ఎస్సై రాములు , నర్వ ఎస్సై రమేష్ , ధన్వాడ ఎస్సై రాజశేఖర్ , మరియు పోలీస్ సిబ్బంది,మరికల్ గ్రామ యువకులు, విద్యార్థులు, స్థానికులు, అఖిలపక్ష నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# మూగ "రోదన"

## జీవాలకు అందని నట్టల నివారణ మందులు

## గత రెండున్నర సంవత్సరాలుగా

## నిలిచిన సరఫరా

## పెంపకం దారులపై ఆర్థికభారం

## నల్లగొండ జిల్లాలో 12 లక్షల గొర్లు, 2 లక్షల మేకలు

**అక్షరకలం నల్గొండ**





నల్గొండ జిల్లాలో మూగజీవాలకు సరైన వైద్యం అందడంలేదు. కనీసం జీవాల్లో నట్టల నివారణకు కూడా మందులు లేని దయనీయ పరిస్థితి నెలకొంది. గడిచిన రెండున్నరేళ్లుగా నట్టల నివారణ మందులు పశుసంవర్ధకశాఖకు సరఫరా కావడం లేదు. దీంతో చేసేది లేక గొర్రెల, మేకల పెంపకందారులు ప్రైవేటు గా మందులు కొని జీవాలకు తాపిస్తున్నారు.

### చలి, వర్షాకాలంలో తీవ్ర ప్రభావం...

బాహ్య, అంతర్ పరాన్నజీవులుగా నట్టలు రెండు రకాలుగా ఉంటాయి. బాహ్య పరాన్నజీవులు (టిక్స్, ఫ్ లైస్, మైక్స్) మూడు రకాలుగా ఉంటాయి. ఇవి మేకలు, గొర్రెల శరీరంపై బాగాన అంటే చెవులు, గొంతు కింద, పొదుగు వద్ద ఏర్పడతాయి. ఇక అంతర్ పరాన్న జీవులు నులి పురుగులు, పొట్ట జలగలు, బద్దె పురుగులుగా మూడు రకాలుగా ఉంటాయి. ఇవి శరీరం లోపల కాలేయం, పేగులు తదితర వాటిలో ఏర్పడతాయి. ఇలా అంతర్, బాహ్య పరాన్న జీవులను నట్టలు అని పిలుస్తారు. నట్టలు ప్రధానంగా వర్షాకాలం, చలికాలంలో వాతావరణం చల్లగా ఉన్నప్పుడు ఏర్పడతాయి. ఈ వ్యాధిగ్రస్థ జీవాలు ఆరుబయట మేత పైన కాని, తాగునీటి పైన కానీ మల విసర్జన చేస్తే ఆమేతను తిన్న, ఆనీటిని తాగిన ఇతర ఆరోగ్యకరమైన జీవాల్లో కూడా నట్టలు ఏర్పడతాయి. నట్టలు ఏర్పడితే జీవాలు మేత తినక బలహీనంగా మారుతాయి. ఆ తర్వాత రక్తహీనత, తీవ్ర అనారోగ్యానికి గురవుతాయి. బరువు తగ్గి కొన్ని సందర్భాల్లో మృతి చెందుతాయి.

### బడ్జెట్ కేటాయింపు ఏది..?

జీవాల్లో నట్టల నివారణకు మందుల కోసం పశుసంవర్ధకశాఖకు ప్రభుత్వం బడ్జెట్ కేటాయించేది. ఈ బడ్జెట్ తో ప్రతి ఏటా రెండు నుంచి మూడు విడతలుగా (జనవరి నుంచి ఫిబ్రవరి, జూన్ నుండి జూలై, అక్టోబర్ నుంచి నవంబర్) ప్రత్యేక శిబిరాలు నిర్వహించి ఆల్బెండజోల్, ఫిల్మెండజోల్ మందులను జీవాలకు తాపించేవారు. ఇందుకోసం పశు సంవర్ధక శాఖ సిబ్బంది ఆయా మండలాల్లో బృందాలుగా ఏర్పడి, పెంపకందారులకు ముందస్తు సమాచారం అందించి మందులు వేసేవారు. అయితే గడిచిన రెండున్నరేళ్లుగా బడ్జెట్ కేటాయింపు లేకపోవడం వల్ల మందులు రావడం లేదు. జీవాలను పెంచుతున్న పెంపకందారులు చేసేది లేక రూ. వేలకు వేలు వెచ్చించి ప్రైవేట్ మందులను తెచ్చుకుంటున్నారు.

### జిల్లాలో 12 లక్షల గొర్లు, 2 లక్షల మేకలు...

నల్లగొండ జిల్లాలో 12 లక్షల గొర్లు, రెండు లక్షల మేకలు ఉన్నాయి. జీవాల్లో ప్రతి సీజన్ లో నట్టలు ఏర్పడతాయి. ఈ మందులు తాపించకపోతే నట్టలు ఎక్కువ అవుతాయి. జీవాల బాహ్య, అంతర్ శరీర భాగాల్లో నట్టల తీవ్రత ఎక్కువై అవి మృతి చెందే ప్రమాదం ఉంటుంది. దీంతో పెంపకందారులు జీవాలకు తప్పక మందులు తాపిస్తున్నారు. ప్రభుత్వం నుంచి మందులు సరఫరా కాకపోవడం వల్ల వారికి ఆర్థికంగా భారంగా ఉన్నప్పటికీ మందులు వేయాల్సిన పరిస్థితి.

### త్వరలో పంపిణీ...

### డాక్టర్ జివి రమేష్

### (పశు సంవర్ధక శాఖ జెడి నల్గొండ)

గత రెండున్నర సంవత్సరాలకు పైగా నట్టల నివారణ మందులు సప్లై కాలేదు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం నవంబర్ 15వ తేది తర్వాత పంపిణీ జరిగే అవకాశం ఉంది.

# ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ వెంటనే విడుదల చేయాలి

**ఎబిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్**





**అక్షరకలం నల్గొండ**

పెండింగ్ లో ఉన్న స్కాలర్షిప్, ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని బిఆర్ఎస్వి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొమ్మరబోయిన నాగార్జున ముదిరాజ్, కట్ట శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్కాలర్షిప్ లు, ఫీజు డిఎంబర్స్మెంట్ విడుదల చేయాలని కోరుతూ బిఆర్ఎస్వి ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి నేటి వరకు ఒక రూపాయి కూడా విద్యారంగానికి కేటాయించకుండా విద్యా వ్యవస్థను భ్రష్ట పట్టిస్తున్నారని తీవ్రంగా మండిపడ్డారు. ఇప్పటికైనా పెండింగ్లో ఉన్న దాదాపు రూ.9 వేల కోట్ల రూపాయలను ఫీజు రియంబర్స్మెంట్ విడుదల చేయాలని, విద్యార్థుల ఖాతాలలో జమ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా తక్షణమే పూర్తిస్థాయిలో విద్యాశాఖ మంత్రిని నియమించి బెస్ట్ అవైలబుల్ స్కీం విద్యార్థులకు, విదేశీ విద్యా నిధి పథక విద్యార్థులకు పెండింగ్ లో ఉన్న ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విడుదల చేయని పక్షంలో ముఖ్యమంత్రి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. గతంలో కేసీఆర్ విద్యారంగాన్ని బలోపేతం చేసి బడుగు బలహీన వర్గ విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించారని తెలిపారు. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించకుండా సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేస్తూ విద్యార్థుల చావులకు కారణం అవుతున్నారని మండిపడ్డారు. ధర్నా అనంతరం కలెక్టరేట్ ఏవో మోతిలాల్ కు వినతిపత్రం అందజేశారు. ఈ ధర్నా కార్యక్రమంలో బిఆర్ఎస్వి నాగార్జునసాగర్ ఇంచార్జ్ పిల్లి అభినయ్ యాదవ్, నకిరేకల్ నియోజకవర్గ మాజీ ఇంచార్జ్ జెట్టి శివప్రసాద్, పట్టణ ఇంచార్జి ప్రణీత్, జిల్లా నాయకులు నోముల క్రాంతి యాదవ్, మట్టిపల్లి లక్ష్మణ్, కన్నెబోయిన వంశీ, బాలాజీ, భాస్కర్, రమేష్, సతీష్, మహేష్, శంకర్, శ్రీకాంత్, ఆంజనేయులు, గిరి, సంపత్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ నిధులను విడుదల చేసినందుకు ధన్యవాదాలు

**అక్షరకలం నల్గొండ**



గత 2022 వ సంవత్సరం నుండి పెండింగులో ఉన్న అంబేద్కర్ ఓవర్సీస్ కు 303 కోట్లు రిలీజ్ చేసినందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు రాష్ట్ర మాలమహానాడు తరుపున ధన్యవాదాలు తెలియజేస్తున్నామని మాలమహానాడు రాష్ట్ర ప్రధానకార్యదర్శి చేపూరి అనిల్ పేర్కొన్నారు. శుక్రవారం నల్గొండలో జిల్లా కేంద్రం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నిధులు విడుదల కావటం వలన విదేశీ విద్యకై పొరుగు దేశాలకు వెళ్లిన బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎంతో ఊరట కలిగించిందని హర్షం వ్యక్తం చేశారు. 2024 లో వెళ్లిన విద్యార్థులకు సగం ఫీజ్ మాత్రమే చెల్లించడం జరిగిందని వెంటనే మొత్తం ఫీజ్ చెల్లించి బడుగు బలహీన విద్యార్థులకు పూర్తిగా న్యాయం చేయాలని కోరారు.

# బాల్య వివాహాలు జరగకుండా చూడాలి....

### - బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి..

### - జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్..

### - శివ్వంపేటలో డబ్ల్యూ డి సి డబ్ల్యూ ఆధ్వర్యంలో.. - -

### బాల్యవివాహాలనిర్మూలనపై అవగాహన సదస్సు...

**నర్సాపూర్, అక్టోబర్ 31 (అక్షర కలం):-**

బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. శుక్రవారం శివ్వంపేటలో డబ్ల్యూడిసిడబ్ల్యూ (మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ) ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలన, పిల్లలు అభివృద్ధిపై అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాల్య వివాహాలు జరగకుండా గ్రామాలు, తండాల్లో ప్రజలకు అవగాహన కల్పించి బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు, బాల్య వివాహాలు జరిగితే అంగన్వాడీ, ఆశా, పంచాయతీ కార్యదర్శులదే బాధ్యతని హెచ్చరించారు. మెదక్ జిల్లాను బాల్యవివాహాలు జరగని జిల్లాగా మార్చాలని తెలిపారు. పిల్లలందరూ బడిలో ఉండాలన్నారు. పిల్లల చేత పనిచేయడం నేరమని తెలిపారు. కిశోర బాలికలకు సంబంధించిన వివరాలు బి ఎల్ ఓల వద్ద ఉండాలన్నారు. కిషోర్ బాలికలు ఎక్కడ చదువుతున్నారు, ఏం చదువుతున్నారు, ఏం చేస్తున్నారు అన్న విషయం తప్పనిసరిగా సేకరించాలని సూచించారు.



అనంతరం డి డబ్ల్యు ఓ హేమ భార్గవి మాట్లాడుతూ గ్రామాలు తండాల్లో బాల్య వివాహాల నిర్మలనకు అన్ని శాఖల అధికారులు సహకరించాలని తెలిపారు. ఈ సందర్భంగా డబ్ల్యూ డి సి డబ్ల్యూ , ఐసిడిఎస్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో మహిపాల్ రెడ్డి, తాసిల్దార్ కమలాద్రి, ఐసిడిఎస్ మండల సూపర్వైజర్లు సంతోష, వసుమతి, ఐకెపి, అంగన్వాడి, ఆశ, పంచాయతీ సెక్రటేరియట్ లు వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## శ్రీశ్రీశ్రీ మాత మాణిక్యేశ్వరి మాత పై ఆరోపణలు చేయడం సమంజసం కాదు.

- ఆరోపణలు చేస్తే దశలవారీగా ఆందోళన కార్యక్రమాలను నిర్వహిస్తాం.....
- మాధవరం మాణిక్యేశ్వరి మాత భక్తులు ,గ్రామ మాజీ సర్పంచ్ రాజులయ్య....





**అక్షర కలం/నారాయణపేట జిల్లా ప్రతినిధి' అక్టోబర్ - 31.**

శ్రీశ్రీశ్రీ మాతా మాణిక్యేశ్వరి పై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే సహించేదే కాదని మాతా మానికేశ్వరి మాత భక్తులు, మాజీ సర్పంచ్ రాజులయ్య హెచ్చరించారు.తదితర భక్తులు నారాయణపేట జిల్లాలోని మరికల్ మండల కేంద్రంలో శ్రీ శ్రీ శ్రీ మాణిక్యేశ్వరి మాత దేవాలయం వద్ద ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నల్లగొండ జిల్లా కు చెందిన ఇద్దరు వ్యక్తులు శ్రీ శ్రీ శ్రీ మాతా మాణిక్యేశ్వరి మాత పై అసత్యపు ప్రచారాలు చేయడం సమంజసం కాదన్నారు. మాతా మాణిక్యేశ్వరి మాత కు సంబంధించిన భూములు తెలంగాణ కర్ణాటక రాష్ట్రంలో చాలావరకు భూములు ఉన్నాయన్నారు. మాతా మానికేశ్వరికి భక్తుల విరాళాలతో ప్రతి గ్రామంలో దేవాలయాలు నిర్మాణం చేయడం జరిగిందని వారు గుర్తు చేశారు. అట్టి ఆస్తులను మాతామానికేశ్వరి ట్రస్ట్ సభ్యులే కాపాడుకుంటూ వస్తున్నారని ఆయన గుర్తు చేశారు. కొందరు మాతా మాణిక్యేశ్వరి మాత పై అసత్యపు ప్రచారాలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలంటూ శుక్రవారం మరికల్ పోలీస్ స్టేషన్లో మాణిక్యేశ్వరి మాత ట్రస్ట్ సభ్యుల ఆధ్వర్యంలో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు కనకప్ప, ఆంజనేయులు, వెంకటన్న, మొగులన్న, పుణ్యశీల, కాటప్ప, బాలమ్మ, కురువ పెద్ద కట్టప్ప, యాదయ్య, చిన్న కట్టప్ప పాల్గొన్నారు.

## సీపీఐ(ఎం) నేత సామినేని రామారావు దారుణ హత్య

**అక్షర కలం/ చింతకాని:**

ఖమ్మం జిల్లాలో దారుణ ఘటన చోటుచేసుకుంది. సీపీఐ(ఎం) ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కమిటీ మాజీ సభ్యులు ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సామినేని రామారావును గుర్తుతెలియని దుండగులు అత్యంత పాశవికంగా హత్య చేశారు. చింతకాని మండలం పాతర్లపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది.వివరాల్లోకి వెళ్తే.. సామినేని రామారావు రోజూ మాదిరిగానే ఈరోజు ఉదయం వాకింగ్‌కు వెళ్లారు. ఆ సమయంలో మార్గమధ్యంలో ఆయన్ను అడ్డగించిన దుండగులు, పదునైన ఆయుధంతో గొంతుకోసి హతమార్చారు. రక్తపు మడుగులో పడివున్న ఆయన్ను గమనించిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారం




అందించారు.విషయం తెలిసిన వెంటానే సంఘటన స్థలానికి పోలీస్ కమిషనర్ సునీల్ దత్ చేరుకున్నారు. కమిషనర్ కు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, డివిజన్ కార్యదర్శి మేడిపల్లి గోపాలరావు వివరాలు తెలియజేశారు.ఈ సంఘటనపై సీపీ స్పందిస్తూ .. సామినేని రామారావు హత్య కేసు విచారణ చేస్తున్నాము. అన్ని కోణాల్లో దర్యాప్తు చేసి హంతకులను పట్టుకుంటామని తెలిపారు. అనవసర పుకార్లు ప్రచారం చేయవద్దు అని సిపీ అన్నారు సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ మాట్లాడుతూ.. తెల్లవారుజామున కాంగ్రెస్ గుండాలు రామారావుని దారుణగా హత్య




చేశారు. స్థానిక సంస్థల ఎన్నికలలో పాతరపాడు గ్రామపంచాయతీలో ఓడిపోతామని భయంతోనే కాంగ్రెస్ గుండాలు అత్యంత కిరాతకంగా కాపు కాసి హత్య చేశారని ఆయన ఆరోపించారు. సీపీఐ(ఎం) పార్టీ సీనియర్ నేత సామినేని రామారావు రాజకీయ హత్యకు గురికావడంపై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దారుణ ఘటనకు పాల్పడిన దోషులను చట్టపరంగా శిక్షిస్తామని, కలుషిత రాజకీయ హింసకు తావు లేదని ఆయన అన్నారు. అలాగే శాంతిభద్రతలపై ఖమ్మం పోలీస్ అధికారులను హెచ్చరించారు. క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్, సైబర్ టీం వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి దోషులను వెంటనే అరెస్ట్ చేయాలని ఆదేశించారు.

# ధాన్యాన్ని కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలి

### జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి రామడుగులోని కొనుగోలు కేంద్రం ఆకస్మిక తనిఖీ

**అక్షరకలం నల్గొండ**

వర్షాలు తగ్గినందున కొనుగోలు కేంద్రాలలో ఉన్న ధాన్యాన్ని ఆరబెట్టుకుని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. రైతులు వారి ధాన్యాన్ని ఆరబెట్టుకుని సిద్ధంగా ఉన్నట్లయితే కాంటాలు వేసి మిల్లులు పంపిస్తామని చెప్పారు. శుక్రవారం ఆమె నల్గొండ జిల్లా, అనుముల (హలియా) మండలం, రామడుగు లో ఐకెపి ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. కొనుగోలు



కేంద్రంలో ఉన్న ధాన్యం కుప్పలను పరిశీలించిన అనంతరం రైతులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షం తగ్గినందున ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలని, 17శాతం తేమ వచ్చిన వెంటనే కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. రెండు, మూడు రోజుల తర్వాత తిరిగి వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున త్వరితగతిన ధాన్యాన్ని ఆరబెట్టి కొనుగోలు ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందని ఆమె తెలిపారు. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు సైతం సరైన తేమశాతం, నాణ్యత ప్రమాణాలతో ఉన్న ధాన్యాన్ని కొనుగోలు చేసి ఎప్పటికప్పుడు మిల్లులకు పంపించాలని, కొనుగోలు కేంద్రాలలో ఎలాంటి సమస్యలు రాకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా కలెక్టర్ వెంట మిర్యాలగూడ సబ్ కలెక్టర్ నారాయణ అమిత్, డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

# కార్మికులకు అండ ఏఐటీయూసీ జెండా

### దేశంలో ఏర్పడ్డ మొదటి సంఘం ఏఐటియుసి ఘనంగా ఏఐటీయూసీ 106వ ఆవిర్భావ దినోత్సవం ఏఐటీయూసీ కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి

**అక్షరకలం నల్గొండ**

దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి అన్నారు. ఏఐటీయూసీ 106 వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శుక్రవారం నల్లగొండ లో ఏఐటియుసి జెండాను పల్లా దేవేందర్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డి ఈ ఓ ఆఫీస్ వద్ద జెండా ఎగరవేసి అనంతరం జరిగిన సభలో దేవేందర్ రెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర ఉద్యమం లో ఏఐటీయూసీ కీలక పాత్ర పోషించినదని అన్నారు. ఏఐటీయూసీ 1920 అక్టోబర్ 31 న ఏర్పాటు జరిగిన తర్వాత కార్మికుల కు అనేక సంక్షేమ చట్టాలు,హక్కులు, సాధించిన ఘనత ఏఐటీయూసీ దే అని అన్నారు. అటు స్వాతంత్ర




పోరాటం మరోవైపు కార్మిక చట్టాల సాధన కోసం జరిగిన పోరాటం దేశంలో మొదటిసారిగా ఏఐటియుసి నాయకత్వంలోనే జరిగాయని అన్నారు. బ్రిటీష్ వాళ్ళు దేశాన్ని పరిపాలిస్తున్న కాలంలోనే కనీస వేతనాల చట్టం, సంఘం పెట్టుకొనే హక్కును సాధించిన ఘనత ఏఐటియుసి దే అని అన్నారు. మోడీ ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించిన 29 చట్టాల ని 4 కోడ్ లుగా మార్చి హక్కులు లేకుండా చేసి యాజమాన్యంలకు అనుకూలంగా చట్టాలు మార్పులు చేశారు అని ఆరోపించారు. నేడు కేంద్ర ప్రభుత్వం సంఘం పెట్టుకునే హక్కు లేకుండా వేతనాల కోసం సమ్మె చేసే హక్కు లేకుండా చట్టాలు మార్చడం విచారకరమని అన్నారు. దేశంలో ఏర్పడ్డ మొట్టమొదటి కార్మిక సంఘం ఏఐటీయూసీ అని నాటి నుండి నేటి వరకు కార్మికుల హక్కుల కోసం నిరంతరము రాజీలేని సమరశీల పోరాటాలు నడుపుతుందని అన్నారు. కాంట్రాక్ట్ వ్యవస్థ రద్దు కోసం కనీస వేతనాలు అమలు కోసం, ఉద్యోగ భద్రత కోసం రాబోయే కాలంలో పోరాటాలకు సిద్ధం కావాలని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసి జిల్లా ఉపాధ్యక్షులు కే ఎస్ రెడ్డి, జిల్లా కోశాధికారి దొనకొండ వెంకన్న, డివిజన్ కార్యదర్శి విశ్వనాధుల లెనిన్, భవన నిర్మాణ కార్మిక సంఘం పట్టణ అధ్యక్షులు గుండె రవి, కార్యదర్శి రేవల్లి యాదయ్య, నరసింహ, మిషన్ భగీరథ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎండీ. జానీ, కృష్ణ, పోతురాజు నాగరాజు, కంభంపాటి జానయ్యా, లక్ష్మయ్య, గిరి, వీరయ్య, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు. నల్లగొండ మిషన్ భగీరథ వాటర్ ప్లాంట్ వద్ద డి వెంకన్న, సివిల్ సప్లై హమాలి యూనియన్ జెండాను కేస్ రెడ్డి ఎగరవేశారు.

# దేశ ఐక్యమత్యం, పౌరుల ఐక్యమత్యం కోసమే రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం

### జిల్లా కలక్టర్ సిక్తా పట్నాయక్ ,జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ . ...జిల్లా కేంద్రంలో ఘనంగా జాతీయ సమైక్యత దినోత్సవం. ....కార్యక్రమాన్ని ప్రారంభించిన జిల్లా కలెక్టర్ మరియు ఎస్పీ.

**అక్షర కలం/ నారాయణపేట జిల్లా ప్రతినిధి**

ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం మరియు పోలీసు అమరవీరుల వారోత్సవాలు ముగింపు సందర్భంగా జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోనీ అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటుచేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్, అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు ఎస్పి మహమ్మద్ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య లు పూలమాల ఘనంగా నివాళులర్పించడం జరిగింది. అనంతరం అంబేద్కర్ చౌరస్తా నుండి సత్యనారాయణ చౌరస్తా, ఓల్డ్ బస్టాండ్, మెయిన్ చౌక్ నుండి ఎస్పీ కార్యాలయం వరకు పౌరులు, యువత, విద్యార్థులతో కలిసి ఘనంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగినది. ఈ కార్యక్రమాని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఐఏఎస్, ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపిఎస్ గార్లు జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం నందు దేశ ఐక్యమత్యం, పౌరుల ఐక్యమత్యము, దేశ భద్రత దేశ సమగ్రత మరియు దృఢమైన యువత తెలిపే పాటలు నినాదాలతో కలెక్టర్ ఎస్పీ లతోపాటు యువత 2 కే రన్ నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ మాట్లాడుతూ భారతదేశ ఉక్కుమనిషి గా ప్రసిద్ధి చెందిన శ్రీ సర్దార్ వల్లభాయ్ పటేల్ గారు భారతదేశ స్వతంత్ర అనంతరం భారతదేశమంతా ఏకీకృతంగా ఉండాలని దేశంలో ఉన్న సుమారు 560 కి పైగా సంస్థానాలను ఏకీకృతం చేసి భారత దేశ ఐక్యమత్యాన్ని చాటారని అన్నారు. ఈ సందర్భంగా ఈయన జయంతిని జాతీయ ఐక్యమత్య దినోత్సవం గా నిర్వహించుకోవడం జరుగుతుందని దీనిలో భాగంగా ఈరోజు నారాయణపేట జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్ అండ్ రన్ ఫర్ యూనిటీ కార్యక్రమం నందు యువత పాల్గొనడం అభినందనీయమని అన్నారు. దేశ సమగ్రతను దేశ భద్రతను దేశ ఐక్యమత్యాన్ని చాటడంలో యువత ముందుండాలని చెడు అలవాట్లకు చెడు పనులకు దూరంగా ఉంటూ మహానుభావులకు ఘనమైన నివాళి ఘటించాలని ఈ సందర్భంగా కలెక్టర్ గారు కోరారు. జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఐపీఎస్ గారు మాట్లాడుతూ పోలీసు అమరవీరుల వారోత్సవాలు పోలీస్ ఫ్లాగ్ డే కార్యక్రమం ముగింపు మరియు




సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి జయంతి జాతీయ ఐక్యమత్య దినోత్సవం సందర్భంగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈరోజు ఘనంగా రన్ ఫర్ యూనిటీ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమాన్ని పౌరులతో జిల్లా కేంద్రంలో అంబేద్కర్ చౌరస్తా నుండి ఎస్పీ కార్యాలయం వరకు 2%ని% రన్ నిర్వహించడం జరిగిందన్నారు. స్వతంత్ర అనంతరం భారతదేశంలో విడివిడిగా ఉన్న సుమారు 560 సంస్థానాలను ఏకీకృతం చేసి ఒక దృఢమైన దేశంగా నిర్మించడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి కృషి మరువలేనిదని ఆయన సేవలను గుర్తు చేస్తూ ప్రతి సంవత్సరం 31 అక్టోబర్ ను జాతీయ సమైక్యత దినోత్సవం గా నిర్వహిస్తున్నామని దీనిలో భాగంగానే ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఆ మహానుభావుడి ఆశయాలను ముందుకు తీసుకెళుతూ యువత పౌరులు సన్మార్గంలో నడవాలని, సత్ప్రవర్తతో ఉండాలని దృఢమైన ఐకమత్యం గల భారతదేశ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు ఎస్పి మహమ్మద్ రియాజ్ హుల్ హక్, డీఎస్పీ నల్లపు లింగయ్య, సిఐ శివ శంకర్, ఆర్ ఐ నరసింహ, ఎస్ ఐవెంకటేశ్వర్లు , రాముడు, రాజు నరేష్, పోలీసు సిబ్బంది, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.




Printed, Published and Owned by Pittala Ramakrishna, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana) Printed at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada,Nalgonda - 508 001. (Telangana) Published at Pittala Publication, H.No. 6-1-92, Vidyanagar Colony, Boyawada, Nalgonda - 508 001.(Telangana)Editor: PITTALA RAMAKRISHNA, Cell: 9396218955